www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



వామ్మో.. మోమోస్!

కొంపముంచిన కలుషిత చిరుతిండి.. 50మందికి అస్వస్థత

మహిళ మృతి.. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఘటన

నందినగర్, సింగాడికుంట బస్తీలోని సంతలో విక్రయం

బాధితుల్లో అధికులు 20 ఏళ్ల లోపువారే.. తయారీ సంస్థ సీజ్

నాసికరమైన మయనీసే కారణమా? 3

మంగళవారం | 29-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 212 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి ఉ. 10.32 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తర రా. 6.34 తదుపరి హస్త; వర్జ్యం: తె.4.04-5.52, దుర్ముహూర్తం: ఉ.8.33-9.18, రా.9.49-10.37; అమృతఘడియలు: ఉ.10.25-12.13; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.41

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రచ్చ గెలిచి.. ఇంట గెలిచా

'ఏఎన్నార్ నేషనల్ అవార్డు' నాకెంతో ప్రత్యేకం

మా అమ్మ అక్కినేని నాగేశ్వరరావు అభిమాని

సినిమాకు ఆయన సేవలు అనితర సాధ్యం 10

నాగార్జున నాకు స్నేహితుడు, సోదరుడే కాక..

ఆరోగ్యసూత్రాలు చెప్పే వైద్యుడు: చిరంజీవి

అమితాబ్ నుంచి అవార్డునందుకున్న మెగాస్టార్



'మేకిన్ ఇండియా' విమానం

రెండేళ్లలో సీ-295 రవాణా విమానం అందుబాటులోకి.. భవిష్యత్తులో ఎగుమతులు

మా ప్రభుత్వ చర్యలతో ఐదారేళ్లలో దేశంలో 1000 వరకు రక్షణ స్టార్టప్‌లు

పదేళ్లలో రక్షణ ఎగుమతులు 30 రెట్లు.. రతన్ టాటా ఉంటే ఎంతో సంతోషించేవారు

వడోదరలో సీ-295 విమానాల తయారీ కర్మాగారం ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

స్పెయిన్ ప్రధానితో కలిసి ప్రారంభం.. మోదీ విజన్‌కు ఇది నిదర్శనం: సాంచెజ్

2



వడోదరలోని లక్ష్మీవిలాస్ ప్యాలెస్ వద్ద మోదీ, సాంచెజ్ కరచాలనం



ధర్నాచౌక్ వద్ద నిరసన తెలిపేందుకు వచ్చిన టీజీఎస్పీ కానిస్టేబుళ్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

నిరసనలపై నిషేధం

- హైదరాబాద్‌లో నెల రోజుల పాటు 163 సెక్షన్ అమలు
- ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లకు దిగొద్దని ఆదేశాలు
- నలుగురికి మించి గుమికూడితే చర్యలు: సీపీ ఆనంద్
- ధర్నాచౌక్‌లో టీజీఎస్పీ కానిస్టేబుళ్ల నిరసన అడ్డగింత
- 21 మందిపై కేసు.. డిచ్‌పల్లి బెటాలియన్‌లో ర్యాలీ
- సచివాలయ భద్రతా సిబ్బంది నిరసనలకు వెళ్లొద్దు
- సోషల్ మీడియా గ్రూప్‌ల నుంచి వైదొలగాలి: సీఎస్‌వో

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/కవాడిగూడ/డిచ్‌పల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బంది ఆందోళనల నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలో నెల రోజులపాటు బీఎన్ఎస్ 163 సెక్షన్ (గతంలో 144 సెక్షన్)ను విధిస్తూ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సిటీ కమిషనరేట్

మిగతా 13వ పేజీలో...

సీఎం నివాసం వద్ద భద్రతలో మార్పు

టీజీఎస్పీ సిబ్బంది తొలగింపు

వారి స్థానంలో ఏఆర్ సిబ్బంది నియామకం

13

నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల స్థలాల ఎంపిక ఆయనదే

నీటిని నిల్వ చేయాలన్నదీ మాజీ ముఖ్యమంత్రే.. హై పవర్ కమిటీ సమావేశాల్లోనే నిర్ణయాలు

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌తో మాజీ ఈఎన్సీ.. సంబంధిత పత్రాలు అందజేసిన నల్లా వెంకటేశ్వర్లు

అంచనాలు, సవరణలకూ కేసీఆరే ఆమోదం తెలిపారని వెల్లడి



హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించడానికి స్థలాలను ఎంపిక చేయడం; బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం; ఆ నిల్వలను పెంచడం వంటి కీలక నిర్ణయాలన్నిటినీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆరే తీసుకున్నారని రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ మేరకు తగిన ఆధారాలను; సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరిగిన సమావేశ పత్రాలను జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు సమర్పించారు. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణలో భాగంగా సోమవారం ఆయన మరోసారి కమిషన్ ఎదుట క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరయ్యారు. ఇంతకుముందు కమిషన్ అడిగిన 16 ప్రశ్నలకు సంబంధించి తాను ఇచ్చిన జవాబులకు అనుగుణంగా సంబంధిత పత్రాలను అందజేశారు. డీపీఆర్ తయారీ బాధ్యతను వ్యాప్కోస్‌కు అప్పగించాలని ఆదేశించింది ఎవరు? ఆ డీపీఆర్‌లకు ఎవరు ఆమోదం తెలిపారు!? బ్యారేజీలను ఫలానా

మిగతా 13వ పేజీలో...



కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరైన మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు

2019లోనే బుంగలు

- కాంక్రీటు బ్లాకులు, ఆప్రాన్లూ దెబ్బతిన్నాయి
- 3 ఏళ్లు రిపేర్లు లేక 7వ బ్లాకు కుంగింది 12
- నిర్మాణ సంస్థ, మాజీ ఈఎన్సీ, 15 మంది అధికారులు బాధ్యులు.. చర్యలు తీసుకోండి
- నీటి పారుదల శాఖకు విజిలెన్స్ తుది నివేదిక

డిజైన్ ఒకలా.. నిర్మాణం మరోలా.. 13

నీటి నిల్వతోనే కుంగుబాటు

ఆపరేషన్-మెయింటెనెన్సూ లేదు

నిపుణుల కమిటీ స్పష్టీకరణ

జస్టిస్ ఘోష్ కమిషన్‌కు నివేదిక



ఉక్రెయిన్ - రష్యా చర్చలు భారత్‌లోనే..

అయితే మా షరతుల ప్రకారం జరగాలి

యుద్ధాన్ని నరేంద్ర మోదీ ఆపగలరు!

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబరు 28: తమ దేశంపై రష్యా యుద్ధాన్ని ఆపేందుకు భారత ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆకాంక్షించారు. ఈ సంక్షోభాన్ని ఆయన ఆపగలరని వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ సోమవారం ఓ జాతీయ ఆంగ్ల పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'జనాభా, ఎకానమీ, పలుకుబడి, ప్రభావపరంగా భారత్ అతిపెద్ద దేశం. అంత పెద్ద దేశానికి మోదీ ప్రధానిగా ఉన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆయరు ఆపగలరు. తదుపరి శాంతి చర్చలు ఇండియాలో జరుగుతాయని ఆశిస్తున్నాను. యుద్ధాన్ని ఆపే ప్రయత్నాలు మోదీ కచ్చితంగా చేయగలరు. చర్చలకు అందరం సన్నద్ధం కావాలి. అయితే మేం కోరుకుంటున్న ఫార్మాట్లో అంటే మా షరతుల ప్రకారం ఇవి జరగాలి. ఎందుకంటే యుద్ధం మా భూభాగంలో మాపై జరుగుతోంది' అని తెలిపారు. తమ ఇంధన మౌలిక వసతులపై రష్యా దాడులు.. తమ భూభాగంలోకి చొచ్చుకొస్తుండడం.. శీతాకాలం

మిగతా 2వ పేజీలో...

వీసా లేకుండానే రష్యాకు!

భారతీయులకు శుభవార్త 2

వచ్చే ఏడాది స్ప్రింగ్ సీజన్ నుంచి అమలు?



గృహ విద్యుత్ చార్జీలు పెరగలే!

కనీస నెలవారీ చార్జీల విధానం రద్దు

'హెచ్‌టీ'లో హేతుబద్ధీకరణకు బ్రేక్

పంపిణీ సంస్థలకు ఈఆర్‌సీ షాక్

11,499 కోట్లుగా ప్రభుత్వ సబ్సిడీ

ఈవీ కేంద్రాలకు స్థిర చార్జీల్లేవు

నిర్ణయాలు 1 నుంచి అమల్లోకి..

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) శుభవార్త వినిపించింది. హైటెన్షన్(హెచ్‌టీ) వర్గాలకు కరెంట్ చార్జీలను హేతుబద్ధీకరించాలని, వివిధ వర్గాలకు స్థిర చార్జీలు పెంచాలని.. విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) చేసిన ప్రతిపాదనలను తిరస్కరించింది. కనీస నెలవారీ చార్జీల విధానాన్ని తొలగించింది. 800 యూనిట్లకు పైబడి విద్యుత్ వినియోగించేవారికి మాత్రం స్థిరచార్జీలను ప్రస్తుతం ఉన్న రూ.10 నుంచి రూ.50కి పెంచడానికి అనుమతిచ్చింది. ఈఆర్‌సీ నిర్ణయం నవంబరు 1 నుంచి అమల్లోకి రానుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను డిస్కమ్‌లు దాఖలు చేసిన వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్‌ఆర్)పై ఈ నెల 23, 24 తేదీల్లో ఈఆర్‌సీ బహిరంగ విచారణ

మిగతా 10వ పేజీలో...

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జున్

నేడు బాధ్యతల స్వీకరణ 10

'భూదాన్'పై నజర్!

తిమ్మాపూర్ భూ కుంభకోణంపై ప్రభుత్వం ఆరా

తక్షణమే చర్యలకు సీఎంవో ఆదేశం.. భూముల్ని పరిశీలించిన అధికారులు

ఆక్రమణ బాధ్యులపై క్రిమినల్ కేసులకు రంగం సిద్ధం

భూముల స్వాధీనం తర్వాత ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేసే ఆలోచన!



తిమ్మాపూర్‌లో భూదాన్ భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ భూదాన భూముల కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. తక్షణమే విచారణ జరిపి, చర్యలు చేపట్టాలని సీఎం కార్యాలయం ఆదేశించింది. హైదరాబాద్ శివార్లలోని కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో 200 కోట్ల విలువైన 40 ఎకరాల భూదాన భూముల అన్యాక్రాంతంపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు బడా నేతలు బినామీలను అడ్డుపెట్టుకుని భూదాన భూములను దొడ్డిదారిన పట్టా భూములుగా మార్చిన వైనంపై 'నాయకుల భూదాహం.. అధికారుల భూదానం' శీర్షికతో

మిగతా 14వ పేజీలో...



ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్స్ కమిషనర్‌గా శశాంక

కొత్త కొలువును సృష్టించిన ప్రభుత్వం

భారీగా ప్రత్యేక కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీ.. 70 మందికి స్థానచలనం

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పోస్టును సృష్టించింది. రాష్ట్రంలో అమలు చేస్తున్న కొత్త పథకాలు, కార్యక్రమాలను పర్యవేక్షించేందుకుగాను 'స్టేట్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్స్ కమిషనర్' పేర ఈ పోస్టును ఏర్పాటు చేసింది. దీనికి.. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న కె.శశాంకను కమిషనర్‌గా నియమించింది. ఆయన స్థానంలో.. నలగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 70 మంది ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ శాంతి కుమారి

మిగతా 13వ పేజీలో...

కొకైన్ చుట్టూనే..

పార్టీలోకి ఆ డ్రగ్ ఎలా వచ్చింది?

విజయ్‌కు ఎవరు సరఫరా చేశారు?

కొనసాగుతున్న పోలీసుల విచారణ

రాజ్ పాకాలకు నోటీసులు జారీ

48 గంటల్లో వస్తానంటూ లేఖ

విచారణకు రాని విజయ్ మద్దూరి

ఫాంహౌస్ పార్టీకి హాజరైన అందరికీ త్వరలో నోటీసులు



మోకిల ఠాణాకు వచ్చిన రాజ్ లాయర్లు

శంకర్‌పల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్‌లో జరిగిన పార్టీపై విచారణ కొనసాగుతోంది. రాజ్ సన్నిహితుడు విజయ్‌కి డ్రగ్ పరీక్షలో కొకైన్ పాజిటివ్‌గా తేలిన సంగతి తెలిసిందే. కొకైన్‌ను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? విజయ్‌కి ఎవరు సరఫరా చేశారు? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. అలాగే పార్టీ సమయంలో కాయిన్స్ రూపంలో పేక ఆడినట్లు తేలితే గేమింగ్ చట్టం కింద మరో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. విచారణకు గైర్హాజరవుతున్న రాజ్ పాకాలకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. రాయదుర్గంలోని ఓరియన్

మిగతా 12వ పేజీలో...

రెండు రోజుల సమయం ఇవ్వండి

ఆలోపు రాజ్ పాకాల పోలీసుల ఎదుట హాజరు కావాలి 12

విచారణకు సహకరించకపోతే చర్యలు తీసుకోవచ్చు: హైకోర్టు

ఫాంహౌస్ కేసులో ఆదేశాలు

కేటీఆర్ బావమరిదిని కాబట్టే టార్గెట్ చేశారు: రాజ్ పాకాల

హే రఘురాం!



తండ్రి సీఎంగా ఉన్నప్పుడు 2006లో జగన్ చేతికి రఘురాం సిమెంట్స్

కడపలో అడ్డగోలుగా 2 వేల ఎకరాల సున్నపురాయి గనులు లీజుకు

జగన్ పెట్టుబడి 45 కోట్లే.. 2008 నాటికి ఆ విలువ 6,500 కోట్లు

భారతి సిమెంట్స్‌గా మార్పు.. ప్రస్తుత వాటా 20 వేలకు కోట్లకు పైనే

తండ్రి అధికారం అండగా క్విడ్ ప్రోకో!.. గతంలో సీబీఐ తీవ్ర అభియోగాలు

దాల్మియాకు 1017 ఎకరాల గనులు లీజుకు.. ప్రతిఫలంగా భారతిలో 50 కోట్ల పెట్టుబడి 14

వచ్చే ఏడాది జనగణన

2025 మొదట్లో షురూ.. 2026లో పూర్తి.. ఆ తర్వాత లోక్‌సభ సీట్ల పునర్విభజన 2

రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ పదవీకాలం ఆగస్టు దాకా పొడిగింపు

అఖిలపక్ష భేటీ నిర్వహణకు కాంగ్రెస్ డిమాండ్



6 నుంచి రాష్ట్రంలో కులగణన 13

7 పేజీలు.. 75 ప్రశ్నలు.. వ్యక్తిగత, కుటుంబ వివరాల సేకరణ

'ఆధార్' తప్పనిసరి కాదు.. రాజకీయం, వలసపై ప్రశ్నలు

ఆర్మీ అంబులెన్స్‌పై ఉగ్రదాడి

» ఎదురుకాల్పుల్లో ముగ్గురు ముష్కరుల హతం

» జమ్మూకశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టారులో ఘటన

శ్రీనగర్, అక్టోబరు 28: జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్రదాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. భద్రతా సిబ్బంది, వలస కూలీలపై ముష్కరులు గత కొంత కాలంగా కాల్పులకు తెగబడుతూ రెచ్చిపోతున్నారు. సోమవారం ఉదయం జమ్మూలోని అఖ్నూర్ సెక్టారు వద్ద ఆర్మీ అంబులెన్స్‌పై ముగ్గురు ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘనటలో జవాన్లు ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. ఉగ్రదాడిలో ఓ పోలీసు జాగిలం చనిపోయిందని చెప్పారు. తక్షణమే స్పందించిన భద్రతా సిబ్బంది ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టారు. కనీసం ముగ్గురు ముష్కరులను హతమార్చినట్లు, వారి వద్ద నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. మిగతా వారి కోసం ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా గస్తీ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కాగా, 4 రోజుల క్రితం గుల్మార్గ్ సెక్టారు సమీపంలో సైనిక వాహనంపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. అక్టోబరు 20న ముష్కరులు జరిపిన కాల్పుల్లో ఓ డాక్టర్‌తో పాటు ఆరుగురు వలసకార్మికులు మృతి చెందారు.

ఎస్సీ కుల వర్గీకరణకు కర్ణాటక క్యాబినెట్ ఓకే

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల వర్గీకరణకు కర్ణాటక కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రయోగాత్మకంగా డేటా సేకరించేందుకు హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిషన్ ఏర్పాటు చేస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు తెలిపారు. కేబినెట్ నిర్ణయాలను మంత్రి సోమవారం మీడియాకు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్రంలో చర్చలు సాగుతున్నాయని, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో వర్గీకరణకు మంత్రివర్గ ఆమోదం తెలిపిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే కమిషన్ నుంచి నివేదిక అందాక తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. మూడు నెలల్లోగా సదరు కమిషన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని అన్నారు.

మహారాష్ట్ర ఎన్నికలకు బీజేపీ మూడో జాబితా

ముంబై, అక్టోబరు 28: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ సోమవారం 25 మంది అభ్యర్థులతో మూడో జాబితాను ప్రకటించింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఇద్దరికి అలాగే మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడనవీస్ పీఏకు అవకాశం కల్పించింది. 2021 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన జితేశ్ అంతపుర్కార్ ఇటీవల బీజేపీలో చేరగా.. ఆయన్ను దెగ్లూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ బరిలోకి దింపింది. అలాగే ఈ ఏడాది మార్చిలో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన శివరాజ్ పాటిల్ మేన కోడలు అర్చనా పాటిల్‌ను లాతూర్ సిటీ నియోజకవర్గం నుంచి పోటీ చేయిస్తోంది. బీజేపీ సోమవారం ప్రకటించిన 25 మంది అభ్యర్థులతో 146 నియోజకవర్గాలకు.. ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించినట్లయింది. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే దఫాలో నవంబరు 20న ఎన్నికలు జరగనున్నాయి.

ప్రియాంక నామినేషన్‌కు ఆమోదమెలా?: బీజేపీ

న్యూఢిల్లీ, అక్టోబరు 28: వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకా నామినేషన్‌ను ఈసీ ఆమోదించడం పట్ల బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవియా మండిపడ్డారు. ప్రియాంక... తనతో పాటు తన భర్త రాబర్ట్‌వాద్రాకు సంబంధించిన ఆస్తి వివరాలను పూర్తిగా బహిర్గతం చెయ్యలేదని ఆరోపించారు. "అఫిడవిట్‌లో ప్రియాంకా పాక్షిక వివరాలే పొందుపరిచారు. అసోసియేటెడ్ జర్నల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడిచే 'నేషనల్ హెరాల్డ్' పత్రికలో పెట్టుబడుల గురించి వెల్లడించకపోగా, ఎఫ్ఐఆర్‌ను కూడ ఆమె జతచేయలేదు. అయినా నామినేషన్‌ను కలెక్టర్ అంగీకరించారంటే... ఎన్నికలను నిర్వహిస్తోంది ఈసీనా? లేక కలెక్టరా?" అని మాలవియా ట్వీట్‌లో ప్రశ్నించారు. కాగా, తనకు రూ. 12 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ప్రియాంక గాంధీ ఈసీకి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొనారు. అఫిడవిట్ ప్రకారం రాబర్ట్ వాద్రా స్థిర,చరాస్తుల విలువ సుమారు రూ. 66 కోట్లు.

వాళ్లందరినీ ముక్కలుగా నరికేస్తాం: మిథున్

న్యూఢిల్లీ, అక్టోబరు 28: పశ్చిమ బెంగాల్‌లో ముస్లింలందరినీ ముక్కలు ముక్కలుగా నరికి పాతిపెడతామని అని నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నేత హుమయూన్ కబీర్ హిందువులను భాగీరథి నదిలో ముంచేస్తానన్న వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఆయన ఈ మాటలు అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో వచ్చే నెలలో 6 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ప్రచారంలో మిథున్ చక్రవర్తి పాల్గొన్నారు. "ఆ నేత(కబీర్) వ్యాఖ్యలపై సీఎం మమత స్పందిస్తారని చూశాను. కానీ, స్పందించలేదు. ఇప్పుడు నేను చెప్తున్నాను. వాళ్లను ముక్కలుగా నరికేస్తాం. భూమిలో పాతేస్తాం. భాగీరథి నది మాకు తల్లిలాంటిది. అందుకే వాళ్లను అందులో వేయం" అన్నారు. మిథున్ చక్రవర్తి ఈ వ్యాఖ్యలు చేసేప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పక్కనే ఉన్నారు.

దర్శన్ బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడు, నటుడు దర్శన్ బెయిల్ పిటిషన్ విచారణ మంగళవారానికి వాయిదా పడింది. బళ్లారి జైలులో ఉన్న దర్శన్ తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతున్నారు. ఇందుకు వెంటనే ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని దర్శన్ తరఫు న్యాయవాదులు ఇదివరకే కోర్టు దృష్టికి తెచ్చారు. దర్శన్ మెడికల్ రిపోర్టును సమర్పించాలని వారికి హైకోర్టు సూచించింది. దీంతో బళ్లారి జైలు అధికారులు దర్శన్ ఎంఆర్ఐ రిపోర్టును సోమవారం కోర్టుకు సమర్పించారు. దర్శన్ తరఫు న్యాయవాది సీవీ నాగేశ్ వాదనలు వినిపిస్తూ, రక్తం సరఫరా సజావుగా లేదని, పెరాలసిస్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని కోర్టుకు తెలిపారు. ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని విన్నవించారు. తదుపరి విచారణను హైకోర్టు మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా వేసింది.

జేఈఈ మెయిన్స్ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ, అక్టోబరు 28: రాబోయే 2025-26 విద్యా సంవత్సరానికి గాను జేఈఈ మెయిన్స్ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) సోమవారం ప్రకటించింది. రెండు సెషన్లుగా ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. సెషన్-1ను జనవరిలో, సెషన్-2ను ఏప్రిల్‌లో నిర్వహిస్తామని తెలిపింది. సెషన్-1కు సంబంధించి అక్టోబరు 28 నుంచి నవంబర్ 22 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జనవరి 22 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 12లోపు ఫలితాలు వెల్లడించనున్నారు.

వాయు కాలుష్యంతో పెరుగుతున్న ఆస్తమా

న్యూఢిల్లీ, అక్టోబరు 28: వాయు కాలుష్యం కారణంగా పిల్లలు, పెద్దల్లో ఆస్మా వ్యాధి పెరుగుతున్నట్టు ప్రపంచస్థాయి అధ్యయనంలో వెల్లడయింది. 2019-23 మధ్య 22 దేశాల్లో 68 చోట్ల జరిపిన అధ్యయనంలో ఈ విషయం రుజువయింది. మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగింది. దీనిపై విశ్లేషించిన శాస్త్రవేత్త రూయిజింగ్ నీ 'వన్ ఎర్త్' మ్యాగజైన్‌లో వ్యాసం రాశారు. వాయు కాలుష్యాన్ని ఫైన్ పర్టిక్యులర్ మ్యాటర్ (పీఎం 2.5)గా లెక్కిస్తారు. గాలిలో కాలుష్యకారక సూక్ష్మ రేణువులు ఎన్ని ఉన్నాయన్నది దీని ద్వారా తెలుస్తుంది. ప్రతి ఘనపు మీటరు గాలిలో 10 మైక్రోగ్రాముల మేర పీఎం2.5 పెరిగితే ఆస్మా వచ్చే ముప్పు 21% మేర అధికమవుతుందని అధ్యయనంలో తేలింది.

కొత్త గ్రహాన్ని కనుగొన్న భారత శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, అక్టోబరు 28: విశ్వంలో మరో కొత్త గ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అధునాతన స్పెక్ట్రోగ్రాఫ్‌ను ఉపయోగించి ఆ గ్రహాన్ని గుర్తించామని.. ఇదో అద్భుత ఆవిష్కరణ అని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (పీఆర్ఎల్) కి చెందిన పరిశోధకులు పేర్కొన్నారు. ఈ గ్రహాన్ని టీఓఐ-6651బీగా పిలుస్తున్నామని తెలిపారు. శని గ్రహం పరిణామంలో ఉన్న ఈ ప్రత్యేక గ్రహం.. సూర్యుడిని పోలిన నక్షత్రం చుట్టూ తిరుగుతోందని వెల్లడించారు. దీని కక్ష్య కొద్దిగా అండాకారంలో ఉందన్నారు. ఇక భూమితో పోలిస్తే ఈ గ్రహం బరువు 60 రెట్లు అధికంగా ఉంటుందని, పరిమాణంలో 5 రెట్లు పెద్దదని వివరించారు. ఈ గ్రహం అధిక సాంద్రతను బట్టి 87% రాతి, ఇనుము పదార్థాలను సూచిస్తుందన్నారు. హైడ్రోజన్, హీలియం వంటి తేలిక వాయువులు గ్రహంపై వ్యాపించి ఉండే అవకాశముందన్నారు.

రెండేళ్లలో

మేకిన్ ఇండియా విమానం!

సీ-295 రవాణా విమానం అందుబాటులోకి.. భవిష్యత్తులో ఇక్కడ్నుంచి ఎగుమతులుంటాయ్

» వడోదరలో సీ-295 విమానాల తయారీ కర్మాగారం ప్రారంభోత్సవంలో మోదీ

వడోదర, అక్టోబరు 28: దేశ రక్షణ రంగంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సైనిక రవాణా విమానాలను తయారు చేసే తొలి ప్రైవేటు కర్మాగారం ప్రారంభమైంది. గుజరాత్‌లోని వడోదరలో సీ-295 రవాణా విమానాల తయారీ కేంద్రాన్ని ప్రధాని మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. టాటా సంస్థ భాగస్వామ్యంతో స్పెయిన్‌కు చెందిన ఎయిర్‌బస్ ఈ ప్యాక్టరీని నిర్మించింది. ఎయిర్‌బస్ ఇతర దేశాల్లో ఇలాంటి విమానాలను తయారు చేయడం ఇదే తొలిసారి. కర్మాగారం ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ భారత్-స్పెయిన్ మధ్య సంబంధాలతో పాటు 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' మిషన్‌ను బలోపేతం చేస్తుందని చెప్పారు.భారత్-స్పెయిన్ భాగస్వామ్యాన్ని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సరికొత్త మార్గంలో తీసుకెళుతున్నామని తెలిపారు. సరికొత్త భారతదేశంలో పని సంస్కృతి ఎంత వేగంగా మారిందనడానికి సీ-295 విమానాల తయారీ కేంద్రం ప్రారంభోత్సవమే నిదర్శనమన్నారు. రెండేళ్ల కిందట ఈ కర్మాగారం నిర్మాణ పనులు ప్రారంభించామని.. ఇప్పుడది విమానాల ఉత్పత్తికి సిద్ధమైందని చెప్పారు. రెండేళ్లలో తొలి విమానం అందుబాటులోకి వస్తుందన్నారు. భవిష్యత్తులో ఇక్కడ తయారయ్యే విమానాలను ఇతర దేశాలకు ఎగుమతి కూడా చేస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం తీసుకున్న పటిష్ఠ చర్యలతో దేశంలో రక్షణ తయారీ రంగం సరికొత్త శిఖరాలకు చేరిందని తెలిపారు. గడిచిన ఐదారేళ్లలో దేశంలో దాదాపు 1000 రక్షణ స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయని.. గత పదేళ్లలో దేశ రక్షణ ఎగుమతులు 30 రెట్లు పెరిగాయని తెలిపారు. ప్రస్తుతం 100కు పైగా దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తున్నామన్నారు. "ఇటీవల భారత ముద్దు బిడ్డ రతన్ టాటాను కోల్పోయింది. ఆయన బతికి ఉంటే.. ఈ రోజు ఇక్కడ మన మధ్యే ఉండే వారు. ఎక్కడ ఉన్నా ఆయన ఈ కార్యక్రమాన్ని చూసి సంతోషిస్తారు" అని మోదీ నివాళి అర్పించారు. భారత్‌ను వైమానిక హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మేడిన్ ఇండియా పౌర విమానం కూడా తయారవుతుందని, దానికి ఇలాంటి కర్మాగారాలు దారి చూపుతాయని చెప్పారు.



వడోదరలో సీ-295 విమానాల తయారీ కర్మాగారం ప్రారంభోత్సవంలో మోదీ, సాంచెజ్

రోడ్ షో..

కర్మాగారం ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ, సాంచెజ్‌లో వడోదరలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ వరకూ 2.5 కి.మీ. మేర సాగిన ఈ రోడ్ షోలో ఇద్దరు నేతలు ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్‌ను వీరిద్దరూ కలిసి ప్రారంభించారు.

మోదీ దూరదృష్టికి ఈ ప్రాజెక్టు నిదర్శనం

వడోదర కర్మాగారం నుంచి రెండేళ్లలో తొలి సీ-295 విమానం అందుబాటులోకి వస్తుందని స్పెయిన్ ప్రధాని సాంచెజ్ చెప్పారు. భారత్‌ను పారిశ్రామిక పవర్ హౌస్‌గా మార్చాలని, పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు గమ్యస్థానంగా మార్చాలన్న ప్రధాని మోదీ సంకల్పం, దూరదృష్టికి ఈ ప్రాజెక్టు నిదర్శనమని కొనియాడారు. తమ దేశం భారత్‌కు నమ్మకమైన, వ్యూహాత్మకమైన భాగస్వామి అని చెప్పారు. టాటా సంస్థ దిగ్గజాలకే దిగ్గజమని కొనియాడారు. టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. రెండేళ్లలోనే తొలి విమానాన్ని అందజేస్తామని ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు. తొలి విమానాన్ని కూడా మోదీ చేతుల మీదుగానే ప్రారంభిస్తామని, అందుకోసం ఆయన సమయం కూడా తీసుకుంటామని చెప్పారు. ఇది రతన్ టాటా కలల ప్రాజెక్టు అన్నారు. ఇది టాటా గ్రూప్‌కే కాదని, యావత్ దేశానికే చరిత్రాత్మకమైన రోజని పేర్కొన్నారు. 56 సీ-295 విమానాల కొనుగోలుకు 2021 సెప్టెంబరులో భారత్ ఎయిర్‌బస్‌తో రూ.21 వేల కోట్ల విలువైన ఒప్పందం చేసుకుంది. ఇందులో 16 విమానాలు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నాయి. మిగిలిన 40 విమానాలు వడోదరలోని కర్మాగారంలో తయారు చేస్తారు. ఈ విమానాల్లో 40-45 మంది పారాట్రూపర్లు లేదా 70 మంది పౌరులు ప్రయాణించొచ్చు. 5-10 టన్నుల వస్తువులను రవాణా చేసే సామర్థ్యంతో వీటిని రూపొందిస్తున్నారు.

నాగ్‌పూర్‌లో పెట్టాల్సినదాన్ని వడోదరకు తరలించారు

టాటా ఎయిర్‌బస్ ప్రాజెక్టుపై విపక్షాలు

గుజరాత్‌లోని వడోదరలో మోదీ సోమవారం టాటా ఎయిర్‌బస్ సీ295 విమానాల నిర్మాణ ప్రాజెక్టును ప్రారంభించడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. నిజానికి దీన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఏర్పాటు చేయాల్సి ఉండగా, గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆరోపించాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రయోజనాలను కాదని ప్రధాని సూచనల మేరకు ఈ ప్రాజెక్టును గుజరాత్‌కు తీసుకెళ్లారని ఆరోపించారు. ఇందుకు మహారాష్ట్ర ప్రజలు గట్టి సమాధానం ఇస్తారని చెప్పారు.

లోకం తీరు



మరో 60 విమానాలకు

బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 28 : దేశంలో విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం 60కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. గత 15 రోజుల్లో 410 దేశీయ, అంతర్జాతీయ విమానాలకు ఉత్తుత్తి బాంబు బెదిరింపులు వచ్చాయి. వీటిలో చాలావరకు సోషల్ మీడియా ద్వారానే వచ్చాయి. సోమవారం ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలకు చెందిన చెరో 21 విమానాలకు, విస్తారాకు చెందిన 20 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తమ సంస్థకు చెందిన పలు విమానాలకు సోమవారం సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వచ్చినట్లు ఎయిర్ ఇండియా అధికార ప్రతినిధి చెప్పారు. నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులను వెంటనే అప్రమత్తం చేసినట్లు చెప్పారు. అన్ని భద్రతా నియమాలను తుచ తప్పకుండా పాటించినట్లు వెల్లడించారు. ఇటువంటి ఉత్తుత్తి బెదిరింపులకు సంబంధించి నిబంధనల మేరకు వ్యవహరించాలని, వాటిని తొలగించాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను కేంద్ర ఐటీ శాఖ కోరింది.

వచ్చే ఏడాది జనగణన

2025 మొదట్లో షురూ.. 2026లో పూర్తి!



న్యూఢిల్లీ, అక్టోబరు 28: చాలాకాలంగా ఆలస్యమవుతూ వస్తున్న జనగణన ప్రక్రియను కేంద్రం వచ్చే ఏడాది మొదట్లోనే చేపట్టి.. 2026కల్లా జాతీయ జనాభా పట్టికను నవీకరించి, ఆ వివరాలను ప్రజలకు వెల్లడించే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే, విపక్షాలు డిమాండ్ చేస్తున్న కుల గణన విషయంపై మాత్రం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో జనగణన చక్రం 2035, 2045.. అలా మారుతుందని ఆ వర్గాలు వివరించాయి. వచ్చే ఏడాది చేపట్టే జనగణన పూర్తయ్యాక.. 2026లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉంది. కాగా.. 1951 నుంచి ప్రతి పదేళ్లకొకసారి మనదేశంలో జనగణన జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే, 2021లో కరోనా కారణంగా జరగలేదు. అప్పట్నుంచీ ఆలస్యమవుతూ వస్తోంది. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సహా పలు పార్టీలు ఈసారి కులగణన కూడా చేపట్టాలని, దాని వల్ల దేశంలో ఓబీసీ జనాభా ఎంతో తెలుస్తుందని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

స్పష్టత ఇవ్వండి..

జనగణనకు సంబంధించిన కసరత్తు మొదలైందన్న వార్తలతోపాటు.. రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియాగా వ్యవహరిస్తున్న మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ పదవీకాలాన్ని 2026 ఆగస్టు దాకా పొడిగించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. జనాభా లెక్కలను సేకరించే ప్రక్రియలో భాగంగా కులగణన చేపడతారా? లేదా? వివిధ రాష్ట్రాల లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి ఈ సెన్సస్ వివరాలను ఉపయోగించుకుంటారా? అనే రెండు కీలక అంశాలపై స్పష్టత ఇవ్వాలని, ఇందుకోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. ఒకవేళ ఈ లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరిపితే అది.. కుటుంబనియంత్రణను సమర్థంగా పాటించిన రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కాదా? అని ఆయన ప్రశ్నించారు.

క్షీణించిన ఖమేనీ ఆరోగ్యం

» తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం

» ఆయన పేగుకు శస్త్రచికిత్స!

» ఖమేనీ ఎక్స్ ఖాతా తొలగింపు



టెహ్రాన్, బీరుట్, అక్టోబరు 28: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆరోగ్యం క్షీణించిందని ఇరాన్ మీడియా సంస్థలు ఆదివారం కథనాలు ప్రచురించాయి. తీవ్రమైన కడుపునొప్పి, జ్వరంతో బాధపడగా ఇంటి వద్దే ఆయన పేగుకు శస్త్రచికిత్స చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వెల్లడించాయి. హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లాను ఇజ్రాయెల్ బలగాలు మట్టుబెట్టాక అక్టోబరు నాలుగున టెహ్రాన్ గ్రాండ్ మసీదు నుంచి సందేశమిచ్చినప్పుడు ఖమేనీ ఆరోగ్యంగానే కనిపించారు. మరోవైపు, ఖమేనీ వినియోగిస్తున్న ఖాతాను ఎక్స్ సస్పెండ్ చేసింది. శనివారం తెల్లవారుజామున ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి తర్వాత ఖమేనీ కొత్త ఖాతా తెరిచి హిబ్రూ భాషలో పోస్ట్ పెట్టారు. ఇరాన్‌ను తక్కువ అంచనా వేసి జియోనిస్ట్ పాలన తప్పు చేసిందని, తమకు ఎలాంటి సత్తా ఉందో చూపిస్తామంటూ ఇజ్రాయెల్‌ను బెదిరించేలా ఆయన పోస్ట్ పెట్టారు. ఆ వెంటనే కారణాలేమీ చెప్పకుండానే ఆయన ఖాతాను ఎక్స్ సస్పెండ్ చేసింది. అయితే ఆయన పేరిట ఉన్న మరో అధికారిక ఖాతా యథావిధిగా కొనసాగుతోంది. 2023 అక్టోబరు 7న హమాస్ దాడిని సమర్థించినందుకు నాడు ఖమేనీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను మెటా తొలగించింది.

ఇజ్రాయెల్‌కు తగిన రీతిలో బదులిస్తాం

శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ జరిపిన దాడిపై ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్పందించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని, అయితే దేశ ప్రజల హక్కులను కాపాడేందుకు తగిన రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. అమెరికా అండతోటే ఇజ్రాయెల్ అఘాయిత్యాలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. మరోవైపు ఇజ్రాయెల్ జరిపిన దాడిలో నలుగురు సైనికులు చనిపోయారని ఇప్పటికే ప్రకటించిన ఇరాన్ మరో పౌరుడు కూడా చనిపోయాడని వెల్లడించింది.

43 వేలు దాటిన గాజా మృతులు

2023 అక్టోబరు 7న తమపై హమాస్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఏడాదిగా గాజాపై జరుపుతున్న దాడుల్లో మరణించిన వారి సంఖ్య 43 వేలు దాటింది. లక్షమందికి పైగా గాయపడ్డారు. గడచిన 48 గంటల్లో 96 మంది చనిపోయారు. 277 మంది గాయపడ్డారు.

వందమంది హమాస్ మిలిటెంట్ల అరెస్టు

గాజాలోని కమల్ అద్వాన్ ఆసుపత్రిపై దాడి చేసిన ఐడీఎఫ్ వందమంది హమాస్ మిలిటెంట్లను అరెస్ట్ చేసింది. ఆసుపత్రి నుంచి ఆయుధాలను, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

వీసా లేకుండానే రష్యాకు!

న్యూఢిల్లీ, అక్టోబరు 28: భారతీయులు వీసా లేకుండానే రష్యాలో పర్యటించే సదుపాయం త్వరలో అందుబాటులోకి రానుంది. ఆ మేరకు వచ్చే ఏడాది స్ప్రింగ్ సీజన్(మార్చి) నుంచి ప్రయాణ నిబంధనలను సరళతరం చేసేందుకు భారత్, రష్యా ప్రణాళికలు రూపొందించాయని సోమవారం ఒక ఆంగ్ల దినపత్రిక ప్రచురించింది. వీసా నిబంధనలపై ద్వైపాక్షిక ఒప్పందం చేసుకునేందుకు ఈ ఏడాది జూన్‌లోనే ఇరుదేశాలూ చర్చలు జరిపినట్టు తెలిపింది. భారత్ నుంచి రష్యాకు పర్యాటకుల సంఖ్యను పెంచే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నట్టు పేర్కొంది. 'ఈ ఒప్పందం వల్ల భారత్ నుంచి రష్యా రాజధానికి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగనుంది' అని మాస్కో సిటీ టూరిజం కమిటీ చైర్మన్ ఎవ్‌గనీ కోజ్లోవ్ చెప్పినట్టు తెలిపింది. గతేడాది 60 వేల మందికిపైగా భారత్ నుంచి రష్యా రాజధానికి వచ్చారని ఎవ్‌గనీ కోజ్లోవ్ చెప్పారు. ప్రస్తుతం చైనా, ఇరాన్ నుంచి రష్యా పర్యటనకు వెళ్లే వారికి మాత్రమే వీసా రహిత ప్రయాణం అందుబాటులో ఉంది. కాగా, నాలుగు రోజుల్లోనే జారీ అయ్యే ఈ-వీసా రష్యాలో పర్యటించే భారతీయులకు గతేడాది ఆగస్టు నుంచి అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆ ఏడాది చివరి ఐదు నెలల్లోనే భారతీయులకు 9,500 ఈ-వీసాలను రష్యా జారీ చేసింది. రష్యా జారీ చేసిన మొత్తం ఈ-వీసాల్లో ఇది 6%. తద్వారా గతేడాది అత్యధిక ఈ-వీసాలు జారీ అయిన తొలి 5దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. ఈ ఏడాది జనవరిలో 1,700 మంది భారతీయులకు ఈ-వీసాలను రష్యా జారీ చేసింది.



ఉక్రెయిన్ - రష్యా చర్చలు

భారత్‌లోనే..

(మొదటిపేజీ తరువాయి)

సమీపిస్తుండడం.. వంటి పరిణామాలు తమ దేశానికి పెను సవాల్‌గా మారాయని చెప్పారు. అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో అమెరికా సహకారంపై అనిశ్చితి నెలకొందని.. డొనాల్డ్ ట్రంప్ విజయం సాధిస్తే తమకు సైనిక సాయం గందరగోళంలో పడుతుందని అన్నారు. తాము రూపొందించిన 'విజయ ప్రణాళిక', నాటో సభ్యత్వం ఇవ్వాలని కోరడం.. రష్యాతో చర్చల్లో బేరసారాల కోసం కాదని చెప్పారు. భవిష్యత్‌లో పశ్చిమ దేశాలు తమ అభిప్రాయం మార్చుకోకుండా ఉండేందుకే ఉక్రెయిన్‌ను నాటోలోకి ఆహ్వానించాలని కోరుతున్నామన్నారు. యుద్ధం ఆగిపోవాలని మోదీ ఊరకే మాటలు చెప్పడం కాదని.. నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రష్యా బలవంతంగా 1,000 మంది ఉక్రెయిన్ పిల్లలను తీసుకెళ్లిందని.. వారిని తిప్పిపంపేందుకు ఆ దేశాధ్యక్షుడు పుతిన్‌పై ఆయన ఒత్తిడి తేవాలని కోరారు.

ఎంపీ పప్పూ యాదవ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ హెచ్చరిక

» సల్మాన్‌ఖాన్‌కు మద్దతిచ్చినందుకు బెదిరింపు



న్యూఢిల్లీ, అక్టోబరు 28: బిహార్‌లోని పూర్ణియాకు చెందిన ఇండిపెండెంట్ ఎంపీ పప్పూ యాదవ్‌ను గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడు ఒకడు బెదిరించాడు. హీరో సల్మాన్‌ఖాన్‌కు మద్దతుగా మాట్లాడినందుకు చంపేస్తామని హెచ్చరిస్తూ ఫోన్ చేశాడు. ఈ విషయాల్లో జోక్యం చేసుకోకూడదని హెచ్చరించాడు. దాంతో పప్పూ యాదవ్ బిహార్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సల్మాన్‌ఖాన్ మిత్రుడైన ఎన్‌సీపీ నాయకుడు సిద్ధిఖీని బిష్ణోయ్ అనుచరులు కాల్చి చంపారు. దీనిపై పప్పూ యాదవ్ ట్వీట్ చేస్తూ సల్మాన్ తరఫున తాను ఉన్నానని చెప్పారు. లారెన్స్‌ను పైసాకు పనికిరాని గ్యాంగ్‌స్టర్ అని విమర్శిస్తూ తనకు అవకాశం ఇస్తే 24 గంటల్లో ఆ ముఠాను రూపుమాపుతానంటూ బహిరంగంగా సవాలు విసిరారు. దీనిపై బిష్ణోయ్ ముఠా స్పందించింది. ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతూ ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైలులో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ అక్కడి నుంచే వ్యవహారాలు నడుపుతున్నట్టు చెప్పాడు. ఆయనపై అన్న మాటలను వెనక్కి తీసుకోవాలని, ఇందుకు అవసరమైతే 'భాయ్'తో మాట్లాడే అవకాశం కల్పిస్తానని పప్పూ యాదవ్‌కు చెప్పాడు. "మీరు 'భాయ్'కు ఓ మాట చెప్పండి. 'నేనేమీ అనలేదు...అంతా మీడియా సృష్టి' అని చెప్పండి. సాధ్యమైనంత త్వరగా సెటిల్ చేసుకోండి. 'భాయ్'తో మాట్లాడిస్తా" అని చెప్పాడు. అనంతరం పప్పూ యాదవ్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. బెదిరింపు ఫోన్ కాల్‌పై ప్రశ్నించినప్పుడు 'సంబంధం లేని ప్రశ్నలు అడగొద్దని ముందే చెప్పాను కదా' అంటూ మీడియాపై చిరాకు పడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ట్రంప్‌వైపు మొగ్గుతున్నారు

» భారతీయ అమెరికన్ ఓటర్లలో మార్పు

వాషింగ్టన్, అక్టోబరు 28: వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్‌కు ఓటేసేందుకు గతంలో కంటే ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు ఓ సర్వే స్పష్టం చేసింది. స్వతహాగా డెమొక్రాట్లకు మద్దతుగా ఉండే భారతీయ అమెరికన్లలో మార్పు రావడం ఆ పార్టీకి ఓ హెచ్చరికగా పేర్కొంది. "2024 ఇండియన్-అమెరికన్ యాటిట్యూడ్స్" పేరుతో పరిశోధన, విశ్లేషణ సంస్థ యుగవ్ భాగస్వామ్యంతో కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ సంస్థ ఈ సర్వే చేసింది. సెప్టెంబరు 18 నుంచి అక్టోబరు 15 మధ్య 714 మంది అభిప్రాయాలు సేకరించి ఆ వివరాలు వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. 61% భారతీయ అమెరికన్లు డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హ్యారిస్‌కు ఓటేయనున్నారు. 32% మంది రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు జై కొట్టారు. నాలుగేళ్ల క్రితం అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు 22 శాతం మంది మాత్రమే ట్రంప్‌కు ఓటేయగా.. అప్పట్లో జో బైడెన్‌కు 68 శాతం మంది మద్దతు తెలిపారు. 2020 నుంచి ట్రంప్‌వైపు భారతీయ అమెరికన్లు మొగ్గు చూపుతున్నారు. ఇక భారతీయ అమెరికన్ మహిళల్లో 67 శాతం, పురుషుల్లో 53 శాతం హ్యారిస్‌కు ఓటేస్తామని చెప్పారు. భారతీయ మూలాలున్న వారు సుమారు 52 లక్షల మంది అమెరికాలో నివసిస్తున్నారు. ఇందులో 2022 డేటా ప్రకారం సుమారు 26 లక్షల మందికి ఓటు హక్కు ఉంది.

నేతలు,జడ్జీలు కలవడం మామూలే



న్యూఢిల్లీ, అక్టోబరు 28: ముఖ్యమంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు తరచూ కలుసుకోవడం, మాట్లాడుకోవడం మామూలేనని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ఆ సమయంలో న్యాయ సంబంధ విషయాల ప్రస్తావన వారి మధ్య రాదని, అటువంటి సందర్భం తనకు ఒక్కటి కూడా గుర్తులేదని ఆయన తెలిపారు. తమ ఇంట్లో గణపతి పూజా కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించడంపై రాజకీయ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో... ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరికొద్ది రోజుల్లో పదవీవిరమణ చేయనున్న ఆయన ఈ వివాదంపై లోక్‌సత్తా వార్షిక సమావేశంలో స్పందించారు. "ఎందుకని రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు కలుసుకుంటారో తెలుసుకోవాలని ప్రజలకు ఉంటుంది. అయితే, న్యాయవ్యవస్థతోపాటు రాజకీయ వ్యవస్థకు కూడా పరిణతి ఉంది. న్యాయ వ్యవస్థకు అవసరమైన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. అది న్యాయమూర్తుల కోసం కేటాయించే బడ్జెట్ కాదు. నూతన కోర్టు భవనాలు, జిల్లాల్లో న్యాయమూర్తులకు కొత్త నివాస సముదాయాల ఏర్పాటు కోసం ఆ బడ్జెట్‌ను వినియోగిస్తారు. ఇలాంటి అవసరాలు తీరాలంటే ప్రధాన న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి కలిసి మాట్లాడుకోవడం అవసరం" అని ఆయన వివరించారు. "ఆగస్టు 14, జనవరి 26తో పాటు పెళ్లిళ్లు, మరణాలు.. ఇలా సందర్భం ఏదైనా సీఎం, చీఫ్‌జస్టిస్ కలుస్తుంటారు. న్యాయ సంబంధ అంశాలేవీ అక్కడ ప్రస్తావనకు రావు" అని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు. కాగా, గణపతి పూజ కోసం సీజే ఇంటికి ప్రధాని వెళ్లడంపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. శివసేన(యూబీటీ), శివసేన (షిండే) పార్టీల మధ్య వివాదంపై విచారణ నుంచి జస్టిస్ చంద్రచూడ్ తప్పుకోవాలని శివసేన (యూబీటీ) డిమాండ్ చేసింది.

వామ్మో.. మోమోస్!

కొంపముంచిన కలుషిత చిరుతిండి.. వాంతులు, విరేచనాలతో 50మందికి అస్వస్థత

- చికిత్సపొందుతూ మహిళ మృతి
- బంజారాహిల్స్‌లో ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- బాధితులు వివిధ ఆస్పత్రుల్లో.. ఎక్కువమంది 20 ఏళ్లలోపువారే
- తయారీ సంస్థ సీజ్... నాసిరకం మయనీసే కారణమా?


మృతి చెందిన రేష్మ (ఫైల్)

బంజారాహిల్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నోరూరించే చిరుతిండి వాళ్లను తీవ్ర అస్వస్థతకు గురిచేసింది. ఆ సంతలో విశేష ఆదరణ ఉన్న రుచికరమైన మోమోస్ కోసం పిల్లలు, యువకులు, మహిళలు అంతా ఎగబడ్డారు. తిన్నాక వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలయ్యారు! 50 మంది తీవ్ర అనారోగ్యానికి గురవగా, వారిలో ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆ మాయదారి మోమోస్‌ను విక్రయించింది బంజారాహిల్స్ పరిధిలోని నందినగర్, సింగాడికుంట బస్తీలోని సంతలోనైతే బాధితులంతా ఆ పరిధిలోని నాలుగు బస్తీలకు చెందినవారు. ఈనెల 25న జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలు వెల్లడించారు. నందినగర్, సింగాడికుంట బస్తీలో ప్రతి శుక్రవారం కూరగాయల అంగడి జరుగుతుంది. ఈ నెల 25న కూడ సంత పెట్టారు. 'ఢిల్లీ మోమోస్' పేరిట ప్రతివారం ఈ సంతల్లో మోమోస్ అమ్మే షాపు వెలుస్తుంది. కేవలం రూ.30కే ఆరు మోమోస్ ఇస్తుండటంతో ఎప్పటిలాగే ఈసారి కూడా తినేందుకు పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. ఇంటికి వెళ్లాక మోమోస్ తిన్నవారిలో చాలామంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో పాటు కొందరు తీవ్రమైన కడుపునొప్పితో విలవిల్లాడిపోయారు. ఏం జరిగిందో తెలియక తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బాధితులను సమీపంలోని ఆస్పత్రులకు తీసుకెళ్లారు. సింగాడికుంట బస్తీకి చెందిన రేష్మాబేగం ఆమె కుమార్తెలు రుష్మా, రఫీయా, కుమారుడు అబ్దుల్ రెహ్మాన్ కూడా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మెడికల్ షాపు నుంచి మాత్రలు తెచ్చి వేసినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మరుసటి రోజు వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రేష్మా బేగం మృతిచెందింది. ఆమె మృతికి కారణం తెలియకుండానే అంత్యక్రియలు కూడా నిర్వహించారు. అయితే రేష్మా పిల్లలతో పాటు బస్తీలో చాలామంది అస్వస్థతకు గురవడంతో మోమోస్ తినడం వల్లే ఈ విషాదం జరిగిందనే అనుమానాలు రేకెత్తాయి. పైగా.. సంతలోని ఢిల్లీ మోమోస్ వద్ద కలుషిత ఆహారం తిని తమ కుటుంబసభ్యులు అస్వస్థతకు గురయ్యారని నందినగర్‌కు చెందిన ఓ కూరగాయల వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రేష్మా మృతి చెందడం, బస్తీ వాసులు అస్వస్థతకు గురవడం.. ఓ ఫిర్యాదు ఘటనలకు విశ్లేషించగా నందినగర్, సింగాడికుంట బస్తీ, ఇబ్రహీంనగర్, గౌరీశంకర్‌కాలనీకి చెందిన సుమారు 50 మందికి పైగా అస్వస్థతకు గురయినట్లు తేలింది. వీరంతా నందినగర్, సింగాడికుంట సంతలో మోమోస్ తినడం వల్లే అని నిర్ధారణ అయింది. బాధితులు తన్వీర్, ద్వారకామాయి క్లీనిక్, రిలీఫ్ ఆస్పత్రి, అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో ఎక్కువమంది 20 ఏళ్లలోపు వారే. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

నాసిరకం మయనీస్ వాడటం వల్లే

కలుషిత మోమోస్‌ను తయారు చేసింది చింతల్‌బస్తీలోని 'ఢిల్లీ మోమోస్'లోనని.. వీటిని సింగాడికుంట బస్తీ సాజిద్ హుస్సేన్ అనే వ్యక్తి, నందినగర్‌లో సాదిక్ అనే వ్యక్తి అని గుర్తించారు. చింతల్‌బస్తీలోని తయారీ కేంద్రాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. అక్కడ ఉన్న ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. మోమోస్ తయారీని, వ్యాపార కార్యకలాపాలను నిలిపివేయాలని జీహెచ్ఎంసీ అధికారులు ఆదేశించారు. కాగా పూర్తి కలుషిత వాతావరణంలో మోమోస్‌ను తయారు చేస్తున్నారని, విక్రయించిన నందినగర్, సింగాడికుంట బస్తీ సంతల్లో కూడా కలుషిత వాతావరణంలోనే కస్టమర్లకు ఇస్తున్నారని అధికారులు గుర్తించారు. మోమోస్ తయారీలో మయనీస్‌ను వాడతారు దీన్ని ఒకరమైన నూనె, కోడి గుడ్డులోని పచ్చసొన, వెనిగర్ లేదా నిమ్మరసంతో తయారు చేస్తారు. మయనీస్ తయారీలోనే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మహిళపై ఆటోడ్రైవర్ అత్యాచారం

జగదేవ్‌పూర్, బచ్చన్నపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటోవాలా.. మహిళను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. మెదక్ జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జనగామ జిల్లా బచ్చన్నపేటలోని ఓ గ్రామానికి చెందిన మహిళ(30) హైదరాబాద్‌లో ఉంటోంది. ఆదివారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఆమె వట్టిపల్లి వద్ద దిగింది. అక్కడి నుండి స్వగ్రామానికి నడుచుకుంటూ వెళుతోంది. ఆటో డ్రైవర్ నరసింహులు అదే గ్రామానికి వెళుతున్నానంటూ ఆమెను ఆటో ఎక్కించుకున్నాడు. ఆటోను ఓ చోట ఆపి.. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబసభ్యులు జగదేవ్‌పూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

■ ఆలయాల్లో వీఐపీ దర్శనాలు సమానత్వ హక్కు ఉల్లంఘన కిందికే వస్తాయని, వీటిని అరికట్టాలని కోరుతూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలయింది. దేశంలోని దేవాలయాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వీఐపీ, ప్రత్యేక చెల్లింపు దర్శనాలను సవాలు చేస్తూ విజయ్ కిషోర్ గోస్వామి అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. "వీఐపీ(చాలా ముఖ్యమైన వ్యక్తి) అనే పదానికి చట్టంలో ఎక్కడా నిర్వచనం లేదు. దేశవ్యాప్తంగా అనేక ఆలయాల్లో అమలు చేస్తున్న వీఐపీ దర్శనాల కారణంగా సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగుతోంది.

ముంబై విమానానికి బాంబు బెదిరింపు

- హైదరాబాద్ విమానాశ్రయానికి ఆగంతకుడి ఫోన్
- అక్కడి నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు సమాచారం
- టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం ల్యాండింగ్
- తనిఖీల తర్వాత బాంబు లేదని అధికారుల నిర్ధారణ



గోపాలపట్నం (విశాఖపట్నం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వచ్చి, ఇక్కడి నుంచి ముంబై బయలుదేరిన విమానానికి బాంబు బెదిరింపు కాల్ రావడంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ల్యాండ్ అయింది. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానం సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు విశాఖ చేరుకుంది. తిరిగి 3:15 గంటలకు ముంబై బయలుదేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో బాంబు ఉన్నట్టు ఆగంతకుడి నుంచి హైదరాబాద్ విమానాశ్రయానికి కాల్ వచ్చింది. దాంతో వారు విశాఖ విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. ఇక్కడి అధికారులు పైలట్‌కు సమాచారం అందించి, తిరిగి ల్యాండింగ్ చేయించారు. ప్రయాణికులందరినీ కిందకు దించి, భద్రతాదళ సిబ్బంది విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబు లేదని నిర్ధారించుకున్న తరువాత సాయంత్రం ఆరు గంటల సమయంలో విమానం తిరిగి ముంబై బయలుదేరింది. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే తిరిగి ల్యాండింగ్ కావడంతో ప్రయాణికులంతా ఆందోళన చెందారు. ఇటీవల వరుసగా విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

పోలీసు యూనిట్లకు

సీఎస్‌బీ అండగా ఉండాలి: డీజీపీ

- సైబర్ జాగరూకత దివస్ ఏర్పాట్లపై సమీక్ష

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీసు యూనిట్లకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) సహాయ కేంద్రంగా పనిచేయాలని డీజీపీ డా. జితేందర్ పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న టీజీసీఎస్‌బీ ప్రధాన కార్యాలయాన్ని డీజీపీ సోమవారం సందర్శించారు. సీఎస్‌బీ పనితీరును డైరెక్టర్ శిఖాగోయల్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... కేసుల దర్యాప్తులో సాంకేతికంగా ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించేందుకు సీఎస్‌బీలో ప్రత్యేకంగా ఒక యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన డిజిటల్ వాతావరణం సృష్టించడంలో సీఎస్‌బీ మంచి పురోగతి సాధిస్తోందని డీజీపీ జితేందర్ అభినందించారు. నవంబరులో జరగనున్న 'సైబర్ జాగరూకత దివస్' ఏర్పాట్లపై చర్చించారు. బ్యూరో పనితీరు, సాధించిన విజయాల్ని డీజీపీకి డైరెక్టర్ శిఖాగోయల్ వివరించారు. ఇంటర్నెట్‌లో చిన్నారులపై లైంగిక నేరాల కట్టడికి నూతనంగా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు.

'ఉపాధి'లో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం

- కేంద్రం తీరుపై వచ్చే నెల 26న ఆందోళనలు
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం

న్యూఢిల్లీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఉపాధి హామీ నిధుల కేటాయింపులను తెలుగు రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం తగ్గిస్తోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి బి. వెంకట్ ఆరోపించారు. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తున్న తీరుపై తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకట్ మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కారుకు వ్యతిరేకంగా నవంబర్ 26న అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు వెంకట్ తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం నిరాశకు గురిచేసింది

- పింఛనుదారుల ఐకాస

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తుందని ఎంతో నమ్మకంతో ఎదురు చూస్తే 3 లక్షల మంది పింఛనుదారులను తీవ్ర నిరాశకు గురిచేసిందని పింఛనుదారుల ఐకాస చైర్మన్ కె.లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం పింఛనుదారులకు అన్యాయం చేసిందని, తాము న్యాయం చేస్తామని చెప్పి.. ఐదు డీఏలకుగాను ఒక డీఏ ఇస్తామని చెప్పడం మోసం చేయడమేనన్నారు. పింఛనుదారుల సమస్యలను, డిమాండ్లను పరిష్కరించాలని ప్రధాన కార్యదర్శి టి. శుభాకర్‌రావు కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కాలుష్యం–రాజకీయం

దీపావళి రాకముందే ఢిల్లీలో వాయుకాలుష్యం తీవ్రంగా ఉంది. ఢిల్లీ వాసులు ఏటా అనుభవించే నరకమే, చూసే రాజకీయమే ఎప్పటిలాగా కొనసాగుతోంది. కేజ్రీవాల్ స్థానంలో కూర్చున్న ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశి తనకు వీలైన చర్యలేవో తీసుకుంటున్నారు. ఢిల్లీ ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థలు ఎంతో హడావుడి చేస్తున్నాయి. ఆ కలుషితవాతావరణంలో కాస్తంత హెచ్చుతగ్గులు కనిపిస్తున్నప్పుడల్లా ఏ రోజుకారోజు ప్రజలు సంతోషమో, దుఃఖమో పడవలసి వస్తున్నది. దీపావళి సమీపిస్తున్నప్పటికే కాలుష్యం దారుణంగా పెరిగిపోవడం ఢిల్లీ వాసులను ఆందోళనకు గురిచేస్తోంది.

వారంరోజుల వ్యవధిలోనే గాలినాణ్యత బాగా పడిపోవడంతో, వాలంటీర్లను మళ్ళీ ప్రభుత్వం రంగంలోకి దింపబోతున్నది. కాలుష్యాన్ని అరికట్టడానికికంటూ ఉన్న పదివేలమందిని గత ఏడాది తొలగించిన ప్రభుత్వమే ఇప్పుడు మళ్ళీ వారిని నియమించుకొని బాధ్యతలు అప్పగించబోతోంది. భారీ వాహనాల రాకపోకలను నియంత్రించడం, అన్నిరకాల నిర్మాణకార్యక్రమాలను నిలిపివేయడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మాత్రమే వినియోగించేట్టుగా ప్రజలపై ఒత్తిడితేవడం వంటి చర్యలు ఎప్పటిలాగానే ఇప్పుడూ ఢిల్లీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఇక, టపాసులు కాల్చడం మీద ఢిల్లీలో ఎప్పటినుంచో నిషేధం ఉంది. ఆరంభంలో గ్రీన్ క్రాకర్స్, అంటే తయారీలో బేరియం లవణాలను వినియోగించని టపాసులకు అనుమతి ఇచ్చినప్పటికీ, ఆ తరువాత ఆ మినహాయింపు కూడా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం వచ్చిపడింది. పాలకుల చొరవవల్లనో, న్యాయస్థానాల ఆదేశాలవల్లనో, చేజేతులా వాతావరణాన్ని కలుషితం చేయడమెందుకన్న భావన వల్లనో, దేశరాజధానివాసుల్లో టపాసుల మోజు ఇటీవలి సంవత్సరాల్లో బాగా తగ్గిపోయింది. అయినప్పటికీ, ఢిల్లీ రాజధాని ప్రాంతంలోకి టపాసుల సరఫరా ఎంతోకొంత మేరకు అక్రమంగా సాగుతూనే ఉంది. దీపావళి నాడు వాటిని కాల్చి ఆనందించేవారిని నిరుత్సాహపరచేందుకు, వారిలో చైతన్యం పెంచేందుకు 'దియాజలావ్' కార్యక్రమాన్ని ఆరంభించబోతున్నట్టు ఢిల్లీ పర్యావరణ మంత్రి ప్రకటించారు. రాబోయే పదిహేనురోజుల్లో కాలుష్యం మరింత పెరుగుతుంది కనుక, జనం టపాసులను పూర్తిగా దూరం పెట్టాలన్నారు ఆయన. అంతవరకూ బాగున్నది కానీ, ఇంతటి తీవ్రమైన పరిస్థితులను, సందర్భాలను సైతం రాజకీయం చేయడమే సముచితంగా లేదు. వాయుకాలుష్యాన్ని నియంత్రించడానికి తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలన్నింటినీ ఆయన గొప్పగా చెప్పుకోవడం తప్పుకాదు. కానీ, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలనుంచి, అంటే, బీజేపీ పాలిత పొరుగురాష్ట్రాలనుంచి టపాసుల స్మగ్లింగ్ భారీగా జరుగుతోందని ఈ ఆప్ మంత్రి ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాలు అంటూ కేంద్రాన్ని కూడా కలిపి విమర్శించారు. టపాసుల స్మగ్లింగ్ నివారించాల్సిందిగా లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఓ లేఖకూడా రాశారు. ఢిల్లీ కాలుష్యానికి యూపీ, హర్యానా రైతులు పంటపొలాల్లో వ్యవసాయ వ్యర్థాలు పెద్ద ఎత్తున తగలబెట్టడమే కారణమని ముఖ్యమంత్రి ఆతిశీ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. ఇది ఎప్పటినుంచో ఉన్న సమస్య ఇందులో అసత్యమేమీ లేదు. కానీ, ఢిల్లీ ప్రజల అనారోగ్యానికి బీజేపీ పాలిత రాష్ట్రాలే కారణమంటూ ఆమె వ్యాఖ్యానించడం సరికాదు. ఆప్ పాలిత పంజాబ్ రాష్ట్రంలో వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టడం గణనీయంగా తగ్గిందని కూడా ఆమె సమర్థించుకున్నారు. ఆప్ మంత్రులంతా అవే మాటలు వల్లిస్తున్నారు. సహజంగానే బీజేపీ నాయకులు ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తున్నారు. రెండుపార్టీల నాయకులు కాలుష్యం కేంద్రంగా విమర్శలు ప్రతివిమర్శలు చేసుకుంటూ రాజకీయ కాలుష్యాన్ని మరింత పెంచేస్తున్నారు.

గ్యాస్ చాంబర్‌లాగా మారిపోయిన ఢిల్లీలో ప్రజలు పలు ఆరోగ్య సంబంధమైన సమస్యలతో బాధపడుతున్నారు. విపరీతమైన వాయు కాలుష్యం వారిని నిలువనివ్వడం లేదు. ప్రధానంగా వృద్ధులను, పిల్లలను దగ్గు, గొంతునొప్పి, ఆయాసం, ఊపిరాడకపోవడం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. కళ్ళు, ముక్కు మండిపోతుంటే వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్నట్టుగా వారికి అనిపిస్తోంది. కేంద్రప్రభుత్వం సహాయ సహకారాలతో ఢిల్లీ, దాని పొరుగు రాష్ట్రాలు కలసికట్టుగా కాలుష్యనివారణకు కృషిచేయాల్సిన తరుణమిది. ఈ కష్టకాలంలో పార్టీలకు అతీతంగా నిలిచి, ప్రజల మేలుచేకూర్చాల్సినవారు వాతావరణాన్ని మరింత విషపూరితం చేయడం సముచితం కాదు.

భారతీయ దృక్కోణంలో శ్వేతసౌధ పోటీ



> వ్యక్తిగా డొనాల్డ్ ట్రంప్ మీద ఎలాంటి అభిప్రాయాలు, పలుచన భావం ఉన్నప్పటికీ గతంలో ఆయన అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అనుసరించిన సరళీకృత ఆర్థిక విధానాల పట్ల అందరికీ ఏకీభావం ఉంది. ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు అయితే తమకు ప్రధాన ఆలంబనగా ఉన్న ఐటీ రంగం తిరిగి గాడిన పడి పరుగులు పెడుతుందని అమెరికాలోని భారతీయులు నమ్ముతున్నారు. జాబ్ మార్కెట్ పడిపోవడానికి గత నాలుగు సంవత్సరాలుగా డెమొక్రాట్లు అధికారంలో ఉండడమే కారణమని భావిస్తున్న భారతీయులూ ఎంతోమంది ఉన్నారు.

నవంబర్ 5.. సరిగ్గా వారం రోజులు ఉంది. ఆ రోజున ప్రపంచ పరిణామాలను అమితంగా ప్రభావితం చేసే నిర్ణయాన్ని అమెరికా ప్రజలు తీసుకోనున్నారు. అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. అవును, ప్రపంచ అగ్రరాజ్య ప్రభుత్వాధినేతగా ఎవరు ఎన్నికవనున్నారు? ఇదే సర్వత్రా అందరూ ఆసక్తిదాయకంగా, ఉత్కంఠభరితంగా చర్చించుకుంటున్న అంశం. డెమొక్రాట్లు, రిపబ్లికన్లు మధ్యనే దోబూచులాడుతూ ఉండే ఈ అత్యున్నత, మహా శక్తిమంతమైన అధ్యక్ష పీఠం ఈసారి ఎవరికి దక్కనున్నది? ఈ రెండు పార్టీలు కూడా తమ తమ సంప్రదాయ సిద్ధాంత భావజాలం నుంచి కొద్దిగా పక్కకు జరిగి, కొత్త ఓటర్లను కూడా తమకు అనుకూలంగా మలుచుకోవాలనే దృష్టితో వ్యవహరిస్తున్న సమయంలో విజయంపై అనిశ్చితి నెలకొని ఉంది. గతంలో ఎన్నడూ లేనంత పోటాపోటీగా ఈ దఫా అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ఎవరు విజయం సాధిస్తారనేది– కేవలం ఆ దేశ ప్రజలకు మాత్రమే కాదు, తమ భవిష్యత్తు పట్ల ఎన్నో ఆశలను అమెరికాతో ముడిపెట్టుకుంటున్న కొన్ని లక్షల మంది భారతీయులు, ప్రత్యేకించి తెలుగు యువతరం కుటుంబాలకు కూడా చెందిన వ్యవహారం!

సంప్రదాయంగా భారతీయ అమెరికన్లు డెమొక్రాట్ పార్టీకి అనుకూలంగా ఉంటారు. ఇప్పుడు ఈ పరిస్థితులు మారుతున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య సన్నిహిత స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఇరువురి పాలన కాలంలో భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలలో సంభవించిన అనేక పరిణామాల నేపథ్యంలో నేపథ్యంలో ఈ సారి ఏకపక్షమైన మొగ్గు డెమొక్రాట్ల వైపు లేదు. 'ట్రంప్ ఈజ్ మై ఫ్రెండ్' అని ప్రకటించిన మోదీ అమెరికాలోని భారతీయ సమాజాన్ని ఎంతో కొంత ప్రభావితం చేయగలరు. ఆయనను అమితంగా ఆరాధించే అమెరికాలోని ఉత్తరాది భారతీయులు ట్రంప్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా వ్యాపార రంగంలో ఎక్కువగా ఉండే గుజరాతీలు నరేంద్ర మోదీ మీద అభిమానంతో ట్రంప్‌కు మద్దతు పలుకుతున్నారు. సాధారణంగా మధ్యతరగతి, పేద వర్గాలు డెమొక్రాట్ల వైపు ఉంటారు. భారతీయుల సంప్రదాయ మొగ్గు అటువైపు ఏర్పడడానికి కారణం కూడా అదే. అయితే ఇటీవలి కాలంలో ప్రవాస భారతీయుల్లో సంపన్నులు పెరుగుతున్నారు. వీరు అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని కోరుకుంటారు. మొగ్గు రిపబ్లికన్ల వైపు మారడానికి ఇది ఒక కారణం. భారతీయుల్లో ప్రత్యేకించి డాక్టర్లు, ఐటీ రంగంలో ఉన్నవారు, పారిశ్రామికవేత్తలు రిపబ్లికన్ల వైపు మొగ్గే అవకాశం కనిపిస్తోంది. వ్యక్తిగా ట్రంప్ మీద ఎలాంటి అభిప్రాయాలు, పలుచన భావం ఉన్నప్పటికీ గతంలో ఆయన అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అనుసరించిన సరళీకృత ఆర్థిక విధానాల పట్ల అందరికీ ఏకీభావం ఉన్నది. డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు అయితే అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందనే విశ్వాసం చాలా మందిలో ఉన్నది. ఇప్పుడున్న సంక్షోభ పరిస్థితులు తొలగిపోతాయని నమ్ముతున్నారు. భారతీయులకు సంబంధించినంత వరకు ప్రధానంగా ఆధారపడే ఐటీ రంగం తిరిగి గాడిన పడి పరుగులు పెడుతుందని నమ్ముతున్నారు.

తెలుగువారి అభిప్రాయాలూ భిన్న రీతుల్లో ఉన్నాయి. సంప్రదాయిక డెమొక్రాట్ అనుకూలత పలచబడింది. కొన్ని వర్గాలు మాత్రం ట్రంప్ అధ్యక్షుడు అయితే అమెరికన్ ఎకానమీ బాగుపడుతుందని, జాబ్ మార్కెట్ మళ్లీ పుంజుకుంటుందనే ఆశతో ఉన్నారు. కేవలం తెలుగువారే కాదు.. మొత్తంగా అమెరికాలోని భారతీయ సమూహాన్నే పరిగణనలోకి తీసుకున్నప్పుడు.. ఇక్కడి అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసే స్థాయిలో మన బలం లేదు. సమస్త భారతీయ ఓటర్లు 1 శాతం కంటే తక్కువ మందే ఉంటారు. వారందరూ కూడా కచ్చితంగా ఓటింగుకు వస్తారనే నమ్మకం లేదు. ఇటీవలి కాలంలో అమెరికాలో బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారతీయ సమాజం ఓట్ల పరంగా గెలుపును శాసించలేకపోవచ్చు గానీ.. పార్టీలకు ఆర్థిక దన్నుగా నిలవగల స్థితికి చేరుకుంది. అంతో ఇంతో భారతీయ సమాజానికి ఆశావహ పరిణామం ఇది.

భారతీయ సమూహంతో ఉన్న మరో ఇబ్బంది ఏమిటంటే.. అమెరికాలో స్థిరపడిన వారిలో చాలా మందికి అర్హతలు ఉన్నప్పటికీ.. ఓటరుగా నమోదు చేయించుకోరు. ఓటరుగా నమోదు అయిన వారిలో కూడా అనేకమంది ఓటు వేయడానికి వెళ్లరు. కేవలం భారతీయులే కాకుండా.. మొత్తంగా చూసినా ఓటింగ్ శాతం తక్కువగానే ఉంటుంది. తెలుగువాళ్లు ఓటింగును ఏ రకంగానూ ప్రభావితం చేయలేరు. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటారు. విద్యావంతుల దేశమైన అమెరికాలో సైతం ఓటింగ్ శాతం ఎక్కువ స్థాయిలో నమోదు కాదు. అగ్రరాజ్యం, విద్యావంతులు ఉండే పెద్ద దేశం అనుకునే అంచనాలకు తగినంత ఓటింగ్ జరగదు. తమ ఓటు కేవలం దేశభవిష్యత్తునే కాకుండా, యావత్తు ప్రపంచాన్నీ శాసించే నిర్ణయం అవుతుందని అమెరికన్ ఓటర్లకు బాగా తెలిసినా ఓటింగ్ శాతం తక్కువే నమోదు అవుతుంది. ఎక్కువగా ఓటింగ్ ఉండే గ్రామీణ ప్రాంతాల్లో ట్రంప్‌కు అనల్పమైన ఆదరణ ఉంటుంది. డెమొక్రాట్లను ఆదరించే నగరజీవుల్లో ఓటింగుకు గైర్హాజరీలు ఎక్కువ.

డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ తల్లి భారతీయురాలు. ఈ ఎన్నికలో ఆమెకు ఆ కారణం గొప్ప సానుకూలత అవుతుందని చెప్పలేం. ముందే చెప్పుకున్నట్టు భారతీయ ఓటర్లు డెమొక్రాట్లను అభిమానించేవారే అయినా.. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. దక్షిణ భారతదేశానికి చెందిన ఎన్నారైలలో కమలాహారిస్‌కు కచ్చితంగా మొగ్గు కనిపించే అవకాశం ఉంది. మెజారిటీ తమిళులు ఆమెను తమ సొంత మనిషిగా చూస్తున్నారు. కేరళ కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారిలో సానుకూలత పరవాలేదు. కానీ ఈ వర్గాల ఓటింగ్ శాతం చాలా చాలా తక్కువ. డెమొక్రాట్లు అనుసరిస్తున్న వలస విధానాలు భారతీయులకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. చట్టబద్ధంగా ఇక్కడకు వచ్చిన భారతీయులు కూడా కొన్ని సందర్భాలలో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి భారతీయులను కూడా చట్టవిరుద్ధంగా వచ్చిన వలసదారులుగా పొరబడుతున్న సందర్భాలు ఉన్నాయి. మరి వలసదారుల విషయంలో ట్రంప్ విధానాలకే ఆదరణ ఉంది.

కరోనా ఉపద్రవం తరువాత ఐటీ రంగం ఒడిదుడుకులకు లోనవ్వడం భారతీయులకు ఆందోళన ఎంతైనా కలిగిస్తోంది. ముఖ్యంగా జాబ్ మార్కెట్ ఎన్నడూ లేని రీతిలో అథమ స్థాయికి పడిపోయింది. లక్షలాది భారతీయులు ఉద్యోగాలు కోల్పోయారు. అదే విధంగా వేలాది విద్యార్థులు ఎంఎస్ చదువులు పూర్తిచేసి ఉద్యోగాలు లేక రకరకాల ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వాతావరణం ఏర్పడడానికి గత నాలుగు సంవత్సరాలుగా డెమొక్రాట్లు అధికారంలో ఉండడం కూడా ఒక కారణం అని భావిస్తున్నవారు లేకపోలేదు.

స్థూలంగా చూసినప్పుడు.. ఈసారి అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నిక చాలా క్లిష్టంగా ఉంది. ఏడు స్వింగ్ రాష్ట్రాల ప్రభావం చాలా ముఖ్యం. అందునా పెన్సిల్వేనియా కీలకం. ఆ ఒక్క రాష్ట్రంలో 19 ఎలక్టోరల్ ఓట్లు ఉండడం ప్రధానంగా గమనించాలి. ఏడు స్వింగ్ స్టేట్స్‌లో అందరూ పెన్సిల్వేనియా మీదనే దృష్టి పెడుతున్నారు. ప్రజల ఓట్లతో సంబంధం లేకుండా ఎలక్టోరల్ కాలేజీ ఓట్లే గెలిపించే ఎన్నికలు ఇవి. మరో కీలకాంశం ఏమిటంటే.. డెమొక్రాట్ అభ్యర్థిగా బైడెన్ తప్పుకున్నాక కమలా హారిస్‌కు బాగా బలం పెరిగింది. కేవలం ఓట్ల పరంగా కాకుండా, ధనరూపంగా కూడా సాయం పెరిగింది. కానీ ఈ బలాన్ని ఆమె ఎంత మేరకు విజయం దిశగా నడిపించగలరనే సందేహాలు పలువురిలో ఉన్నాయి. శ్వేతసౌధం (అమెరికా అధ్యక్షుని అధికార నివాసం) ఆసామీగా ఎవరు వచ్చినప్పటికీ భారతీయ సమాజం కోరుకునేది ఒక్కటే. భారత్– అమెరికా సంబంధాలు కుదురుగా ఉండాలి. అమెరికాలోని భారతీయ సమాజానికి, అమెరికా మీద ఆశలు పెంచుకుంటున్న భారతీయ యువతరానికి ప్రోత్సాహకరంగా, సహాయకరంగా ఉండాలి. ఇందుకు ఎవరు కృషిచేస్తారో వారికే భారతీయ సమూహం మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉంది.

• కృష్ణమోహన్ దాసరి
డల్లాస్, అమెరికా

భారత్–జర్మనీ హరిత భాగస్వామ్యం

జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ ఈ నెల 25, 26, 27 తేదీలలో భారత్‌లో పర్యటించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలను సమగ్రంగా పెంపొందించుకునే లక్ష్యంతో విస్తృత చర్చలు జరిపారు. ఆసియా–పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ 2024 సదస్సును ఇరువురూ సంయుక్తంగా ప్రారంభించారు. 7వ ఇండో–జర్మన్ కన్సల్టేషన్స్‌ను ఆరంభించారు.

ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ నాయకత్వంలో జర్మన్ కేబినెట్ ఈ నెల 16న సమున్నత ఆశయాలు, లక్ష్యాలతో కూడిన 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహాన్ని ఆమోదించింది. ఇది భారత్–జర్మనీ సంబంధాలలో గుణాత్మక మార్పులకు దోహదం చేయగలదనే ఆశాభావం ఇరు దేశాలలోనూ వ్యక్తమవుతోంది. భారత్–జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ ఏడాదితో 25 సంవత్సరాలు పూర్తవుతాయని, రాబోయే 25 ఏళ్లలో ఈ భాగస్వామ్యం మరిన్ని శిఖరాలను అధిరోహించి, మరింత ఔన్నత్యాన్ని సంతరించుకోగలదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు శక్తిమంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ శ్రేయస్సుకు పరస్పరం ఎలా సహకరించుకోగలవో 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహ ప్రణాళిక విశదం చేస్తుందని ఆయన అన్నారు.



> భారత్–జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో, 2022లో ఇరుదేశాలు ఆమోదించిన భారత్–జర్మనీ హరిత, సుస్థిరాభివృద్ధి భాగస్వామ్యం ఒక ప్రధాన అంతర్భాగంగా ఉన్నది. ఈ హరిత భాగస్వామ్యంలో భాగంగా భారత్‌లో ఇంధన పరివర్తనకు గాను జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యు బ్యాంక్ 100 కోట్ల యూరోల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఫోటోవోల్టాయిక్ సిస్టమ్స్, పవర్‌లైన్స్, ఓపెన్ స్పేస్ ఫెసిలిటీస్‌ను అభివృద్ధిపరిచేందుకు ఈ నిధులను మదుపు చేశారు.

ధరిత్రి జీవ వైవిధ్యాన్ని, వాతావరణాన్ని సంరక్షించడంలోను ఐక్యరాజ్యసమితి 2020 ఎజెండా నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తిలోను భారత్ ఒక కీలక పాత్ర నిర్వహించిందని 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహ ప్రణాళిక మున్నుడి పేర్కొన్నది. అంతర్జాతీయ న్యాయ నియమాలు, శాసనవిహిత అంతర్జాతీయ వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న ప్రాంతంలో భారత్ ఒక స్థిరీకృత శక్తిగా ఉన్నదని ఆ వ్యూహ పత్రం పేర్కొంది. జర్మనీకి భారత్ నిపుణ కార్మిక శక్తిని విశేష స్థాయిలో సమకూర్చుతుందని కూడా 'ఫోకస్ ఆన్ ఇండియా' ప్రశంసించింది.

భారత్–జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో, 2022లో ఇరుదేశాలు ఆమోదించిన భారత్–జర్మనీ హరిత, సుస్థిరాభివృద్ధి భాగస్వామ్యం ఒక ప్రధాన అంతర్భాగంగా ఉన్నది. ఈ హరిత భాగస్వామ్యంలో భాగంగా భారత్‌లో ఇంధన పరివర్తనకు గాను జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యు బ్యాంక్ 100 కోట్ల యూరోల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఫోటోవోల్టాయిక్ సిస్టమ్స్, పవర్ లైన్స్, ఓపెన్ స్పేస్ ఫెసిలిటీస్‌ను అభివృద్ధి పరిచేందుకు ఈ నిధులను మదుపు చేశారు.

ఈ హరిత భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో ఇటీవల గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'రి–ఇన్వెస్ట్' పునరుద్ధరణీయ ఇంధన మదుపుదారుల సమావేశం నొకదాన్ని నిర్వహించారు. జర్మనీతో సహా పలుదేశాల ఉన్నత స్థాయి రాజకీయ, పారిశ్రామిక ప్రతినిధులు ఆ సదస్సులో పాల్గొన్నారు. 'భారత్ ఒక అభివృద్ధి చెందుతున్న దేశమే అయినప్పటికీ తొమ్మిదేళ్ల క్రితం పారిస్ వాతావరణ సదస్సు నిర్దేశించిన వాతావరణ పరిరక్షణ లక్ష్యాల పరిపూర్తిలో ముందంజలో ఉందని' ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ప్రారంభోపన్యాసంలో అన్నారు. హరిత పరివర్తనను ఒక ప్రజా ఉద్యమంగా భారత్ పరిగణిస్తుందని అంటూ పిఎమ్ సూర్యఘర్ మఫ్త్ బిజిలి యోజనతో భారత్‌లో ప్రతి గృహమూ ఒక విద్యుత్ ఉత్పత్తిదారుగా రూపొందనున్నదని నరేంద్ర మోదీ అన్నారు. 'ఇంధన పరివర్తన లక్ష్యాలను భారత్ సాధించగలిగితే అంతిమంగా సమస్త ప్రపంచమూ లబ్ధి పొందుతుందని జర్మన్ ప్రభుత్వ ఆర్థిక సహకార మంత్రి స్వెన్జ షుల్జె అన్నారు. 140 కోట్ల మందికి పైగా ఉన్న భారతీయులు తమ విద్యుత్ అవసరాలను పవన, సౌరశక్తి నుంచి సమకూర్చుకోగలిగినప్పుడే వాతావరణ మార్పు సంక్షోభం నిలిచిపోగలదని జర్మన్ మంత్రి అన్నారు.

భారత్–జర్మనీ హరిత భాగస్వామ్యంలో భాగంగా వాతావరణ మార్పు సంబంధిత అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక పాలనా సంస్థలు, మరీ ముఖ్యంగా పౌర సమాజ సంస్థలతో ప్రభావశీల, పారదర్శక చర్చలు జరపవలసిన అవసరమున్నది. శిలాజ ఇంధనాల వినియోగం వల్ల వాతావరణ సంక్షోభం ఏర్పడుతున్న నేపథ్యంలో ఇంధన వినియోగంలో మౌలిక మార్పులు రావలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ మార్పులు కర్బన ఉద్గారాలు సాధ్యమైనంత తక్కువ స్థాయిలో ఉండేందుకు తప్పక దోహదం చేయాలి. ఇందుకు అనేక రంగాలలో ముఖ్యంగా ఇంధన ఉత్పత్తి, చలనశీలత, ఆహారోత్పత్తి, చిన్న పరిశ్రమలు, గృహ అవసరాలకు ఇంధన వినియోగం, మరీ ముఖ్యంగా జీవన శైలీ రీతుల్లోను మౌలిక మార్పులు సాధించవలసిన అవసరమున్నది. ఇంధన వ్యవస్థల పరివర్తనలో పౌరులు చొరవతో కీలకపాత్ర వహించడం చాలా ముఖ్యం.

పునరుద్ధరణీయ ఇంధన ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా ప్రథమ స్థానంలో ఉండగా జర్మనీ ద్వితీయ స్థానంలో ఉన్నది. భారత్ ఈ విషయంలో జర్మనీకి దరిదాపుల్లో ఉన్నది. అయితే జర్మన్ విద్యుత్ వినియోగదారులు ప్రొజ్యూమర్స్ (ఇంధన వినియోగదారులే ఇంధనాన్ని ఉత్పత్తి చేసుకునేవారుగా ఉండడం)గా పరిణమించడం అంతకంతకూ అధికమవుతోంది. అంతే కాదు సమష్టిగా ఇంధనాన్ని ఉత్పత్తి చేసుకునే కార్యకలాపాలలో భాగస్వాములు అవుతున్నారు. జర్మనీలో ఇప్పుడు 847 ఇంధన సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 2,20,000 మంది పౌరులు భాగస్వాములుగా ఉన్నారు. ఈ ఇంధన సహకార సంఘాలలో 80 శాతానికి పైగా ఫోటోవోల్టాయిక్ వ్యవస్థలను నిర్వహిస్తున్నారు ఈ ఇంధన సహకార సంఘాలు 2020 సంవత్సరంలో 8.8 టెరావాట్ హరిత విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి.

◆ రమేష్ చెన్నమనేని
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు

ఇంటిగ్రేటెడ్ గురుకులాలు వద్దు

గురుకుల పాఠశాలలు ఈ రాష్ట్రానికి కొత్తకాదు. దేశానికి ప్రభుత్వ రంగంలో గురుకుల విద్యను పరిచయం చేసిందే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. 1972లో పి.వి. నరసింహారావు నేతృత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో మూడు గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసి వాటిని క్రమంగా విస్తరించారు. 1983లో యన్.టి. రామారావు నేతృత్వంలో ఎస్.ఆర్. శంకరన్ స్వీయ పర్యవేక్షణలో సాంఘిక సంక్షేమ గురుకులాలు ప్రారంభమయ్యాయి. వీటి స్ఫూర్తితో రాష్ట్రంలో ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు కూడా ప్రారంభమయ్యాయి. గురుకుల పాఠశాలల ఏర్పాటుకు ప్రధాన కారణం– రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలకు, ఆయా సంక్షేమ శాఖల ద్వారా కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, వసతి గృహాలకు సమన్వయం లేకపోవడం. ప్రస్తుతమున్న గురుకుల వ్యవస్థ, అవస్థాపనా సౌకర్యాల కొరత, నిధుల మంజూరులో జాప్యం మినహాయిస్తే, సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్న విమర్శ గాని, ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులు బూడిద పాలవుతున్నాయనే ఆరోపణలు గాని లేవు. ఆయా గురుకుల సంస్థలు ఫలితాల పరంగా ప్రైవేటు రంగంకంటే చాలా ముందుంటున్నాయి. ప్రభుత్వ రంగంలో నిర్వహించబడుతున్న అన్ని విద్యా సంస్థలకు ఈ గురుకులాలు పెట్టని కోటలుగా ఉన్నాయి. ఆయా వర్గాలకు నిర్దేశించిన పాఠశాలల్లో 75శాతం ఆ వర్గాల విద్యార్థులకే ప్రయోజనం చేకూర్చే విధంగా కేటాయించడంతో పాటు 25శాతం ఇతర వర్గాలను కూడా ఈ గురుకులాలు అక్కున చేర్చుకున్నాయి. కులాల వారి విద్యాసంస్థలు సమాజానికి మేలు చేయవని, సమీకృత గురుకుల విద్యాసంస్థలే, మెరుగైన సమాజాన్ని నిర్మిస్తాయని భావించిన మేధావులుగాని, ఆ సూచనలు పాటించిన ప్రభుత్వం గాని అసలు విషయాలను అర్థం చేసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ప్రభుత్వ వర్గాలు దాటవేస్తున్నాయి.

1. సాధారణ గురుకులాలుగా వీటిని పరిగణిస్తే 50శాతం లోపే ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాలకు దక్కుతాయి. దీంతో ఆయా వర్గాల విద్యార్థులు నష్టపోతారనే విషయం నిజం కాదా? 2. ప్రస్తుతమున్న జనరల్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలను ఒకే ప్రాంగణంలో ఏర్పరచి అవస్థాపనా సౌకర్యాలను, 5000 పుస్తకాల గ్రంథాలయాన్ని, ఆటస్థలాలను మాత్రమే సమీకృతంగా ఉంచితే, ఆయా విద్యార్థుల మధ్య ఏర్పడే సామాజిక వైషమ్యాలకు ఈ మేధావులు బాధ్యత వహిస్తారా? 3. విద్యాశాఖ బడ్జెట్‌లో లోటు కారణంగా ఆయా సంక్షేమ శాఖలకు కేటాయించిన చట్టబద్ధమైన బడ్జెట్‌ను దారి మళ్లించి, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేసి సొమ్మొకరిది, సోకొకరిది అనే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తుందనే విమర్శలొస్తున్నాయి.

అదే విధంగా రావణకాష్టంలా మండుతున్న బాసర లాంటి ఉదాహరణలను మన కళ్ళ ముందుంచుకొని, ఏకంగా వేలాదిమంది విద్యార్థులను ఒకేచోట సమూహపరిచి గురుకులాల్లో తరచుగా సంభవించే కలుషిత ఆహారం, అంటువ్యాధులు వంటి వాటికి ఎలా అడ్డుకట్ట వేస్తారు? వీటితోపాటు ప్రస్తుతం ఆయా సంస్థల ద్వారా స్వతంత్రంగా నడుపుతున్న వేయికి పైగా గురుకుల విద్యాసంస్థలను ఎవరి నియంత్రణ కింద కొనసాగిస్తారు?

ఈ సమీకృత పాఠశాలల పరిసర ప్రాంతాల్లో నడిచే ప్రభుత్వ పాఠశాలలను విద్యాసంస్థలను ప్రభుత్వం పట్టించుకోదని, వాటికి సహజ మరణం తప్ప, మార్గం ఉండదని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిష్ఠకు పోకుండా, అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి విధివిధానాల పట్ల వివరణ ఇచ్చి, ఆయా గురుకులాల ఉపాధ్యాయులతో, కుల సంఘాలతో సమగ్రంగా చర్చించి ముందుకు వెళ్లాలి. లేకపోతే జరగబోయే నష్టానికి ఈ నిర్ణయంతో భాగస్వామ్యం అయిన ప్రభుత్వంతో పాటు, సమాజం కూడా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

– డా. పి. మధుసూదన్‌రెడ్డి
అధ్యక్షులు, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం

ఆ ముసుగులో ఇంకా ఏమేం చేశారో?

ఉమ్మడి రాష్ట్రంలో 1969లో శ్రీకాకుళ విప్లవోద్యమాన్ని అణచివేయడానికనే పేరు మీద అధికార పార్టీ రాజకీయ నాయకత్వం పోలీసులకు మితిమీరిన అధికారాలను కట్టబెట్టిందనీ, పోలీసులు ఆ తర్వాత కూడా ఆ అధికారాలను అదే పేరు మీద విచ్చలవిడిగా వాడుతున్నారనీ, రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లో కూడా అదే హక్కుల హననం రాజ్యాంగాతీతంగా, చట్టాతీతంగా, అప్రజాస్వామికంగా సాగిపోతున్నదనీ ఇంతకాలమూ విమర్శకులు అంటున్న మాటను ఇప్పుడు స్వయంగా తెలంగాణ పోలీసు శాఖ కూడా అంగీకరిస్తున్నట్టున్నది.

తెలంగాణలో ప్రతిపక్ష, అధికారపక్ష రాజకీయ నాయకుల, అధికారుల, ప్రముఖుల, జర్నలిస్టుల ఫోన్ల మీద కొందరు పోలీసు అధికారులు అక్రమ నిఘా పెట్టి, వారి సంభాషణలను రికార్డ్ చేశారని నడుస్తున్న టెలిఫోన్ టాపింగ్ కేసులో రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హైకోర్టు ముందు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్ అక్షరాలా అదే మాట అంటున్నది. అలా అక్రమాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ప్రభుత్వమే ప్రస్తుతం ఆరోపిస్తున్న ఆ పోలీసు అధికారులు విప్లవోద్యమాన్ని అణచివేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి చెందినవారు.

ఆగస్ట్ 19న దాఖలయిన ఆ కౌంటర్ అఫిడవిట్‌లో, "పదవీ విరమణ పొందిన తర్వాత పొడిగింపు మీద ఉద్యోగంలో, అధికారిక హోదాలో కొనసాగిన ప్రభాకర్ రావు, చట్టబద్ధమైన నిఘా కోసం సంబంధిత అధికారులు ఇచ్చే అవసరమైన ముందస్తు అనుమతులు లేకుండానే, నిర్వహణా కారణాల (operational reasons), వామపక్ష తీవ్రవాద చర్యల ముసుగులో (under the guise) తన నిఘా చర్యలు సాగించారు" అనీ, "తప్పుడు సమర్థనలు, అసత్య కథనాలు, మోసం ద్వారా అధికారుల అనుమతి సంపాదించారు" అనీ రాశారు. తమ వాళ్లే, తమ శాఖకు చెందిన అధికారులే నేరం చేశారని ఎవరైనా చెప్పడాన్ని న్యాయ పరిభాషలో ఒప్పుదల ప్రకటన అనీ, నేరాంగీకార ప్రకటన అనీ, అప్రూవర్ స్టేట్మెంట్ అనీ అంటారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వ హోమ్ శాఖ కార్యదర్శి అప్రూవర్ స్టేట్మెంట్ తమ శాఖే గతంలో ఎలా పనిచేసిందో చెపుతున్నది. స్వయంగా హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శే "ముసుగు" అనే మాట వాడారంటే, అటువంటి ఒక ముసుగు ఉండిందనీ, ఆ ముసుగు కింద పోలీసు అధికారులు తప్పుడు పనులు చేసే అవకాశం కూడ ఉండిందనీ అర్థం. అలా తప్పుడు పనులు చేసిన అధికారులు తమ పనులకు "తప్పుడు సమర్థనలు చెప్పే, అసత్య కథనాలు వినిపించే, మోసం చేసే" అవకాశం ఉండిందని కూడా హోమ్ శాఖ అత్యున్నతాధికారి న్యాయస్థానంలో ప్రమాణపూర్తిగా ఇప్పుడు అంగీకరిస్తున్నారు.

ఇది ప్రస్తుతానికి తెలంగాణ పోలీసు శాఖలో కొందరు కీలక అధికారులు గత పాలకుల రాజకీయ, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం, వారి ఆదేశాలకు అనుగుణంగానో, రాజును మించిన రాజభక్తితోనో రాష్ట్రంలో అనేక మంది పౌరుల ఫోన్ల మీద, ఎలక్ట్రానిక్ పరికరాల మీద నిఘా పెట్టి, గోప్యమైన సమాచారం సేకరించారనే కేసుకు సంబంధించినది మాత్రమే కావచ్చు. ఆ టెలిఫోన్ టాపింగ్ కేసు, అందులో జరిగిన రాజ్యాంగ వ్యతిరేక అక్రమాలకు సంబంధించి మొత్తంగా సమాజం చర్చించవలసిన కోణాలు, తెలుసుకోవలసిన నిజాలు ఎన్నో ఉన్నాయి గాని, వాటిని అలా ఉంచి ప్రస్తుతానికి ప్రభుత్వం వైపు నుంచే వెలువడిన ఈ నేరాంగీకార ప్రకటనను చర్చించడం అవసరం.

సరిగ్గా తెలంగాణ పోలీసు ఉన్నతాధికారి ఒక అత్యున్నత న్యాయస్థానం ముందు ప్రమాణపూర్తిగా ఆ నేరాంగీకార ప్రకటన చేస్తున్న సమయానికే పొరుగు రాష్ట్రంలో మరిన్ని ఇటువంటి విషయాలే బైటపడ్డాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వారసత్వాన్ని కొనసాగిస్తున్న విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు ముగ్గురు పోలీసు ఉన్నతాధికారులు తలచుకుంటే, ముఖ్యమంత్రి స్నేహితుడిని రక్షించడానికి అబద్ధపు కేసులు సృష్టించగలరని వార్తలు బైటపడ్డాయి. గత ముఖ్యమంత్రికి సన్నిహితుడైన ఒక వ్యాపారి వ్యక్తిగత కక్ష తీర్చడం కోసం రాష్ట్ర పోలీసు శాఖ ఎన్ని ఘోరాలకు, అక్రమాలకు పాల్పడగలదో ఆ వార్తలు తెలియజేశాయి.

ఇటు తెలంగాణ ప్రభుత్వపు కౌంటర్ అఫిడవిట్ గాని, అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా బయటపెడుతున్న గత ప్రభుత్వ వ్యవహారాలు గాని ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి. ఒకప్పటి ఉమ్మడి రాష్ట్రంలో శిక్షణ, అనుభవం పొందిన ప్రస్తుత రెండు రాష్ట్రాల పోలీసు శాఖలకు తమకు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, జవాబుదారీగా విధి నిర్వహణ చేయవలసిన బాధ్యత ఉన్నదని తెలియదు. వారికి శిక్షణలో ఆ విషయాలు పాఠాలు చెప్పి ఉంటారు గాని, ఆ తర్వాత "నిర్వహణా కారణాలు", "వామపక్ష తీవ్రవాద చర్యలు" అనే సాకులో, కారణాలో, ముసుగో చూపెట్టి చట్టాన్ని అతిక్రమించడానికి, వ్యక్తుల, సమూహాల హక్కులను హరించడానికి, రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను కాలరాయడానికి పాలకులు బారాఖూన్ మాఫ్ అనుమతులు ఇస్తూ వచ్చారు.



> తోటకూర దొంగతనం నాడే అడ్డు చెప్పి ఉంటే ఇంత దూరం వచ్చేదా అని మన తెలుగు సామాజిక వివేకం ఉంది. చట్టాన్ని అతిక్రమించడానికి, స్వయంగా చట్టవ్యతిరేక పనులు, నేరాలు, అక్రమాలు, ఘోరాలు చెయ్యడానికి పోలీసు యంత్రాంగాన్ని అనుమతించి, ప్రోత్సహించి, సమర్థించి, దశాబ్దాలు గడిచిపోయాక, ఇప్పుడు ఆ "ముసుగు"లో ఇంకేవో చేశారనీ, ఒక నాయకుడి స్నేహితుడిని సంతోషపెట్టడానికి అక్రమాలు చేశారనీ ఇప్పుడు వగచి ఫలితమేమిటి?

వలస పాలనా కాలంలో తయారైన పోలీసు శాఖ ప్రజలను శత్రువులుగా భావించే అవగాహనను తన శిక్షణలో భాగం చేసుకుంది. వలస పాలకులు ప్రారంభించిన ఆ శిక్షణ 1947 తర్వాత ఎంతమాత్రమూ మారలేదు. అందువల్ల దేశంలో చాలా రాష్ట్రాల పోలీసు శాఖలు ఇలానే ఉండవచ్చు గాని, రెండు తెలుగు రాష్ట్రాల పోలీసు శాఖలు ఇలా ఉండడానికి ప్రత్యేకమైన చారిత్రక కారణాలున్నాయి. ఉమ్మడి రాష్ట్రం రోజుల నుంచీ స్వయంగా ప్రభుత్వాలే పోలీసులు రాజ్యాంగాన్ని అతిక్రమించినా, పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా చూసీ చూడనట్టు పోతూ వచ్చారు. సామాజిక ఆర్థిక సమస్యలకు తాము సాధించవలసిన పరిష్కారాలలో విఫలమవుతూ అంతకంతకూ ఎక్కువగా పోలీసుల మీద ఆధారపడుతూ వచ్చారు. ఆ క్రమంలో రాజకీయ నాయకులు, ముఖ్యంగా అధికారపక్ష నాయకులు ప్రజల మధ్యకు స్వేచ్ఛగా వెళ్లలేని స్థితి తామే కల్పించుకుని, పోలీసుల భద్రతా వలయమే, చక్రబంధమే రక్షణ అనుకుని నానాటికీ ప్రజలకు దూరమైపోయారు. రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మార్చారు.

ఆ క్రమంలోనే ఇప్పుడు స్వయంగా హోమ్ కార్యదర్శి "ముసుగు" అంటున్న విప్లవోద్యమం, లేదా పోలీసు పరిభాషలో "వామపక్ష తీవ్రవాదం" పోలీసుల మితిమీరిన అధికారాలకు ఒక కారణమైంది. శ్రీకాకుళం జిల్లాలో 1958 నుంచీ సాగుతుండిన గిరిజనోద్యమం 1968 తర్వాత నక్సల్బరీ విప్లవోద్యమ మార్గం చేపట్టగానే ప్రభుత్వం అంతవరకూ సాగిస్తున్న అణచివేత విధానానికి మరిన్ని కోరలు తొడిగింది. కలకత్తా నుంచి వస్తూ 1969 మే 27న సోంపేట రైల్వేస్టేషన్‌లో దిగిన పంచాది కృష్ణమూర్తి, ఆయన సహచరులు ఆరుగురిని పట్టుకుని జలంతర కోటపాతకోట కొండలకు తీసుకువెళ్లి కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్' కథ అల్లి ప్రకటించారు. ఆ రోజు జరిగిన హత్య ఏడుగురు విప్లవోద్యమ కార్యకర్తలది మాత్రమే కాదు. ఆ రోజు రాజ్యాంగంలోని అధికరణం 21 హామీ ఇచ్చిన జీవించే హక్కు హత్య జరిగింది. అధికార యంత్రాంగం చట్టప్రకారం పని చేయాలనే విధ్యుక్తధర్మం, చట్టబద్ధ పాలన అనే విలువ అన్నీ హతమైపోయాయి. "వామపక్ష తీవ్రవాదాన్ని అణచడానికి" ఇటువంటి చట్టాతీత అధికారాలు పోలీసులకు ఇవ్వక తప్పదని ఆ నాటి ప్రభుత్వమూ అనుకుంది. ఆ తర్వాత యాభై ఐదు సంవత్సరాలుగా అన్ని ప్రభుత్వాలూ అనుకుంటున్నాయి.

అదే కారణంతో ఆ తర్వాత కాలక్రమంలో పోలీసులకు మనుషులను చంపే, తప్పుడు కేసులు పెట్టే, వేధించే అధికారం మాత్రమే కాదు, ఆ అణచివేత కోసం విచ్చలవిడిగా లెక్క చెప్పనక్కరలేని నిధులు, వాహనాలు, కోవర్టులను ఉపయోగించుకునే కుటిలత్వం, మనుషులను చంపితే నగదు పారితోషికాలు, త్వరితగతి పదోన్నతులు వంటి అనేక ఆకర్షణలు చూపి మరింతమంది పోలీసు అధికారులు ఈ హంతక కార్యక్రమంలో పాలుపంచుకునేలా చేశారు.

నిజానికి "వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలు" అనేవి చట్టవ్యతిరేకమైనవని ప్రభుత్వం అనుకుంటే వాటి విషయంలో కూడా ప్రభుత్వ చర్యలు చట్టబద్ధంగా ఉండవలసిందే తప్ప చట్టవ్యతిరేకంగా, చట్టాతీత ప్రవర్తనతో ఉండగూడదు. చట్టాన్ని ప్రజలు పాటించకపోవడం ఎప్పుడైనా జరగవచ్చు, అందుకే నేర శిక్షా స్మృతులు వాటిని నేరాలుగా నిర్వచించి వాటికి శిక్షలను నిర్దేశించాయి. కాని చట్టాన్ని అమలు చేయవలసినవారే చట్టాన్ని ఉల్లంఘిస్తే దానికి పరిహారం ఏమిటి? చట్టాన్ని అమలు చేయడం తప్ప మరొక పని చేయడానికి అధికారం లేని పోలీసు యంత్రాంగాన్ని చట్టాతీతంగా ప్రవర్తించమనీ, ఇష్టారాజ్యంగా ఏమి చేసినా పర్వాలేదనీ ఉసిగొల్పింది రాజకీయ నాయకత్వమే కావచ్చు. కాని కాలక్రమంలో ఆ రాజకీయ నాయకత్వపు ఆదేశాలను పాటిస్తూనో, అతిక్రమిస్తూనో ఆ అధికారాన్ని వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకు వాడుకునే అవకాశం ఉంటుందని చరిత్ర రుజువు చేసింది. ఒకసారి ఇంత విచ్చలవిడి అధికారం చేతికి అందినతర్వాత, నెత్తురు రుచి మరిగిన పులి లాగా ఇతర పనులకు, సొంత పనులకు, తమ పై అధికారులు చేప్పే పనులకు, తమ పై రాజకీయ నాయకత్వాన్ని సంతోషపెట్టే పనులకు ఆ అధికారాన్ని వాడుకోవడమూ, వాడుకోవడానికి ప్రయత్నించడమూ సహజమే.

తోటకూర దొంగతనం నాడే అడ్డు చెప్పి ఉంటే ఇంత దూరం వచ్చేదా అని మన తెలుగు సామాజిక వివేకం ఉంది. చట్టాన్ని అతిక్రమించడానికి, స్వయంగా చట్టవ్యతిరేక పనులు, నేరాలు, అక్రమాలు, ఘోరాలు చెయ్యడానికి పోలీసు యంత్రాంగాన్ని అనుమతించి, ప్రోత్సహించి, సమర్థించి, దశాబ్దాలు గడిచిపోయాక, ఇప్పుడు ఆ "ముసుగు"లో ఇంకేవో చేశారనీ, ఒక నాయకుడి స్నేహితుడిని సంతోషపెట్టడానికి అక్రమాలు చేశారనీ ఇప్పుడు వగచి ఫలితమేమిటి? ఇప్పటికైనా, ఎప్పటికైనా ఆ ముసుగులో ఇంకా ఎన్నెన్ని భయంకర నేరాలు జరిగాయో బైటపడతాయా?

▪ ఎన్. వేణుగోపాల్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
మంగళవారం 29 అక్టోబరు 2024

ఎల్కతుర్తి మండల సమాఖ్యకు ప్రథమ స్థానం

- జాతీయ స్థాయిలో దక్కిన గుర్తింపు
- రాష్ట్రం నుంచి ఎంపికైన ఒకేఒక్క సంఘం





ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

ప్రజావాణికి వినతుల వెల్లువ

- వరంగల్ జిల్లా గ్రీవెన్స్‌కు109 దరఖాస్తులు
- స్వీకరించిన కలెక్టర్ సత్యశారద
- హనుమకొండలో104 దరఖాస్తులు
- స్వీకరించిన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

6



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి..

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో వెల్లువెత్తిన దరఖాస్తులు

6

ప్రజా పంపిణీ పక్కదారి

జిల్లాలో జోరుగా రేషన్ బియ్యం దందా



- కొందరు డీలర్లే సూత్రధారులుగా వ్యాపారం
- చిత్తు కాగితాలు ఏరేవారే ముఠాగా మారిన వైనం
- రేషన్ షాపుల సమీపంలోనే వాహనాలతో మకాం
- లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.15 నుంచి రూ.20కి కొనుగోలు
- ఇతర రాష్ట్రాలకు యథేచ్ఛగా రవాణా
- రూ.కోట్లలో వ్యవహారం.. అధికారులకు వాటాలు

హనుమకొండ సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత బియ్యం అక్రమార్కులకు అక్షయ పాత్రగా మారాయి. కొందరు రేషన్ డీలర్లు బియ్యాన్ని అక్రమ పద్ధతిలో మళ్లించడంలో కీలక పాత్రదారులుగా మారారు. ఇక కొందరు మిల్లర్లు కూడా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి సన్న బియ్యంగా మార్చి విక్రయించే దందాను సాగిస్తున్నారు. ఫలితంగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అయ్యే బియ్యం అక్రమార్కులకు కాసులను కురిపిస్తున్నాయి. ప్రభుత్వ సొమ్మును తమ అక్రమ సంపాదనకు మార్చుకుంటూ రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు. అధికారుల కుమ్మక్కు ఈ దందాకు సహకారంగా మారింది. రేషన్ బియ్యాన్ని కొందరు మిల్లర్లు కొనుగోలు చేసి వాటిని మర పట్టించి సన్న బియ్యంగా ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తూ కోట్లలో అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు.

ఉచిత బయ్యాన్ని కొంటున్న కొందరు..

రేషన్ షాపులో ఉచితంగా పొందిన బియ్యాన్ని లబ్ధిదారులు కిలోకు రూ.15 నుంచి 20కి విక్రయిస్తున్నారు. ఇందులో కొందరు డీలర్లే మధ్య దళారులుగా వ్యవహరిస్తున్నారు. డీలర్ల మధ్య వర్తిత్వంలో కొంత విక్రయాలు జరుగుతుండగా మరికొందరు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే బియ్యం దందా ముఠా సభ్యులు వచ్చి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

రేషన్ షాపుల సమీపంలోనే వాహనాలు

హనుమకొండ జిల్లాలో మొత్తం 416 రేషన్ షాపులు ఉన్నాయి. ఈ షాపులో సమీపంలోనే బియ్యం ముఠాలోని వ్యక్తులు వాహనాలు పెట్టుకొని కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని ఆ వాహనాల్లో తరలిస్తున్నారు. గతంలో డీసీఎంలు ఉండేవి అయితే ఈ వాహనాల గుర్తుగా దాడులు జరుగుతుండడంతో వాహనాలను మార్చారు. ఎవరికి అనుమానం రాకుండా ఆటోలు, ట్రాలీలు పెట్టి అక్కడే బియ్యాన్ని కిలోల వారిగా కొనుగోలు చేస్తున్నారు. అనంతరం వాటిని రహస్య ప్రదేశాలకు తరలిస్తున్నారు.

చిత్తు కాగితాలు సేకరించే వారే కొనుగోలుదారులుగా...


బియ్యం ముఠా తమ దందాకు చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ ఇతర బయట పడ వేసిన వస్తువులను సేకరించే వారినే ఎంచుకుంటోంది. సంచార జాతుల వారు కూడా లబ్ధిదారుల నుంచి అక్రమంగా బియ్యం కొనుగోలు చేసి బియ్యం మాఫియాకు చేరవేస్తున్నారు. గతంలో వలే ఇప్పుడు చిత్తు కాగితాలు సేకరించే వారి సంఖ్య తగ్గుతోందని, వీరిలో చాలామంది బియ్యం దందా ద్వారా సంపాదన మార్గాన్ని ఎంచుకోవడమే కారణమని నిఘా వర్గాల అధికారులు చెబుతున్నారు. తమ దాడుల్లో వీరు పట్టుబడడంతోనే ఈ వ్యవహారాన్ని పసిగట్టామని అధికారులు అంటున్నారు.

మిల్లర్ల అక్రమ దందా


రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో కొందరు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని మరపట్టించి సన్న బియ్యంగా మార్చి విక్రయిస్తున్నారు. ఇలా కోట్లలో సాగుతున్న అక్రమ బియ్యం దందాలో కొందరు మిల్లర్లే అన్నీ తామై వ్యవహారం నడుపుతున్నారు. మర పట్టించి సన్న బియ్యంగా మార్చి మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

కొందరు డీలర్లే సూత్రధారులు

బియ్యం అక్రమాల్లో కొందరు డీలర్లే కీలక సూత్రధారులు. ప్రభుత్వం ఒక కుటుంబంలోని తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని అందచేస్తుంది. ఇదే అదనుగా రేషన్ డీలర్లు వారి వారి షాపుల పరిధిలోని లబ్ధిదారులను ఎంచుకొని వక్రమార్గంలో బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. తెల్లరేషన్ కార్డులను కొందరు ఇతర పథకాలకు వినియోగించుకునేందుకు మాత్రమే పొందారు. వాస్తవానికి వీరింత అనర్హులే. ఈ క్రమంలో రేషన్ డీలర్లు వీరిని గుర్తించి బియ్యాన్ని వారి నుంచి కొనుగోలు చేయడాన్ని మార్గంగా ఎంచుకున్నారు. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్న వారిలో సగానికి సగం మంది అనర్హులుగా ఉన్న వారే అనేది అంచనా. దొడ్డు బియ్యం అవసరత లేని వారు వీటిని అమ్మేసుకుంటున్నారు.



రూ.కోట్ల వ్యవహారంలో అధికారులకు వాటాలు..



రేషన్ బియ్యం అక్రమ దందాల్లో డీలర్ల నుంచి మిల్లర్లు ఇతర రాష్ట్రాల కొనుగోలు ముఠా వరకు కోట్లలో అక్రమ సంపాదన మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. ఈ దందాను అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీస్ ఇతర నిఘా వర్గాలు ప్రేక్షక పాత్రను వహిస్తున్నాయి. ఇందుకు కారణం వీరికి వాటాలు ముట్టడమే అనే ఆరోపణలు ఉన్నాయి. రికార్డుల్లో నమోదు కోసమే నామా మాత్రంగా దాడులు జరుపడం, కొన్ని కేసులు నమోదు చేయడాన్ని చూపుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

2న ఉమ్మడి జిల్లాకు బీసీ కమిషన్ రాక

- స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రజాభిప్రాయ సేకరణ
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యుల బృందం నవంబర్ 2వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. బీసీ కమిషన్ బృందం రానున్న నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.రాంరెడ్డి, ఇతర అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్ ప్రావీణ్య సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. స్థానిక సంస్థల వారిగా కల్పించే రిజర్వేషన్ దామాషాపై జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో 2వ తేదీన నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం పర్యటిస్తుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీలు బహిరంగ విచారణ నిమిత్తం నవంబర్ 2న జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. నవంబర్ 2న ఉదయం 10గంటల నుంచి 11:30 గంటల వరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలలకు , ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భూపాలపల్లి, ములుగు జిల్లాలు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4గం టల వరకు మహబూబాబాద్, జనగామ జిల్లాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. రూ.20 జ్యుడీషియల్ స్టాంపు పేపర్‌పై ప్రమాణపత్రం, ప్రభుత్వ నోటరీ అడ్వకేట్ సంతకంతో తమ అభిప్రాయాలను, విజ్ఞప్తులను కమిషన్‌కు సమర్పించవచ్చని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- కుడా కార్యాలయంలో డివిజన్ల అభివృద్ధిపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పక్కన మేయర్ సుధారాణి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో వేగం పెంచి త్వరితగతిన పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంపై కుడా కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి అధికారులను పలు అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని పనులు ఇంకా పూర్తి కాకుండా నిలిచిపోవడం, ఇంకా కొన్ని పనులకు టెండర్లు కూడా పిలవకపోవడంతో అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. టెండర్లలో పనులు దక్కించుకుని పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పబ్లిక్ గార్డెన్ చుట్టూ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలన్నారు. బల్దియాలో కొందరు శానిటేషన్ సిబ్బంది, జవాన్లు పనులు చేయకుండా విధులకు డుమ్మాలు కొడుతున్నారని వార్తలు, ఫిర్యాదులు వాస్తున్నాయని, వారిని గుర్తించి విధుల నుంచి తొలగించాలని ఆదేశించాలని లేదా బదిలీ చేయాలన్నారు. శానిటేషన్ సిబ్బంది చాలా చోట్ల పనులు చేయకుండా అక్రమ వసూళ్లకు పాల్పడి పనులు చేయకపోవడం వల్ల డ్రైనేజీలు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని సమస్య పరిష్కరించాలని చెప్పారు. బాలసముద్రం ఎల్‌బీసీ భవనం పక్కల రోడ్లపై చిరువ్యాపారులు కూరగాయలు విక్రయించడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. వరంగల్ నగరంలో కోతుల, వీధికుక్కల బెడద అధికంగా ఉందని, సంబంధిత అధికారులు గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా నిర్మాణాలు చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆస్పత్రులలో పార్కింగ్, మూత్రశాలలు ఉండేలా చూడాలన్నారు. కాళోజీ కళాక్షేత్రంలో బోర్డులు తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు ఉర్దూలో కూడా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో గోకుల్‌జంక్షన్, పెగడపెల్లి డబ్బాల జంక్షన్‌లలో బల్దియా అధికారులు వెడల్పు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు.

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. 15 ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, స్మార్ట్ సిటీ నిధులతో నగరాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మేయర్, కమిషనర్ మాట్లాడుతూ.. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.66.57కోట్లతో 667 పనులు మంజూరు కాగా, రూ.19.62కోట్లతో 379 పనులు పూర్తి చేశామన్నారు. రూ.13.42కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. బల్దియా పరిధిలో పని చేస్తున్న జవాన్‌లను బదిలీ చేయాలని ఎమ్మెల్యే సీఎంహెచ్‌వోను ఆదేశించడంతో వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, బల్దియా ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, ఈఈ మహేందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణలతో పాటు ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, కుడా అధికారులు పాల్గొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

- పాలకులపై ఒత్తిడి చేస్తున్న కుహనా శక్తులు
- దీనిని తిప్పికొట్టేందుకు మరో పోరాటం
- త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం
- ఓబీసీ సంఘాల నేతల వెల్లడి
- భవిష్యత్ పోరాటాలపై కార్యాచరణకు కసరత్తు



ఐక్యతాభివాదం చేస్తున్న ఓబీసీ సంఘాల నేతలు

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ప్రస్తుతం అమలులో ఉన్న పదిశాతం రిజర్వేషన్లను రద్దు చేయించేందుకు కొన్ని కుహనా శక్తులు కుట్ర పన్నుతున్నాయని కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి గంగవరపు రామక్రిష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం హనుమకొండలోని బ్రాహ్మణభవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో రామక్రిష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ కుట్రను తిప్పికొట్టేందుకు ఓబీసీ సంఘాలన్నీ మరో పోరాటానికి సిద్ధమవుతున్నాయని అన్నారు. ఓబీసీ రిజర్వేషన్ల రద్దు కోసం కొందరు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని, దీనిని ఓబీసీ సంఘాలు సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనేకరాష్ట్రాలలో అగ్రవర్ణ పేదలకు న్యాయం జరగాలని చేసిన ఓసీ ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా అగ్రవర్ణ పది శాతం రిజర్వేషన్ కల్పించిందని అన్నారు. వైద్య, విద్య, ఉపాధి రంగాల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ రిజర్వేషన్ అమలు చేయడానికి రెండేళ్ల పోరాటం చేసిన తర్వాతగానీ అమలులోకి రాలేదన్నారు. దీనిని సహించలేని కుహనా మేధావులు ఈడబ్ల్యుఎస్‌ను రద్దు చేయాలని మెమోరాండాలు ఇస్తూ పత్రికా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ధోరణి ఓబీసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు.

తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఇతర రాజర్వేషన్లకు తాము ఏనాడూ వ్యతిరేకం కాదని, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు భంగం కలిగిస్తే తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధమని అన్నారు. భవిష్యత్తు కార్యాచరణ కోసం త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం జరుపనున్నట్లు తెలిపారు. గవర్నర్‌ను, ముఖ్యమంత్రిని, ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలను ఇస్తాన్నారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ.. అంబేద్కర్, పూలే ఆశయ సాధనలో ఉద్యమాన్ని తీవ్రతం చస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఓసీలలో ఉన్న వివిధ కుల కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని, విధి విధానాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు పాలకవర్గాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. బ్రాహ్మణ సంఘం ప్రతినిధి వెన్నంపల్లి జనన్మోహన శర్మ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓసీ రిజర్వేషన్ల

మిగతా 6వ పేజీలో..

అదనపు కట్నం కోసం పెళ్లికి నిరాకరణ

- నిశ్చితార్థం తరువాత కానిస్టేబుల్ నిర్వాకం
- కేయూ పోలీసులను ఆశ్రయించిన యువతి తండ్రి
- చీటింగ్ కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు

హసన్‌పర్తి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టాలనుకున్న యువతిని మోసగించాడో పోలీసు కానిస్టేబుల్. పెళ్లి చేసుకునేందుకు సిద్ధమై నిశ్చితార్థం చేసుకున్న తర్వాత.. తీరా తనకో ప్రేమికురాలు ఉందని బుకాయించాడు. ఈ హఠాత్ పరిణామంతో కంగుతిన్న యువతి కుటుంబసభ్యులు ఈ నెల 23న కేయూ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో ములుగు జిల్లా కేంద్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కావటి వినయ్‌పై చీటింగ్‌తో పాటు అదనపు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ రవిందర్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే..

హనుమకొండ యాదవనగర్‌కు చెందిన ఓ యువతితో హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన కావటి వినయ్‌కి నిశ్చితార్థం జరిగింది. ములుగు జిల్లా కేంద్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వినయ్.. తన తల్లిదండ్రులు, కుల పెద్ద మనుషులతో కలిసి ఈనెల 17వ తేదీన కట్నకానుకలు మాట్లాడుకున్నారు. రూ.20లక్షల

మిగతా 6వ పేజీలో..

సమన్వయ లోపం.. రోగులకు శాపం

- గాడితప్పిన ఎంజీఎం నిర్వహణ
- ఆర్ఎంల అలకతో సమస్య జటిలం

8

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి..

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ● ప్రజావాణిలో వెల్లువెత్తిన దరఖాస్తులు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజలు అభ్యర్థించే ఫిర్యాదులపై అధికారులు సకాలంలో స్పందించి పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. పజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని, విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి సమస్య పరిష్కరించాలని అధికారులను సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ వారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు ఏకరువు పెట్టారు. కమిషనర్ నేరుగా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తు స్వీకరించిన తర్వాత వెంటనే అక్కడి ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 77 ఫిర్యాదులు స్వీకరించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, డిప్యూటి కమిషనర్ ప్రసన్నరాణి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్‌లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కాగా, బల్దియాలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఓ టీవీ చానల్ జర్నలిస్టు తన బంధువులతో కాలనీలో నెలకొన్ని సమస్యను విన్నవించేందుకు వచ్చాడు. సమస్యపై చాలాసార్లు ఫిర్యాదు చేస్తున్నారని, అధికారులు స్పందించడం లేదని కమిషనర్‌తోపాటు అక్కడి అధికారులను గట్టిగా నిలదీశాడు. దీంతో కమిషనర్ కలుగజేసుకుని సదరు వ్యక్తిని అక్కడి నుంచి బయటకు పంపించాలని సెక్యూరిటీని అప్రమత్తం చేశారు. బల్దియా సెక్యూరిటీ సిబ్బంది వచ్చి సదరు జర్నలిస్టును అక్కడి నుంచి బయటకు గెంటివేశారు. బల్దియా పీఆర్‌వో అయూబ్ కలుగజేసుకుని జర్నలిస్టును బుజ్జగించే ప్రయత్నం చేశారు. కాలనీ సమస్యను దగ్గరుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చాడు.


బల్దియాలో ప్రజావాణి

ఫిర్యాదులు	
ఇంజనీరింగ్	16
హెల్త్, శానిటేషన్	10
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	07
టౌన్‌ప్లానింగ్	42
తాగునీటి సరఫరా	2
హార్టీకల్చర్	02
మొత్తం	**77**

ఫిర్యాదులు ఇవే..

- అవసరం లేని చోట రోడ్డుపోసి అవసరం ఉన్న సీసీ రోడ్డు వేయకుండా అధికారులు, కాంట్రాక్టర్లు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని 13వ డివిజన్ నజరేతుపురం వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తమ కాలనీలో మెయిర్‌రోడ్డు సీసీ వేయడంతో పాటు డ్రైనేజీని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.
- 24 ఏళ్లగా నల్లా బిల్లు చెల్లిస్తున్నామని, నల్లా ఉన్నా కనీసం తాగడానికి నీరు రావడం లేదని వరంగల్ చార్‌బౌళికి చెందిన ప్రజలకు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఈ సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు.
- హనుమకొండ న్యూరాయపురలోని లర్నర్స్‌ల్యాండ్ స్కూల్ పక్కన డ్రైనేజీ కాలువ చిన్నదిగా ఉండడం వల్ల కాలువలో నీరు నిండిన తర్వాత ఇండ్ల ముందుకు వస్తున్నాయని కాలనీవాసులు కమిషనర్‌కు వినతిప్రత్రం అందించారు. వెంటనే అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.
- వర్ధన్నపేట నియోజకవర్గం ఎల్లాపూర్ గ్రామంలోని 65వ డివిజన్‌లోని కాలనీలల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ లేకపోవడం వల్ల ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు రోడ్లపైకి వస్తున్నాయని, చాలా కాలంగా ఉన్న ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ 4వ డివిజన్ జ్యోతిబసు కాలనీలో మూడు మాసాలుగా వీధి లైట్లు వెలగడం లేదని కాలనీవాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మహిళలు, చిన్నపిల్లలు రాత్రి సమయాల్లో బయటకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు.
- గ్రేటర్ 46వ డివిజన్ మడికొండలో ఎస్సీ, బీసీ కాలనీలకు వెళ్లే మార్గంలో ఇటీవల ఒక పాత ఇనుప సామాను కొనుగోలు చేసే షాపు ఏర్పాటు చేశారని, షాపు యజమాని ప్లాస్టిక్, రబ్బర్, ఇనుము కొనుగోలు చేసి నిల్వ చేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. వెంటనే అక్కడి నుంచి షాపును తొలగించాలని కమిషనర్‌ను కోరారు.

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు గ్రామాల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. సోమవారం వివిధ సమస్యలపై 106 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్‌లు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు వచ్చిన దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులను పిలిచి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో ఎక్కువగా జీడబ్ల్యూఎంసీ, హనుమకొండ ఆర్డీవో కార్యాలయాలకు ఎక్కువగా దరఖాస్తువుల వచ్చాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 16, హనుమకొండ ఆర్డీవో కార్యాలయానికి 14, ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాయానికి 10, ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయానికి 7 దరఖాస్తులు వచ్చాయి. మిగతా దరఖాస్తులు ఇతర డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన వచ్చాయి. హనుమకొండలో శిథిలావస్థలో ఉన్న గురుకుల భవనాన్ని ఇతర భవనంలోకి మార్చాలని డీవైఎఫ్ఐ నాయకులు, అంబేద్కర్, జితేందర్‌నగర్‌లలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు వెంటనే మాకు కేటాయించాలని అంబేద్కర్‌నగర్ బస్తీ కమిటీ నాయకులు, హనుమకొండలోని కేఎల్ఎన్ రెడ్డికాలనీలో ఉన్న పోలీస్ అమరుల కుటుంబాలకు చెందిన నివాసస్థలంలో 3దిక్కుల ఉన్న ప్రహరీని జీడబ్ల్యూ అధికారులు కూల్చివేయించారని, దీనికి గాను వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని ఎం.రేణుక జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


హనుమకొండలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నా భూమి నాకు ఇప్పించండి: అనుముల రాధమ్మ

ఎన్నో ఏళ్లు కష్టపడి సంపాదించిన భూమి, ఇల్లు లాక్కొని, నన్ను కొట్టి చంపుతానని బెదిరించి బయటకు నెట్టేసిన తన కుమారుడిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన అనుముల రాధమ్మ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి తన గోడు వెల్లబోసుకున్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు

గ్రీవెన్స్‌లో వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణిలో మొత్తం 109 వినతులు అందగా, ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 50, డీఆర్‌డీవో 5, డీబ్ల్యూఎంసీ 4, సర్వే ల్యాండ్ 1, లీడ్ బ్యాంక్ మేనేజర్ 1, ఉపాధి అధికారి 3, పౌరసరఫరాల శాఖ 3, పోలీసు శాఖ 4, జిల్లా సంక్షేమ శాఖ 7, వ్యవసాయశాఖ 5, విద్యాశాఖ 3, పంచాయతీ శాఖ 2, ఇరిగేషన్ 2, డీఎంహెచ్‌వో 1, జీఎం ఇండస్ట్రీస్ 1, ఎన్‌పీడీసీఎల్ 3, వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ 1, లేబర్ ఆఫీసర్ 1, ఎస్సీ కార్పొరేషన్ 1, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు సంబంధించి 7 వినతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేయూ సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29 నుంచి నవంబరు 3 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల కేయూ జట్టును సోమవారం ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన వారిలో ఈ.రాజశేఖర్, ఎస్.సాంబరాజు, (వ్యాయామ విద్యా కళాశాల, కేయూ క్యాంపస్), బి.విక్రమ్, జే.దేవేందర్, (కేడీసీ, హనుమకొండ), బి.సుమన్, ఎం.అఖిల్, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), బి.ప్రవీణ్, బి.సాయితేజ, ఎస్.అభిరాం,(వాగ్దేవి వ్యాయామ కళాశాల, బొల్లికుంట), ఎ.రంజిత్‌కుమార్ (వ్యాయామ విద్యా కళాశాల, ఖమ్మం), టి.నాగరాజు (వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, హనుమకొండ)లు ఎంపికైనట్లు వెల్లడించారు. జట్టుకు హనుమకొండ వాగ్దేవి డిగ్రీ, పీజీకళాశాల నుంచి కోచ్‌గా డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పి.కృష్ణ మేనేజర్‌గా వ్యవరిస్తారని పేర్కొన్నారు.

అధ్యాపక సమస్యల పరిష్కారమే లక్ష్యం : కొలిపాక

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పాతన పెన్షన్ సాధనే తన ధ్యేయమని, ఉపాధ్యాయ అధ్యాపక సమస్యల పరిష్కారం లక్ష్యంగా, యూనియన్లకు అతీతంగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉంటానని సీపీఎస్ అధ్యాపకుడు ప్రొఫెసర్ డాక్టర్ కొలిపాక వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు టీచర్స్ ఎమ్మెల్సీలో తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని, అలాగే ఓపీఎస్ ఉపాధ్యాయుల ఆశీర్వాదంతో సీపీఎస్ అధ్యాపకులను ఎమ్మెల్సీగా గెలిపించుకుని పాత పెన్షన్‌తో పాటు అన్ని సమస్యలు తీరే విధంగా కృషి చేసేందుకు అవకాశం కల్పించాలని వెంకటస్వామి ఈ ప్రకటనలో కోరారు.

బెటాలియన్‌లో ఆగని పోలీసుల ఆందోళనలు

శంభునిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏకీకృత పోలీసు విధానం అమలు చేయాలంటూ టీజీఎస్పీ సిబ్బంది చేస్తున్న పోరాటం ఆగలేదు. ఆందోళనలపై ఉన్నతాధికారులు ఆగ్రహించి రాష్ట్ర వ్యాప్తంగా 39 మందిని సస్పెండ్ చేసినప్పటికీ సిబ్బంది యూనిఫామ్‌తో నిరసనల్లో పాల్గొనటంతో ప్రభుత్వం క్రమశిక్షణ చర్యల కింద 10 మందిని సర్వీస్ రిమూవ్ చేస్తూ డిస్మిసల్ ఉత్తర్వులను ఇచ్చింది. ఫోర్త్ బెటాలియన్‌లో ఆరుగురిని సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు ఎవ్వరినీ డిస్మిసల్ చేయలేదు. కాగా సోమవారం విధులు ముగిసిన తరువాత నల్లబ్యాడ్జీలు ధరించి కమాండెంట్ రామ్‌ప్రకాశ్‌కు తమ బాధలు వెల్లబోసుకుంటూ వినతి పత్రం అందించారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీజీఎస్పీ బెటాలియన్‌లలోని సిబ్బంది సమస్యలను పరిష్కరించటానికి పోలీసు శాఖ సిద్ధంగా ఉందని తెలపటంతో సోమవారం ఫోర్త్ బెటాలియన్ నుంచి పలువురు సిబ్బంది హైదరాబాద్‌లో డీజీపీ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం.

పోలీసుల భారీ భద్రత

రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది టీజీఎస్పీ సిబ్బందిని ఆదివారం రాత్రి పోలీసు ఉన్నతాధికారులు డిస్మిస్ చేశారు. ఈ సంఘటనపై టీజీఎస్పీ సిబ్బంది భగ్గుమన్నారు. ఈ నేపథ్యంలో టీజీఎస్పీ సిబ్బంది రోడ్ల పై ఎలాంటి ఆందోళనలు చేయకుండా వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు రంగశాయిపేట జంక్షన్, ఆర్టీఏ జంక్షన్, బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. ప్రజా, ఉద్యోగ సంఘాలు, ఉద్యమకారులు, విద్యార్థులు, రాజకీయ పార్టీలు చేపట్టే ఆందోళనలకు నిలువరించే పోలీసులే పోలీసు శాఖలోని ఓ విభాగమైన టీజీఎస్పీ ఆందోళనలను అణచివేయటానికి పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించటం స్థానికంగా చర్చనీయంశం అయింది.

రూ.30లక్షల బీమా సొమ్ము అందజేత

హనుమకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు కుటుంబానికి సీపీ చేతుల మీదుగా రూ.30లక్షల ప్రమాద బీమా చెక్కును అందచేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ హోంగార్డు విభాగానికి చెందిన వి.సుధాకర్ మామునూరు నాలుగో బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తుండగా, గత ఆగస్టు 13వ తేదీన మామునూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. సుధాకర్ యాక్సిస్ బ్యాంక్ ఖాతాదారుడు కావడంతో యాజమాన్యం ఆయన కుటుంబానికి రూ.30లక్షల ప్రమాద బీమా చెక్కును ఆయన సతీమణి కోమలకు సీపీ చేతుల మీదుగా అందచేసింది. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ చంద్రశేఖర్, యాక్సిస్ బ్యాంక్ వరంగల్ ఏరియా బాధ్యుడు కృష్ణ హోసూర్, బ్యాంక్ సిబ్బంది వంశీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాద బీమా చెక్కును అందచేస్తున్న సీపీ

'జవాన్ల జులుం'పై బల్దియా కమిషనర్ ఆరా..

పూర్తి వివరాలు కావాలని అధికారులకు ఆదేశాలు ● జవాన్లతో సమావేశం ఏర్పాటు చేసిన సీఎంహెచ్‌వో ● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగంలో పీహెచ్ వర్కర్లుగా పనిచేయాల్సిన సి బ్బంది జవాన్లుగా పని చేయడం ఏమిటని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రోడ్డు, డ్రైనేజీలు శుభ్రం చేయవలసిన ఔట్‌సోర్సింగ్ కార్మికులు వైట్ కాలర్ జవాన్లుగా పనిచేయడం, శానిటేషన్ పనులు చేయకుండా అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడంతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'జవాన్ల జులుం' అనే వార్త ప్రచురితమైంది. ఈ వార్త బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై సోమవారం ప్రజావాణి కార్యక్రమానికంటే ముందుగా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శానిటేషన్ ఉన్నతాధికారులను వివరణ కోరినట్టు తెలిసింది. వైట్‌కాలర్ జవాన్ల పూర్తి వివరాలు కావాలని సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డిని కోరినట్టు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా శానిటేషన్ విభాగంలో పనిచేస్తు న్న ప్రభుత్వ, ఒరిజినల్, వైట్‌కాలర్ జవాన్ల పూర్తి జాబితా, వారు ఎక్కడెక్కడ పని చేస్తున్నారు? ప్రస్తుతం ఏ పరిధి, ఏ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వద్ద పని చేస్తున్నారు? అని వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని కోరినట్టు సమాచారం.

ప్రత్యేక సమావేశం

కమిషనర్ ఆదేశాలతో చీఫ్ మెడికల్ ఆఫీసర్ బొమ్మన రాజారెడ్డి జవాన్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సిబ్బంది తీరుపై వివరాలు సేక రిస్తూ హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి భీమారం వరకు ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి కాలినడక వెళుతూ వైట్‌కాలర్ జవాన్ల వివరాలు సేకరించినట్టు తెలిసింది. భీమారంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ సమీపంలో 1,2,55,56,65,66 డివిజన్‌లలో పనిచేస్తు న్న వైట్‌కాలర్, పర్మినెంట్ జవాన్లతో సమావేశం ఏ ర్పాటు చేశారు. ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలా వుండగా, 'ఆంధ్రజ్యోతి' కథనంపై వరంగల్ పోలీసు నిఘా విభాగాలైన ఇంటెలిజెన్స్, ఎస్‌బీ శాఖలు ఆరాతీసినట్లు సమాచారం.

టీడీపీ పార్లమెంట్ అడహక్ కమిటీ కన్వీనర్ కన్వీనర్‌గా విద్యాసాగర్‌రావు



వరంగల్ చౌరస్తా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అడహక్ కమిటీ కన్వీనర్‌గా అర్షనపల్లి విద్యాసాగర్‌ను నియమించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగించినట్లు బక్కని నర్సింహులు ప్రకటన జారీ చేశారు.

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

హనుమకొండ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేయడంతో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాలో పనిచేస్తున్న వారిని ఇక్కడికి, ఇక్కడ పనిచేస్తున్న వారిని బయటి జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు వెయింటింగ్‌లో ఉన్న వారికి పోస్టింగ్స్ ఇచ్చారు.

అధికారి	ప్రస్తుతం విధుల స్థానం	బదిలీ అయిన స్థానం
సి.మహేందర్ జీ	అడిషినల్ కలెక్టర్ (రెవెన్యూ), ములుగు	అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), మహబూబాబాద్
ఎం.డేవిడ్	అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), మహబూబాబాద్	అడిషనల్ కలెక్టరు (రెవెన్యూ), ములుగు
ఎం.విజయలక్ష్మీ	వరంగల్ మహానగరపాలక సంస్థ, కార్యదర్శి	డీఆర్‌వో, వరంగల్
డి.వెంకటమాధవరావు	ఆర్‌డీవో, షాద్‌నగర్	డీఆర్‌వో, మహబూబాబాద్
కె.శ్రీనివాస్	డీఆర్‌వో, వరంగల్	ఎస్‌డీసీ, యూఎల్‌సీ, రంగారెడ్డి
రాథోడ్ రమేశ్	వెయిటింగ్	ఆర్‌డీవో, హనుమకొండ
ఎస్.వెంకటేశ్	ఆర్‌డీవో, హనుమకొండ	ఆర్‌డీవో ములుగు
పి.ఉమారెడ్డి	తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్	ఆర్‌డీవో, నర్సంపేట
కె.సత్యపాల్‌రెడ్డి	ఆర్‌డీవో, ములుగు	ఆర్‌డీవో, వరంగల్
కె.గోపీరామ్	ఎస్‌డీసీ, యూడీసీ రంగారెడ్డి	ఆర్‌డీవో, జనగామ
జి.నరసింహారావు	ఆర్‌డీవో తొర్రూరు	ఆర్‌డీవో, ఖమ్మం
ఎస్.రాజు	ఆర్‌డీవో, జహీరాబాద్	ఆర్‌డీవో, మహబూబాబాద్
ఎన్.రవి	ఆర్‌డీవో, నల్లగొండ	పి.ఎ. స్పెషల్ కలెక్టరు, (ఎల్‌ఏ) వరంగల్, హనుమకొండ
కె.శంకర్‌కుమార్	పీఏ టూ స్పెషల్ కలెక్టరు, హనుమకొండ	ఎస్‌డీసీ ఎల్‌ఏ, మేడ్చల్
డి.కొంరయ్య	ఆర్‌డీవో జనగామ	డిప్యూటేషన్ సివిల్ సప్లయి, హనుమకొండ
కె.క్రిష్ణవేణి	ఆర్‌డీవో, నర్సంపేట	ఎస్‌డీసీ, ఎల్‌ఏవో 'కుడా'
సీహెచ్ వెంకటేశ్వర్లు	ఎస్‌డీసీ, ఎల్ఏ వనపర్తి	ఎస్‌డీసీ, ఎల్ఏ భూపాలపల్లి
ఎల్.అలివేలు	ఆర్‌డీవో, మహబూబాబాద్	జీడబ్ల్యూఎంపీ సెక్రటరీ, డిప్యూటేషన్



ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

(5వ పేజీ తరువాయి)

విషయంలో, అలాగే మరోసారి రిజర్వేషన్ల అమలు తీరుపై అధ్యయనం చేయడానికి ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రెడ్డి కుల సంఘం ప్రతినిధులు రాదారపు సంజీవ రెడ్డి, ముదిగంటి వెంకట్ రెడ్డి, కట్కూరి హనుమంత రెడ్డి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఏవీ సత్యమోహన్, జీవీఎస్ శ్రీనివాసాచార్యులు, ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు వంగేటి అశోక్, దుబ్బ శ్రీనివాస్, చకిలం రాజేశ్వర్‌రావు, శ్రీనివాసశర్మ, అర్షుల కిషన్‌రెడ్డి, రావుల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఓబీసీ సంఘాల నాయకులు సమావేశం అయ్యారు. ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు జరుగుతున్న కుట్రను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ఉద్యమంపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. తమ హక్కుల పరిరక్షణకు ఓబీసీ సంఘాలు సంఘటితంగా పోరాడాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. త్వరలో అన్ని ఓబీసీ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని కోరుతూ మరో తీర్మానం చేసింది.,

అదనపు కట్నం కోసం పెళ్లికి నిరాకరణ

(5వ పేజీ తరువాయి)

నగదు, బంగారం కావాలని అడగడంతో ఒప్పుకున్న యువతి కుటుంబసభ్యులు రూ.లక్ష కట్నంగా ఇచ్చారు. నిశ్చితార్థం తర్వాత తనకు కట్నం సరిపోలేదని, వేరే అమ్మాయితో ప్రేమలో ఉన్నానని చెప్పి పెళ్లి కుమారుడు వినయ్ వివాహానికి నిరాకరించాడు. పెద్ద మనిషితో ఈ నెల 23న సమాచారం పంపడంతో కంగుతిన్న యువతి కుటుంబసభ్యులు లబోదిబోమని గుండెలు బాదుకున్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి కట్నం కూడా తీసుకొని నిశ్చితార్థం తరువాత వివాహానికి నిరాకరించి పరువు పోయేలా చేసిన కానిస్టేబుల్ వినయ్‌తోపాటు వారి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యువతి తండ్రి లింగంపల్లి కుమార్ ఈ నెల 23న కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత యువతి, తండ్రి ఫిర్యాదు మేరకు కేయూ పోలీసులు ములుగు కానిస్టేబుల్ వినయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శంకర్, సారంగపాణి విగ్రహాలను ఏర్పాటు చేయాలి

తెలంగాణ క్రాంతిదళ్ రాష్ట్ర ప్రతినిధి పృథ్వీరాజ్ యాదవ్

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జానపద గాయకులు శంకర్, సారంగపాణి విగ్రహాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని తెలంగాణ క్రాంతిదళ్ రాష్ట్ర ప్రతినిధి సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ - 25 వసంతాల సందర్భంగా ఓరుగల్లు జానపద స్వరాల జల్లు దివంగత వరంగల్ శంకరన్న, దీకొండ సారంగపాణి యాదిలో కీర్తి పురస్కారం - 2024 కార్యక్రమం ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయేదాక జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. జానపద పాటలతో ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దివంగత శంకరన్న, సారంగపాణిల ఆశయాలను కళాకారులు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు దాటినా ఇంకా సినిమా రంగంలో ఆంధ్ర హీరోలే పెత్తనం చెలాయిస్తున్నారని పేర్కొన్నారు. బలగం వంటి సినిమాలు తీసే దమ్ము తెలంగాణ కళాకారులకు ఉందని, తెలంగాణ హీరోలు రావాలన్నారు. తెలంగాణలో ఉన్న నటులను ప్రోత్సహించేందుకు రూ.50కోట్లు కేటాయిస్తే మన కళాకారులతో సినిమాలు తీయవచ్చని పృథ్వీరాజ్ యాదవ్ అభిప్రాయపడ్డారు.

గేయ రచయిత కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ.. శంకరన్న, సారంగపాణిల శిష్యుడిగా వారితో కలిసి ఎన్నో కార్యక్రమాలు చేశానని చెప్పారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలలో వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా ఎన్నో కచేరీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సినిమా రంగంలో రైటర్‌గా నిలదొక్కుకోవడానికి తన గురువులు శంకర్, సారంగపాణిలే కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు బి.శ్యామ్, వాసుదేవరెడ్డి, ప్రణయ్, అంతడుపుల నాగరాజు, వరంగల్ శ్రీనివాస్, భూక్యా సుశీల, జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ నిర్వాహకులు జడల శివ, హరిత, కళాకారులు సీతాల రఘువేందర్, ముదిగొండ నాగేశ్వర్‌రావు, కళా రాజేశ్వర్‌రావు, ఆడెపు రవీందర్, ఆలేటి శ్యామ్, సీత మహలక్ష్మి, టీవీ అశోక్‌కుమార్, ఓడపల్లి చక్రపాణి, గడ్డం సుధాకర్, రావెళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఆట పాట జాతరలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్ యాదవ్, కళాకారులు

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠ	క్వింటా కనిష్ఠ
మక్కలు (బిల్టీ రకం)	2521	2080
పల్లికాయ (సూక)	5959	5000
పల్లికాయ (పచ్చిది)	4450	4000
కందులు	8212	6900
పెసళ్లు	6252	4052
పత్తి	6800	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	10649	10234
పసుపు (గోల)	10859	10256
తేజ మిర్చి	12500	9000
తేజ ఏసీ	17000	12000
వండర్‌హాట్ ఏసీ	14000	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

\- వరంగల్ వ్యవసాయం

ప్రజావాణిలో 'చరవాణి'

క్లిక్.. క్లిక్..

సమస్యలు వదిలేసి సెల్‌ఫోన్లలో నిమగ్నమైన అధికారులు



కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఓవైపు కలెక్టర్ సత్యశారద ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో అధికారులు మాత్రం తమ సెల్‌ఫోన్‌లో నిమగ్నమయ్యారు. ప్రజా సమస్యలను విన్నవించుకుందనేందకు ఏర్పాటు చేసిన ప్రజావాణిలో అధికారులు సమస్యలు పట్టించుకోకపోగా, తమ సొంత పనుల్లో తలమునకలవడం విస్మయం కలిగించింది. అధికారుల అలసత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్


ఆరోగ్యకేంద్రాల్లో వసతులు కల్పించాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు28(ఆంధజ్యోతి): ఆరోగ్య కేంద్రాలలో జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సేవలందించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాలో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల గుర్తింపు లభించాయన్నారు. ఆరోగ్య కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 3 బస్తీ దవాఖానలలో, 10 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు, కమలాపూర్ సీహెచ్‌సీలను ఈ సర్టిఫికేషన్ కోసం అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్, భవనాల మరమ్మతు పనులు, టాయిలెట్స్ తదితర వసతుల కల్పనపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితా దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్‌కుమార్, టీఎస్ఎంఐడీసీ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నకిలీ డీఎస్పీపై కేసు



నిందితుడు పూర్ణచందర్

మడికొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీని అని చెప్పుకుంటూ సెటిల్మెంట్లకు పాల్పడుతున్న బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై మడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన భూపతి హరీష్.. తన బంధువులైన భూపతి సురేష్, రమేష్, శ్రీనివాస్‌లకు కొంతకాలంగా నెలకొన్న భూ వివాదం దృష్ట్యా మడికొండ పోలీసులను ఆశ్రయించగా సివిల్ తగాదాగా చెప్పి కోర్టుకు వెళ్లాలని సూచించారు. ఈక్రమంలో భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కొక్కుల పూర్ణచందర్ తనకు తానుగా డీఎస్పీ అని చెప్పుకొని పోలీసు యూనిఫామ్‌లో వచ్చి ఈనెల 22న భూపతి హరీష్‌ను భూసెటిల్మెంట్ చేసుకోవాలని బెదిరించాడు. ఈవిషయమై భూపతి హరీష్ మడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

రేపు నరకాసుర వధ

- వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం
- ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి



సమావేశంలో మాట్లాడుతున్న మరుపల్ల రవి

కరీమాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉర్సు గుట్ట 'కుడా' మైదానంలో యేటా నిర్వహించే నరకాసుర వధ వేడుకలను ఈసారి కూడా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి తెలిపారు. సోమవారం ఉర్సు బీరన్న దేవాలయంలో ఆయన మాట్లడుతూ.. ఎప్పటిలాగే ఈ యేడు కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు ఉర్సు ప్రతాప్‌నగర్ నుంచి శ్రీకృష్ణ సత్యభామ వేషధారణలో స్థానిక కళాకారుల భజనలతో ఊరేగింపుగా రథం బయలేదేరడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, పలు సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం రాత్రి 8 గంటలకు 58 అడుగుల భారీ నరకాసుర ప్రతిమను అత్యంత శక్తివంతమైన బాణసంచాతో దహనం చేస్తామని అన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, శాసన మండలి డిప్యూటీ వైస్‌చైర్మన్ బండా ప్రకాష్, శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, ఎంపీ కడియం కావ్య కలెక్టర్ సత్యశారద, గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, సీపీ అంబర్‌కిషోర్ ఝా తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఈ ఉత్సవాలకు సుమారుగా రూ.8లక్షలు అవుతాయని, దాతల ద్వారా కేవలం రూ.3లక్షలు సమకూరాయని అన్నారు. ఈ విషయాన్ని మంత్రి సురేఖకు వివరించగా తనవంతుగా ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు మాట్లాడుడూ.. తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కడాలేని విధంగా వరంగల్‌లో నరకాసుర వధ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, కోశాధికారి కనుకుంట్ల రవి, సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్స్ దూడ కొమురెల్లి, గౌడ రాము, కార్యవర్గ సభ్యులు అన్న కుమారస్వామి, మరుపల్ల శివ, తౌటం నర్సింహ, కొమ్ము రాజు, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులే సమాజానికి సంపద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు సమాజానికి అమూల్యమైన సంపద అని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వయోవృద్ధుల సంక్షేమచట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వయోవృద్ధుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అమలుకు అధికారులు పకడ్బందీగా కృషి చేయాలని సూచించారు. 2007లో ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణకు చట్టాన్ని అమలులోకి తెచ్చిందని తెలిపారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యత పిల్లలపై ఉందని, ఏదైనా సమస్యలు వస్తే టోల్‌ఫ్రీ నెంబరు 14567ను సంప్రదించాలని సూచించారు. కేసులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియంత్రణ చర్యలు చేపట్టాలి

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నార్కోటిక్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి నియంత్రణపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు మందుకు అలవాటు పడితే జరిగే నష్టాల గురించి డాక్యుమెంటరీ ద్వారా పాఠశాలల పిల్లలకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ముఖ్య కూడళ్లు, రైల్వే, బస్టాండ్ ప్రాంతాలతో పాటు ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీల వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్, నార్కోటిక్ డీఎస్పీ సైదులు, నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, వర్ధన్నపేట ఏసీపీ ఎ.నర్సయ్య, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఎక్సైజ్ శాఖ అధికారి మురళీధర్, డీఎంహెచ్‌వో వెంకటరమణ పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అరికట్టి ప్రభుత్వ ఆదాయం పెంచేలా చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన ఇసుక సమస్యపై తహసీల్దార్లు, మైనింగ్, ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

'వాగ్దేవి'లో ప్రాంగణ నియామకాలు

శంభునిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బొల్లికుంట వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో సోమవారం ఇంటర్న్‌షిప్, ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాల ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ (ఐఐఐసీ) ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బెంగళూరుకు చెందిన ఐటీ కంపెనీ గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్‌లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కోసం పలువురు విద్యార్థులతో లిఖిత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందరద్భంగా గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికైన విద్యార్థులకు బెంగళూ రులో 90 రోజుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం అంది స్తామన్నారు. అనంతరం వంద శాతం ఉద్యోగా లు కల్పిస్తామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్.. గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్‌తోపాటు సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఐఐసీ డీన్ డాక్టర్ చింతకింది రాజు, స్టూడెంట్ కోఆర్డినేటర్ యశ్వంత్‌తో పాటు 550 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హనుమ కొండ డిపో మేనేజర్ భూక్య ధరంసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు డిపో అభివృద్ధి బస్సు సర్వీసులపై అభిప్రాయాలను ఫోన్ నెంబర్‌లో 99592 26049 తెలపాలని ప్రకటనలో కోరారు.

డివైడర్ల ఏర్పాటు

శంభునిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జాతీయ రహదారిపై డివైడర్‌లను ఏర్పాటు చేశారు. రంగశాయిపేట జంక్షన్ నుంచి మామునూరు విమానాశ్రయానికి వరకు గల గణపతిదేవ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా డివైడర్‌లు లేని ఆర్టీఏ జంక్షన్ నుంచి తిమ్మాపూర్ క్రాస్ రోడ్ వరకు ప్రమాదాల్లో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. విషయాన్ని గ్రహించిన స్థానిక ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు పరిస్థితిని గ్రేటర్ వరంగల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాఖడే, మామునూరు ఏసీపీ తిరుపతి ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. సోమవారం ఆర్టీఏ జంక్షన్ నుంచి తిమ్మాపూర్ క్రాస్ వరకు బల్దియా సిబ్బంది పనులు ప్రారంభించారు.

ఆందోళనకారులపై చర్యలు తీసుకోండి

పోలీసులకు ఏకశిల ఆస్పత్రి యాజమాన్యం ఫిర్యాదు

హనుమకొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విషమపరిస్థితిలో ఉన్న వ్యక్తిని ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యం అందించినప్పటికీ అతడు మృతిచెందితే.. ఆస్పత్రి నిర్వాహకులే కారణమంటూ కరీమాబాద్‌కు చెందిన మృతుడు టి.అశోక్ కుటుంబసభ్యులు ఏకశిల ఆస్పత్రిపై దాడి చేశారని ఆస్పత్రి యాజమాన్యం సోమవారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. 27 రోజుల కిందట శ్వాస, బీపీ సమస్యలతో కరీమాబాద్‌కు చెందిన టి.అశోక్ ఏకశిల ఆస్పత్రిలో చేరాడు. సోమవారం పరిస్థితి విషమించడంతో మరణించాడు. దీంతో కోపోద్రిక్తులైన అశోక్ కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. కాగా, ఈ విషయంపై హనుమకొండ సీఐ సతీష్‌ను వివరణ కోరగా.. ఆస్పత్రి యాజమాన్యం మృతుడి సంబంధీకులపై ఫిర్యాదు చేశారని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

24 మందికి జరిమానా

మట్టెవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 24 మందికి జరిమానా పడింది. సోమవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి ఈ జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో మొత్తం రూ. 36000 జరిమాన విధించగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ.5000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఆలయాలకు ఈవోలను తొలగించాలి

కాశిబుగ్గ, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని ప్రసిద్ధి చెందిన కాశీవిశ్వేశ్వర, శ్రీ రంగనాథస్వామి దేవాలయాలకు కేటాయించిన కార్యనిర్వాహణాధికారిని తొలగించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. కాశిబుగ్గలోని ఈ ఆలయాలను ఇటీవల దేవాదాయశాఖ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ సంజీవ్ రెడ్డికి సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత సముద్రాల పరమేశ్వర్ మాట్లాడుతూ.. దేవాలయాలపై పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నేతలు ఎరుకల రఘునారెడ్డి, ఆనంద్, నాగరాజు, హరిశంకర్, సతీష్, శ్రీనివాస్, ప్రకాష్, రజనీష్, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం ప్రకారం దేవాదాయ శాఖను లిఖితపూర్వకంగా వివరాల కోసం దరఖాస్తు చేశారు. ఏ నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నారో సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

'అణచివేత నుంచే స్త్రీల కథలు'

వడ్డెపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రాచీన కాలం నుంచి నేటి వరకు స్త్రీలు వివక్షకు గురవుతున్నారని, అణచివేత నుంచే స్త్రీల కథలు వచ్చాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగులో స్త్రీల కథా సాహిత్య ధోరణులు అనే అంశంపై తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాతీయ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య కాత్యాయని విద్మహే మాట్లాడుతూ.. బండారు అచ్చ మాంబ మొదలు నేటి వరకు ఎంతో మంది స్త్రీలు పర్యావరణం, రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యల నుంచి బయటపడి కథలు రాయా లని అన్నారు. ఈ సదస్సులో ఆచార్య బన్న ఐలయ్య, సమన్వయ కర్త మధు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు హెప్సిబా, లక్ష్మీకాంతం, రామా రత్నమాల, సునిత, మమత, రాజేశ్వరి, సురేష్‌బాబు, ఎం.అరుణ, శ్రీనివాస్, బాలరాజు, సారంగపాణి, శ్రీలత, ఉదయశ్రీ, ప్రశాంతి మాట్లాడారు.

క్రీడాకారుల నిలయం ఓరుగల్లు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ఖిల్లా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు నిలయం అని, వారి స్ఫూర్తితోనే నేటి వర్ధమాన క్రీడాకారులు రాణించాలని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-19 ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలను అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడమే కాకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా స్నేహ పూర్వక సంబంధాలు మెరుగుపడతాయన్నారు. హనుమకొండ డీవైఎస్‌వో, అండర్-19 క్రీడా పోటీల కార్యదర్శి, అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-19 జూనియర్ కళాశాలల స్థాయి బాలబాలికల విభాగంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రెండు రోజుల క్రీడా పోటీల నిర్వహణలో భాగంగా తొలి రోజు హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, ఉషు, టెన్నికాయిట్, సాఫ్ట్‌టెన్నిస్, సెపక్‌తక్రా క్రీడాంశాలలో ఎంపిక పోటీలను నిర్వహించామన్నారు. అదే విధంగా 29వ తేదీన రోజున సైక్లింగ్, పవర్‌లిఫ్టింగ్, షూటింగ్, స్కేటింగ్, బేస్‌బాల్, రగ్బీ, యోగా, స్క్వాష్ క్రీడాంశాలలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, పీడీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటరెడ్డి, వాసు, అశోక్, డీఎస్ఏ కోచ్‌లు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు ● అడ్డుకున్న పోలీసులు



కాళోజీ కళాక్షేత్రం ఎదుట విద్యార్థుల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

బాలసముద్రం, అక్టోబరు 28 ఆంధ్రజ్యోతి): కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ బహుజనుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని మూడు నెలలనుంచి ప్రభుత్వాని కోరినా పట్టించుకోవడంలేదని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఏస్ఐఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ అన్నారు. సోమవారం హనుమకొండ అశోక జంక్షన్ నుంచి బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం వరకు బహుజనుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సుమారు ఐదు వందల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాక్షేత్రం ముందుకు ర్యాలీ రావడంతో సుబేదారి పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. కాళోజీ కళాక్షేత్రం ఎదుట పోలీసులకు విద్యార్థి సంఘాల నాయకుల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో కళాక్షేత్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ గొప్పతనాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పి, పద్మశ్రీ అవార్డు సాధించిన బహుజన కళాకారులు గద్దర్, చుక్క సత్తయ్య, మిద్దె రాములు, చిందు ఎల్లమ్మ, సాయిచందు, బెల్లి లలిత, నేరెళ్ల వేణుమాధవ్, వరంగల్ శంకరన్న, సారంగపాణి, గుస్సాడి కనకరాజుల విగ్రహాలు ఏర్పాటు కోసం మూడు నెలల నుంచి ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు దూడపాక నరేష్, ఠాగూర్, మణితేజ, కుమార్, కలాం, నదీంపాషా, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలనలో వేగం పెంచండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం టీపీఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో పని చేస్తున్న వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిష్పక్షపాతంగా వ్యవహరించి దరఖాస్తుల పరిశీలన చేయాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో 12 బృందాలు పర్యటిస్తున్నప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దరకాస్తుల పరిశీలన వేగవంతం చేయాలన్నారు. 80 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయని, ఒక్కో అధికారి 1400 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉందన్నారు. వార్డుల వారీగా విభజన చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో రాజేశ్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పూర్తి కావాలి

అధికారులను ఆదేశించిన ప్రజా ప్రతినిధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవస్థానం మాడ వీధుల నిర్మాణంతో పాటు రాజగోపురం పనులు నత్తనడకన సాగుతుండడంతో సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన కథనానికి ప్రజాప్రతినిధులు స్పందించారు. సోమవారం కుడా కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాఢ వీదుల నిర్మాణంపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

సంక్షిప్త వార్తలు

ఉత్సవ కమిటీల మధ్య వార్

కరీమాబాద్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): కరీమాబాద్‌లోని రెండు ఉత్సవ కమిటీల మధ్య వార్ నడుస్తోంది. తాము వేసిన పెయింటింగ్స్‌ను తొలగించారని నరకాసుర వధ ఉత్సవ కమిటీపై దసరా ఉత్సవ కమిటీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. గత నెలలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉర్సుగుట్ట ప్రాంగణంలోని భారీ వేదికపై దసరా కమిటీ ఆధ్వర్యంలో నగర ప్రజలకు విజయ దశమి, సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ పెయింటింగ్స్ వేశారు. అయితే దీపావళి పర్వదినం సందర్భంగా అదే ప్రాంగణంలో నిర్వహించే నరకాసుర వధ కోసం నరకాసుర కమిటీ వారు వాటిని చెరిపేశారు. దీంతో దసరా ఉత్సవ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం సాయంతం ఉర్సు గుట్ట ప్రాంగణంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సంజయ్ బాబు మాట్లాడుతూ.. దసరా కమిటీని అవమానపరుస్తూ నరకాసురవధ ఉత్సవ కమిటీ సభ్యులు ఉర్సుగుట్ట ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్స్‌ను తొలగించడం సిగ్గుచేటని అన్నారు. దసరా ఉత్సవ కమిటీని అవమానపరిస్తే సహించేందిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

హైకోర్టుకు ఆలయ భూ వివాదం

కాశిబుగ్గ, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి చెందని భూ వివాదం హైకోర్టుకు చేరింది. జిల్లాలోని కోర్టుల్లో కేసు దాదాపు 14 ఏళ్ల పాటు కొనసాగింది. ఇక్కడి న్యాయస్థానం తీర్పుపై శ్రీనివాస్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. 28గుంటల భూమి దేవాలయానికి చెందినదని ఆలయ కమిటీ తాజా మాజీ అధ్యక్షుడు వంగరి రవి న్యాయ పోరాటం చేశాడు. భూమి ఆలయానికి చెందినదని వచ్చిన తీర్పుపై శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించగా తనకు నోటీసులు వచ్చాయని వంగరి రవి తెలిపారు. ఆలయ భూమి కోసం తనవంతుగా న్యాయపోరాటం చేస్తానని రవి పేర్కొన్నారు.

పత్తి ధర తగ్గిందని రైతుల ఆందోళన

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): పత్తి ధర తగ్గిందని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో రైతులు సోమవారం ఆందోళన నిర్వహించారు. రెండు రోజుల కిందట పత్తి క్వింటాకు ఏడువేలకు పైగా ఉండగా, ప్రస్తుతం రూ.6800లకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల పత్తి యార్డుకు వెళ్లి రైతులతో మాట్లాడారు. సీసీఐ అధికారులను పత్తి యార్డుకు రప్పించి వారితో సీసీఐ కొనుగోళ్లు, నిబంధనల గురించి రైతులకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్లో పత్తి గింజలు, బెయిల్స్‌కు ధర తగ్గడంతో దాని ప్రభావం ఇక్కడ పడిందని అన్నారు. అయితే పత్తిని మద్దతు ధరకు అమ్మాలనుకుంటే గన్నీబ్యాగుల్లో కాకుండా వాహనాల్లో లూజు పత్తిని తీసుకువచ్చినట్లయితే సీసీఐ కొనుగోలు చేస్తుందని వివరించడంతో వారు శాంతించారు. దీంతో పత్తి కొనుగోళ్లు యథావిధిగా సాగాయి.

ఆర్డీవోగా సత్యపాల్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఆర్డీవోగా సత్యపాల్ రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆయన కలెక్టర్ సత్యశారదను కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పోలీసులు బాధ్యతగా పనిచేయాలి

హసన్‌పర్తి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది యూనిఫాం టర్న్ అవుట్, కిట్ ఆర్టికల్స్‌లను తనిఖీ చేసి వారితో కవాతు చేయించారు. అనంతరం స్టేషన్ గదులను, అన్ని రకాల రికార్డులను పరిశీలించి పోలీసుల పనితీరును, వారి డ్యూటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందిలో కొంత మందికి నగదు పారితోషికాన్ని రివార్డు రూపంలో అందించి అభినందించారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా నిధులు విడుదల చేసి, రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి శంకరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం, యాసంగికి రైతు భరోసా నిధులు విడుదల చేయాలన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతాంగానికి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో రైతు భరోసా, రుణమాఫీ అమలు కాకపోవడంతో రైతు ఆత్మహత్యలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిలు, పద్మ, శోభ, అరుణ, హసీనా, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల మహాధర్నా

హనుమకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ జీవిత బీమా సంస్థ ఏజెంట్లు సోమవారం హనుమకొండ ఎల్ఐసీ బ్రాంచ్ ఎదుట మహాధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా లియాఫీ యూనియన్ నాయకులు హాజరై మాట్లాడుతూ.. ఎల్ఐసీ పాలసీదారులకు బోనస్ పెంచాలని, ఏజెంట్లకు గ్రాట్యుటీని పెంచాలని కోరారు. పాలసీలపై జీఎస్టీని రద్దుచేయాలని, ఏజెంట్లకు టర్మ్ ఇన్సూరెన్స్‌ను 69 నుంచి 75 ఏళ్లకు పెంచాలని, ఏజెంట్లందరికీ హెల్త్‌కార్డు పరిమితి పెంచాలని కోరారు. సమస్యలను సత్వరమే పరిష్కరించకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుసుమ సత్యనారాయణ, వాసిరెడ్డి అప్పారావు, రాచకొండ వెంకటేశ్వర్లు, కాలే యాదగిరి, మేకల కేదారి, కూన మొగిలి, బెజ్జంకి ఉపేంద్రం, లింగాల చిత్తరంజన్, గుర్రం సారంగపాణి, నక్క కుమారస్వామి, సాయికుమార్, పీఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

కాశిబుగ్గ: ప్రీమియం ధరలు తగ్గించాలని, ఏజెంట్ల కమీషన్ పెంచాలని కోరుతూ ఎల్ఐసీ ఏజెంట్లు మధ్యాహ్న భోజన సమయంలో సోమవారం వరంగల్-2 బ్రాంచి వద్ద ధర్నా చేశారు. వీరికి డివిజన్ అధ్యక్షుడు కృష్ణారావు, సుధాకర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు శ్రీనివాసరావు, అశోక్, కోశాధికారి శ్రీనివాస్, రాజిరెడ్డి, రవీందర్ రావు, ప్రతిమ, సునీత, సరిత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1973-74 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ఆర్యవైశ్య ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో టెన్త్ 1973-74 విద్యార్థులు అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సోమవారం పాపయ్యపేటలోని కేస్ హైస్కూల్లో అపూర్వ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు స్వర్గస్తులైన వారి ఉపాధ్యాయులు, మిత్రులకు అంజలి ఘటించారు. అనంతరం వారి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారి గురువైన తెలుగు మాష్టారు నరసింహాచార్యులను సత్కరించారు. పాత మిత్రులంతా వారి వారి జీవిత విశేషాలను వివరించుకుంటూ కష్టసుఖాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో యాద విద్యాసాగర్, శివ వెంకటేశ్వర్‌రావు, పివి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



• మీ కోసం

సామాజిక పథకాలతో.. సామాన్యుడికి భరోసా

- ప్రధానమంత్రి బీమా పథకాలతో ధీమా
- జన్‌ధన్ యోజనతో మరింత ఆసరా
- అవగాహన కల్పించేందుకు కేంద్రం కార్యాచరణ
- జన్ సురక్ష పేరుతో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలు సామాన్యుల బతుకుకు ఓ భరోసాగా కనిపిస్తున్నాయి. జీవిత, ప్రమాద బీమాలతో పాటు జన్‌ధన్ ఖాతాలతో ప్రతి ఒక్క పౌరుడికి ఎంతగానో లబ్ధి చేకూరుతోంది. అయితే ప్రధాన మంత్రి బీమా యోజన పేరుతో ప్రవేశ పెట్టిన ఈపథకాలపై అవగాహన లేకపోవడంతో చాలామంది ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. ప్రధానంగా గ్రామీణ స్థాయిలో ఈపథకాలపై అవగాహన లేకపోవడంతో కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న వారు ఆర్థిక భరోసాకు దూరమవుతున్నారు. తక్కువ ప్రీమియంతో పెద్ద మొత్తంలో బీమా పొందే అవకాశాన్ని కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న సామాజిక భద్రత పథకాలపై ప్రత్యేక కథనం.

తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన' ద్వారా బ్యాంకు ఖాతా ఉన్న ప్రతీ పౌరుడు ఈపథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ బీమా పథకంలో చేరాలంటే కనీస వయస్సు 18ఏళ్లు కాగా గరిష్ఠంగా 70ఏళ్ల వరకు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కసారి రూ.20తో ఈపథకంలో చేరి ప్రతీ ఏడాది అంతే మొత్తంతో చెల్లించి రెన్యువల్ చేసుకుంటూ బీమాను పొందవచ్చు. అయితే పథకం దరఖాస్తు చేసే సమయంలో ఆటో డెబిట్ ఆప్షన్ ఎంచుకుంటే ప్రతీ సంవత్సరం ప్రత్యేకంగా రెన్యువల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. ఆటోమాటిక్‌గా ప్రీమియం మొత్తం సదరు వ్యక్తి ఖాతా నుంచి కట్ అయి ప్రతీ సంవత్సరం మే నెలలో దానంతటదే రెన్యువల్ అవుతుంది. ఆసమయంలో ప్రీమియం మొత్తానికి సరిపడా సొమ్ము బ్యాంక్ ఖాతాలో నిల్వ ఉంచుకుంటే సరిపోతుంది.

ఈపథకం తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించిన లేదా యాక్సిడెంట్ వల్ల పూర్తి అంగవైకల్యం చెందిన రూ.2లక్షల బీమా మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. ప్రమాదంలో పాక్షిక అంగవైకల్యం చెందితే సదరు వ్యక్తికి రూ.లక్ష బీమా వర్తిస్తుంది.



మూడు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు

కేంద్ర ప్రభుత్వంలోని ఆర్థిక సేవల విభాగం నుంచి ప్రధాన మంత్రి సామాజిక భద్రత పథకాలపై అవగాహన కల్పిస్తూ బీమా కవరేజీ కోసం జన్ సురక్షా పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఈ ఏడాది అక్టోబరు 15 నుండి వచ్చే ఏడాది జనవరి 15 వరకు మూడు నెలల పాటు గ్రామాల వారీగా ఆయా బ్యాంకుల పరిధిలోని గ్రామాల్లో బ్యాంకు అధికారులు లేదా బిజినెస్ కరస్పాండెంట్లు ఈపథకాల్లో ప్రత్యేక నమోదు చేయనున్నారు. సామాజిక బీమా పథకాల్లో సేవింగ్స్ ఖాతా ఉన్న ప్రతీ ఖాతాదారుడిని ఇందులో చేర్చడమే లక్ష్యంగా ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నారు.



● కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన' ద్వారా బ్యాంకు ఖాతా ఉన్న ప్రతీ పౌరుడు ఈపథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకంలో చేరాలంటే కనీస వయస్సు 18సంవత్సరాలు కాగా గరిష్ఠంగా 50ఏళ్ల వారి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సంవత్సరానికి రూ.436తో ఈపథకంలో చేరి ప్రతీ సంవత్సరం అంతే మొత్తంతో రెన్యువల్ చేసుకుంటూ వెళ్లే 50ఏళ్ల వరకు ఈ జీవిత బీమాను పొందవచ్చు. అయితే దరఖాస్తు చేసే సమయంలోనే ఆటో డెబిట్ ఆప్షన్ ఎంచుకుంటే ప్రతీ ప్రత్యేకంగా రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రతీ ఏడాది మే నెలలో ఆటోమాటిక్ రెన్యూవల్ అవుతుంది.. ఈపథకం పొందిన వ్యక్తి ఏవిధంగా మరణించిన రూ.2లక్షల బీమా మొత్తాన్ని నామినీకి అందజేస్తారు.

● వయసుతో సంబంధం లేకుండా జాతీయ బ్యాంకులతో పాటు గ్రామీణ బ్యాంకుల్లో జన్‌ధన్ యోజన ఖాతాలను పొందవచ్చు. ఈఖాతాతో పాటు వచ్చే రూపే ఏటీఎం కార్డుపైన రూ.2లక్షల ప్రమాద బీమా అందుబాటులో ఉంటుంది. అయితే ఈ బీమా పొందాలంటే ఏటీఎం కార్డును ప్రమాదం జరగడానికి ముందు 60రోజుల వ్యవధిలో వినియోగించి ఉండాలి. ఈఖాతాను జీరో ఖాతాగా పిలుస్తారు. ఎలాంటి రుసుం లేకుండా ఈఖాతాను బ్యాంకు శాఖల్లో లేదా సంబంధిత బ్యాంకుల బిజినెస్ కరస్పాండెంట్ల వద్ద పొందవచ్చు. ఆధార్ కార్డుతో పాటు ఒక ఫోన్ తీసుకెళ్తే చాలు ఈ ఖాతాను తెరవచ్చు.

ప్రతీ ఖాతాదారుడు నమోదు చేసుకోవాలి



ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన పథకాల్లో సేవింగ్స్ ఖాతా కలిగిన ప్రతీ ఒక్కరు ఈ పథకాలకు నమోదు చేసుకోవాలి. ఈపథకాల్లో చేరితే ప్రమాద వశాత్తు మరణించిన కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుంది. వీటిపై అవగాహన కల్పించేందుకు జన్‌సురక్షా పేరిట మూడు నెలల పాటు గ్రామీణ స్థాయిలో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నాం.

ఏ.తిరుపతి నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్, భూపాలపల్లి



గుర్తింపు

ఎల్కతుర్తి మండల సమాఖ్య కేంద్రం (ఐకేపీ భవనం)

ఉత్తమ మండల సమాఖ్యగా ఎల్కతుర్తి

- రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపిక
- హర్షం వ్యక్తం చేసిన మహిళ సంఘాలు

ఎల్కతుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పని తీరు కలిగిన ఎల్కతుర్తి మండల ఎస్‌హెచ్‌జీ (మండల మహిళ సమాఖ్య) జాతీయ స్థాయి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఏపీ మాస్ చైర్మన్ కాకి మాధ వరావు (రిటైర్డు ఐఏఎస్), సీఈవో, ఎండీ సీఎస్ రెడ్డిలు సోమవారం ప్రక టన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉత్తమ పని తీరు కనబరిచిన ఎస్‌హెచ్‌జీల నుంచి ఏపీ మాస్ (ఆంధ్రప్రదేశ్ మహిళ అభివృద్ధి సంస్థ), ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), ఇతర ఏజెన్సీల మద్దతుతో దేశ వ్యాప్తంగా ఆగస్టులో మొదటి విడత, ఈనెల 9న రెండవ విడతలో ఎస్‌హెచ్‌జీ (సెల్ హెల్ప్ గ్రూప్) ఫెడరేషన్ల నుంచి 200 నామినేషన్‌లు స్వీకరించారు.

ఇందులో సమాఖ్య పనితీరు, అంది స్తున్న సేవలు, వనరులు, ఆస్తు నిర్వహణ, వాటి నాణ్యత, సమావేశాలు, హాజ రు, రుణ స్వీక రణ, చెల్లింపులు, పొదుపు, సభ్యుల పనితీరు, స్వయం సమృద్ధి సాధనలో సాధించిన లక్ష్యాలను ప్రామాణికంగా ఎంపికలు జరిపారు. ఇందులో ఎల్కతుర్తి ఎస్‌హెచ్‌జీ - 2024కు భారత దేశం వ్యాప్తంగా మొదటి స్థానంలో ఎంపికైంది. రాష్ట్రంలో మొదటి సారిగా ఎస్‌హెచ్‌జీ ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డును నవంబరు 22న హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి సదస్సులో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్. స్వర్ణలత అందుకోనున్నట్లు మం డల ఏపీఎం రవీందర్ తెలిపారు. మండల సమాఖ్య పరిధిలో 942 సంఘాలు, 10422 మంది సభ్యులు ఉన్నట్లు రవిందర్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులను, ఏపీఎం రవిందర్‌ను, వీవోఏలు, సిబ్బంది, సంఘం సభ్యులను కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ప్రాజెక్టు అధికారి నాగపద్మజా, ఏపీడీ సుధీర్‌కుమార్‌లు అభినందించారు.

తాను పనిచేసే చోటే.. కుమారుడికి అడ్మిషన్

ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయురాలు



ప్రభుత్వ పాఠశాలలో కుమారుడిని చేర్పిస్తున్న ఉపాధ్యాయురాలు శృతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాను విధులు నిర్వహించే సర్కారు బడిలోనే తన కుమారుడిని చేర్పించిన ఆ ఉపాధ్యాయురాలు ఆదర్శంగా నిలిచారు. మహబూబాబాద్‌కు చెందిన గిద్దె శృతి డీఎస్సీ-2024 ద్వారా టీచర్ కొలువుకు ఎంపికై మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)గా ఇటీవల విధుల్లో చేరారు. ఈ క్రమంలో తన ఐదేళ్ల కుమారుడు సాహస్ అభినందన్‌ను కూడా అదే పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్చారు. అంతే కాదు తన కూతురిని కూడా అదే పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. కొత్తగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరిన శృతి తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధారావత్ భద్రు, ఉపాధ్యాయులు మౌనిక,సూర్యప్రకాష్, పవన్‌రాజ్, కృష్ణమూర్తి, రాచకొండ ఉపేందర్, బానోత్ శంకర్ పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా..

- తన వంతు కృషి చేస్తున్న ప్రకాశ్
- పాదయాత్రలు, స్వచ్ఛంద కార్యక్రమాలతో చైతన్యం

• ఆదర్శం

కాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు ముప్పుకలగకుండా.. పర్యావరణ పరిరక్షణలో 'నేను సైతం' అంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని, చెరువులను కాలుష్యం నుంచి కాపాడాలంటూ అవగాహన కల్పిస్తున్నాడు. చెట్లను నరుకుతూ కనిపిస్తే అడ్డుకుంటాడు. మురికి కుంటలు, చెరువుల్లో ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయి కనిపిస్తే చాలు వెంటనే అందులోకి దిగి ఆ కవర్లన్నీ ఏరి ఒక కుప్పగా పోసి మునిసిపల్ సిబ్బంది సమాచారం ఇచ్చి అక్కడ నుంచి తరలిస్తాడు. గణపతి నవరాత్రులొస్తే ఖైరతాబాద్ నుంచి ఖమ్మం వరకు వివిధ రకాల వేషధారణతో పాదయత్ర చేసి 'మట్టివినాయకులనే పూజిద్దాం. ఇళ్లలో నిమజ్జనం చేద్దాం - చెరువులను రక్షిద్దాం' అంటూ అవగాహన కల్పిస్తుంటాడు. కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. ములుగు జిల్లా మంగపేటలో తన బంధువుల ఇంటి వద్ద ఉండి పదో తరగతి వరకు చదువుకున్న ప్రకాశ్ అక్కడి బిల్ట్ పరిశ్రమ నుంచి కాలుష్యం వెలువడటంతో బిల్ట్ యజమానులు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచేవారు. పాఠశాల స్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పొల్గొన్న ప్రకాశ్ దృష్టి పర్యావరణ పరిరక్షణపైకి మళ్లింది.

2018లో పాదయాత్రగా ఖైరతాబాద్ వెళ్లి.. గణేష్ విగ్రహ తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించకుండా పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించాలంటూ ఉత్సవ నిర్వాహకులను కలిసి వినతిపత్రం ఇచ్చాడు. ఆ తర్వాత మేధిని అనే స్వచ్ఛంద సంస్థని స్థాపించి ఖైరతాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసి ఇండ్లలోనే నిమజ్జనం చేద్దాం- చెరువులను రక్షిద్దాం అంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాడు. వికారాబాద్ జాతీయ రహదారివద్ద వెయ్యి చెట్లను నరికివేయబోతున్నారని తెలిసి వికారాబాద్ వరకు పాదయాత్ర చేసి హైదరాబాద్ నేచర్ లవర్స్, చెన్నై జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి చెట్ల నరికివేతపై స్టే తెచ్చాడు. ప్రతీ రెండు సంవత్సరాలకు మేడారం జాతరకు వెళ్లి ప్లాస్టిక్ వాడొద్దని, చెట్లను నరికొద్దని అవగాహన కల్పిస్తుంటాడు. ఇతని సేవను గుర్తించి పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ఎన్నో అవార్డులు ఇచ్చాయి.



ప్లాస్టిక్ బాటిళ్లను మెడలో వేసుకుని అవగాహన కల్పిస్తున్న ప్రకాశ్ (ఫైల్)



ప్రకృతిని రక్షించాలని మురికి కుంటలో నిరసన



అన్న హజారేతో ప్రకాశ్ (ఫైల్ ఫొటోలు)

ప్రకృతి విధ్వంసాన్ని అడ్డుకోవాలి

కొలిపాక ప్రకాశ్, పర్యావరణ ప్రేమికుడు



ప్రస్తుతం ప్రకృతి విధ్వంసం ఎక్కువవుతోంది. ఈ విధ్వంసాన్ని అడ్డుకోవాలి. పట్టణీకరణ పెరిగే కొద్ది కాలుష్యం పెరుగుతోంది. ఇదే కొనసాగితే రాబోయే తరాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలి. అందుకు యువత నడుం బిగించాల్సిన అవసరం ఉంది. తాత్కాలిక అవసరాలకోసం ప్లాస్టిక్‌ను వాడితే భవిష్యత్ గందరగోళం ఏర్పడుతోంది. ప్రభుత్వమే అన్నీ చేయాలంటే ఎలా... ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం ఒక బాధ్యత తీసుకోవాలి. కాలుష్య కోరల్లోంచి బయటపడాలి ముఖ్యంగా దీనిపై యువత చొరవ చూపాలి.

సమన్వయ లోపం.. రోగులకు శాపం

గాడితప్పిన ఎంజీఎం నిర్వహణ ఆర్‌ఎంల అలకతో సమస్య జటిలం

వరంగల్ మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణ గాడితప్పిందని, ఆర్‌ఎంవోలకు మినిస్టీరియల్ అధికారులకు మధ్య ఏర్పడిన గ్యాప్ రోగులకు శాపంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిత్యం వందలాది మంది రోగులొచ్చే ఈ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనలో కూడా పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ మధ్యకాలంలో పరిపాలనపరమైన దస్త్రాలు తమ వద్దకు రావడం లేదన్న కారణంతో ఆర్‌ఎంవోలు అలకబూనారని, విధులు లేని కుర్చీలు తమకెందుకన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ నామమాత్రంగా విధులకు హాజరవుతూ చేతులు దులుపుకుంటున్నారని, ఒక ఆర్‌ఎంవో అయితే జాడ లేకుండా పోయినట్లు సమాచారం. ఫలితంగా వివిధ అవసరాల కోసం వచ్చే రోగులకు శాపంగా మారింది. వివిధ పరీక్షలు ఉచితంగా చేయాలంటే ఆర్‌ఎంవో సంతకాలు అవసరం కాగా గదులన్నీ ఖాళీగా ఉండటంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక రోగులు వెనుతిరుగుతున్నారు. ఇక వివిధ వార్డుల్లో అవసరమయ్యే మౌలిక సదుపాయాల ఇండెట్స్ కూడా ఆర్‌ఎంవోల సంతకాలు తప్పనిసరి అయితే ఎవరూ లేకపోవడంతో ఇంటెండ్ ఇచ్చేందుకు స్టోర్స్ సిబ్బంది నిరాకరిస్తున్నారని ఎంజీఎం నాలుగో తరగతి ఉద్యోగులు నర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు.

అసలేం జరిగింది?



ఎంజీఎం మినిస్టీరియల్ అధికారికి వివిధ దస్త్రాలు నేరుగా వెళుతుండగా అక్కడి సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళుతున్నాయి. గతంలో ఇలాంటి ఫైళ్లన్నీ ఆర్‌ఎంవో కార్యాలయానికి కూడా వెళ్లేవి కాగా ప్రస్తుతం ఇందుకు విరుద్ధంగా జరుగుతుండటం ఆర్‌ఎంవోల అలకకు కారణమైందని తెలుస్తోంది.

మందుల కొనుగోళ్లే కారణమా?

అయితే మందుల కొనుగోలు వ్యవహారంలో ఆర్‌ఎంవోలను పక్కన పెట్టడం కూడా ఈ అంతర్గత గొడవ కారణమైనట్టు తెలుస్తోంది. అదే విధంగా డైట్ కాంట్రాక్టు విషయంలో కూడా బేదాభిప్రాయాలు వ్యక్తమైనట్టు సమాచారం. వీటికి తోడు అమ్యామ్యాల విషయంలో వచ్చిన అపార్థాలు కూడా కారణమేనన్న గుసగుసలు వినిపించడం గమనార్హం.

కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు కరువు

అధికారులు మధ్య సమన్వయ లోపం కాంట్రాక్టు ఉద్యోగులకు శాపంగా మారింది. కొనసాగింపు ఉత్తర్వులు బడ్జెట్ ఉన్నా ఇంత వరకు జీతాలు ఇవ్వకపోవడం పట్ల కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం తమకు భారంగా మారిందని, ఇప్పటికైనా తమకు జీతాలు చెల్లించాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వే విధులు సరే.. భద్రతేదీ?



బేతోలు శివారులో సర్వే చేస్తున్న మల్యాల ఏఈవో సరిత

వారు మహిళా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు. నాలుగు రోజులుగా డిజిటల్ క్రాప్ సర్వే జరుగుతున్న నేపథ్యంలో వారు ఇదిగో ఇలా అవస్థలు పడుతున్నారు. సర్వేలో భాగంగా డిజిటల్ యాప్‌లో చూపించిన పొలాలకు, ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. ఈ క్రమంలో కాలినడకన కిలోమీటర్ల కొద్దీ గుట్టలు, పుట్టలు, ముళ్ల కంచెలు, చెట్ల పొదలను దాటుతున్నారు. ఆ సమయంలో ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇక ఆయా ప్రాంతాల్లో సెల్ నెట్‌వర్క్‌లు సరిగ్గా ఉండకపోవడంతో డిజిటల్ యాప్ సక్రమంగా పనిచేయక, గ్రామ సమాచారం ఓపెన్ కావడానికి ఆలస్యమవుతోంది. కొన్ని సందర్భాల్లో యాప్‌లో చూపించిన విధంగా ఒక పొలం వద్దకు వెళ్తే.. ఇంకా చేరుకోనట్టు చూపుతుండటం, ఒక సర్వే నెంబర్ వద్ద ఇతర రైతుల వివరాలు చూపించడం, రైతు ఫొటోలు తీసిన తర్వాత సబ్‌మీట్ కావడానికి ఆలస్యం జరుగుతోంది. దీంతో అవస్థలు ఎదుర్కొంటున్న ఏఈవోలు.. తాము కిలోమీటర్ల కొద్ది గుట్టలు, పుట్టల మధ్య ఒంటరిగా వెళ్లాల్సి వస్తోందని, ఏ సమయంలో ఏ ఆపద ముంచుకొస్తుందోనని, తమకు భద్రత ఏదీ అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మహబూబాబాద్ అగ్రికల్చర్

ఏటిగడ్డతండాలో కంచెల మధ్య సర్వే చేస్తున్న ఏఈవో లావణ్య





చెట్ల మధ్య రజాలీపేటలో సర్వేకు వెళ్తున్న మహబూబాబాద్ ఏఈవో

అక్రమ పట్టాల కేసులో చర్యలేవీ?

- యజమాని బతికుండగానే చనిపోయినట్టు ధ్రువీకరణ
- భూమిని ఇతరులకు పట్టాచేసిన తహసీల్దార్
- పోలీసు కేసుతోనే సరి.. కానరాని శాఖాపర చర్యలు

పర్వతగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మనిషి బతికుండగానే చనిపోయినట్లు ధృవీకరణ పత్రాలు సృష్టించి ఆయన భూమిని ఇతరులకు బదలాయించారు. దర్జాగా పట్టాలు చేసి అందినకాడికి దండుకున్నారు. ఆలస్యంగా తెలుసుకున్న భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. ఏకంగా తహసీల్దారే ఇలాంటి చర్యకు ఒడిగట్టినా శాఖాపరంగా తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. తహసీల్దార్ చొరవతోనే ఇదంతా జరిగిందని స్పష్టంగా అర్థమవుతున్నా చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అయితే ఈ ఒక్క డీల్‌తో లక్షల్లో చేతులు మారాయని చర్చ జరుగుతుండగా.. సదరు తహసీల్దార్ హయాంలో ఇలాంటి ఘటనలు మరెన్ని జరిగాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క అఫిడవిట్ ఆధారంగా పట్టా చేశారు..

మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి బతికుండగానే చనిపోయాడని ధృవీకరణ చేసి మరీ అతని భూమిని ఇతరులకు బదలాయించారు. ఒకవేళ రైతు మృతి చెందితే అతనికి సంబంధించిన భూమిని వారసులకు బదిలీ చేయాలంటే రైతు మరణ ధ్రువీకరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, ఒరిజినల్ పట్టా దార్ పాస్‌బుక్ అవసరం. కానీ ఇక్కడ అవేవీ లేకుండానే కేవలం రెండు పేజీల లాయర్ అఫిడవిట్ ఆధారంగా ఏకంగా ఎకరం భూమిని ఇతరులకు అక్రమంగా పట్టాచేశారు. కొందరు దళారుల ప్రోద్బలంతో లక్షలు చేతులు మారడంతో పట్టాలు మారాయని మండలం మొత్తం కోడైకూస్తోంది.

రైతు ఫిర్యాదుతో కేసు నమోదు

రుణమాఫీకి సంబంధించి తనకు ఎలాంటి సమాచారం అందకపోవడంతో తాను రుణం తీసుకున్న బ్యాంకుకు వెళ్లి సదరు రైతు ఆరా తీశాడు. దీంతో బ్యాంకు అధికారులు అతడి పేరుపై భూమి లేదని, ఇతరులకు విక్రయించినట్టు రికార్డుల్లో ఉందని చెప్పడంతో అవాక్కయ్యాడు. వెంటనే రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తనకు చెందిన పత్రాలతో సంప్రదించాడు. తాను బతికుండగానే చనిపోయినట్టు ధ్రువీకరణ సృష్టించి తన భూమి తనకు తెలియకుండానే అధికారులు ఇతరులకు పట్టాచేశారని తెలుసుకుని పోలీసులతో పాటు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.



పర్వతగిరి తహసీల్దార్ కార్యాలయం

చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు..

బతికున్న మనిషిని చనిపోయాడని ధ్రువీకరించి అతని భూమిని ఇతరులకు పట్టా చేసిన తహసీల్దార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా పట్టా చేసిన అనంతరం తహసీల్దార్ ఇతర మండలానికి బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్లిన కొన్ని రోజులకు విషయం వెలుగులోకి వచ్చింది. రైతు ఫిర్యాదుతో స్టేషన్‌లో కేసు నమోదైంది కానీ, ఇది జరిగి రెండు నెలలు గడుస్తున్నా రెవెన్యూ ఉన్నతాధికారుల వైపు నుంచి ఎలాంటి శాఖాపరమైన చర్యలు కనబడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సదరు తహసీల్దార్ హైదరాబాద్ స్థాయిలో పలువురు అధికారులను ప్రభావితం చేసి దర్జాగా తన విధులు నిర్వర్తిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆ తహసీల్దార్ హయాంలో మరెన్ని అక్రమాలకు పాల్పడ్డారోనని మండలంలో చర్చ సాగుతోంది. ఎప్పుడు ఇలాంటి ఏ ఘటన బయటికి వస్తుందోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు డిమాండ్‌చేస్తున్నారు.





సేఫ్ దివాళీ

ఎల్లుండే దీపావళి. టపాసుల షాపింగ్ ఇప్పటికే జోరుగా, హుషారుగా మొదలైపోయింది. అయితే పేల్చే టపాసులతో దుష్ప్రభావాలతో పాటు ఆరోగ్యం కూడా పరారైపోకుండా చూసుకోవాలి. అందుకోసం కళ్లూ, ఒళ్లూ గాయపడకుండా కాపాడుకోవాలి.

టపాసులతో టెన్షన్ లేకుండా...

కంటి పాపలు పదిలంగా...

టపాసులు పేలుతూనే నిప్పు రవ్వలను విరజిమ్ముతాయి. అవి చిన్నవైతే గాల్లోకి లేచి నేలను తాకేలోపే ఆరిపోతాయి. అవే పెద్దవైతే మాత్రం జాగ్రత్తగా ఉండాల్సిందే! పెద్ద శబ్దంతో పేలే టపాసుల రవ్వలు ఒంటితోపాటు, కళ్లలో కూడా ఎగిరొచ్చి పడతాయి. కనుగుడ్డుకు రవ్వలు తగిలి గాయాలవుతాయి కూడా! ఇలాంటప్పుడు కనుగుడ్డులోని కార్నియాకు నష్టం జరగొచ్చు. ఈ నష్టం వల్ల కంటిలో 'ట్రామాటిక్ కాటరాక్ట్' ఏర్పవచ్చు. గాయం తీవ్రతను బట్టి రెటీనా నరం దెబ్బతినొచ్చు. ఒకవేళ కాటరాక్ట్ ఏర్పడితే దాన్ని తొలగించి కుట్లు వేసి సరిచేయొచ్చు. దెబ్బ తీవ్రతను బట్టి రెటీనా డిటాచ్‌మెంట్ సర్జరీ చేసి, సరి చేయొచ్చు. కంట్లో దెబ్బ తగిలిన భాగాన్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. అసలీ సమస్యలేవీ రాకుండా ఉండాలంటే టపాసులు కాల్చేటప్పుడు ఈ జాగ్రత్తలు పాటించాలి.

- వీలైనంత దూరంగా ఉండి టపాసులు పేల్చాలి.
- కళ్లకు కళ్లద్దాలు పెట్టుకుంటే నిప్పు రవ్వలు, టపాసుల్లో ఉండే రాళ్లు కనుగుడ్డుకు తగలకుండా ఉంటాయి.
- టపాసులు వెలిగించటానికి పొడవాటి అగర్‌బత్తీ, పుల్లల్లాంటివి వాడాలి.
- పేలే టపాసులకు కనీసం 5 మీటర్ల దూరంలో ఉండాలి.
- కంట్లో నిప్పురవ్వ పడినా, రాళ్లు తగిలినా కన్ను కడిగేసి వదిలేయకుండా వెంటనే కంటి వైద్యుల్ని సంప్రదించాలి.
- కంటికి తగిలే గాయాలకు ఎంత త్వరగా చికిత్స చేయగలిగితే కంటి చూపును అంత మెరుగ్గా కాపాడుకోవచ్చు.
- కార్నియాకు తగిలిన దెబ్బలను నిర్లక్ష్యం చేస్తే ఏకంగా కంటి చూపు పోయే ప్రమాదం ఉంటుంది.
- కంటికి దెబ్బ తగిలితే వేళ్లతో రుద్దడం, నీళ్లతో కడగటం, ఆయింట్‌మెంట్ పెట్టడం లాంటివి చేయకూడదు.
- టపాసుల పొగ వల్ల కళ్ల మంటలు సహజం. ఈ మంటల నుంచి ఉపశమాన్నిచ్చే లూబ్రికెంట్స్ ఉంటాయి. వీటి కోసం పండగ ముందే వైద్యులను కలవాలి.
- కాంటాక్ట్ లెన్స్‌లు వేసుకునేవాళ్లు టపాసులు కాల్చేటప్పుడు సాధారణ కళ్లజోడు వాడటం అవసరం. కాంటాక్ట్ లెన్స్‌ల మీద వేడి ప్రభావం ఎక్కువ. కొన్ని సందర్భాల్లో కార్నియా కాలే ప్రమాదం కూడా ఉంటుంది.
- చిచ్చుబుడ్లు, రాకెట్ల వల్లే కళ్లకు గాయాలయ్యే అవకాశాలు ఎక్కువ. మరీ ముఖ్యంగా కంటికయ్యే గాయాల్లో కళ్ల మంటలు మొదలుకుని కార్నియా లేచిపోవటం, పాక్షిక అంధత్వం, పూర్తి అంధత్వం వరకూ ఎన్నో రకాల సమస్యలు చోటు చేసుకుంటూ ఉంటాయి. టపాసులు పేలేటప్పుడు వెలువడే వేడి 1200 డిగ్రీల వరకూ ఉంటుంది. ఇది మరిగే నీళ్ల 1000 డిగ్రీల ఉష్ణోగ్రత కంటే ఎక్కువ. గాజును కరిగించేంతగా, థర్డ్ డిగ్రీ గాయాలు చేసేంత ప్రమాదకరంగా ఉంటుంది. కాబట్టి టపాసులు పేల్చేటప్పుడు నిర్లక్ష్యం వద్దే వద్దు!

◆◆◆

కాలుష్యాన్ని పీల్చొద్దు!

టపాసుల పేలుడుతోపాటు వెలువడే పొగ వల్ల ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయి. మరీ ముఖ్యంగా ఆరోగ్యకరమైన వ్యక్తులతోపాటు అప్పటికే ఉబ్బసం, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ మొదలైన శ్వాసకోశ వ్యాధులు ఉన్న వాళ్లకు టపాసుల పొగ వల్ల విపరీతమైన ఆరోగ్య నష్టం జరుగుతుంది. టపాసుల తయారీలో సల్ఫర్ (గంధకం), కార్బన్ వాడతారు. వీటి వల్లే టపాసులు పెద్ద పెద్ద వెలుగులను వెదజల్లుతాయి. వాటికితోడు ఆర్సినిక్, మాంగనీస్, సోడియం ఆక్సలేట్, అల్యూమినియం, ఐరన్ డస్ట్ పౌడర్, పొటాషియం, బేరియం నైట్రేట్ మొదలైన ఎన్నో రసాయనాలను వాడతారు. వీటి వల్ల టపాసులు కాల్చినప్పుడు దట్టమైన పొగలు అలుముకుంటాయి. ఈ పొగల్లో సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్...మొదలైన విష వాయువులు ఉంటాయి. వీటిని పీల్చడం వల్ల స్వల్పంగా దగ్గుతో పాటు ఊపిరితిత్తుల్లో కఫం పేరుకోవటం, ఊపిరి తీసుకోవటంలో ఇబ్బంది, ఆయాసం, అలర్జిక్ రైనైటిస్, రెస్పిరేటరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్లు మొదలైన సమస్యలు వేధిస్తాయి.

◆◆◆

సురక్షిత పద్ధతులివే!

- ముక్కుకీ, నోటికీ కాటన్ స్కార్ఫ్ చుట్టుకోవాలి.
- రంగుల పొగలు వెదజల్లే టపాసులు మరింత ప్రమాదకరమైనవి. వాటిని కాల్చకపోవటమే మంచిది.
- చైనా తయారీ టపాసులు కార్బన్ మోనాక్సైడ్ లాంటి విషవాయువులను విడుదల చేస్తాయి. వాటికి బదులుగా దేశీయ టపాసులనే ఎంచుకోవాలి.
- తక్కువ పొగ వెదజల్లే టపాసులకు పరిమితమవటం మేలు.
- టపాసులు కాలేటప్పుడు వాటి మీదకు వంగి చూడకుండా, చేతిని దూరంగా చాపి ఉంచాలి.
- మూసి ఉన్న ప్రదేశాల్లో కాకుండా వాకిట్లో లేదా మేడ పైన, ఆట స్థలాల్లో టపాసులు కాల్చటం ఉత్తమం.
- ఇంట్లోకి పొగ వెళ్లకుండా తలుపులు మూసి ఉంచాలి.
- టపాసులు కాల్చిన మరునాడు ఉదయాన్నే వాకింగ్ చేయటం మానుకోవాలి. ఆ సమయంలో వాతావరణంలో కాలుష్యాల పరిమాణం ఎక్కువగా ఉంటుంది.
- ఎక్కువ పొగను వెదజల్లే చిచ్చుబుడ్లు, మతాబులు, భూచక్రాలు లాంటి టపాసులను కాల్చకూడదు.
- మరీ ముఖ్యంగా ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలున్నవాళ్లు టపాసులకు దూరంగా ఉండాలి.
- అపార్ట్‌మెంట్లలో ఉండేవాళ్లు బాల్కనీల్లో కాకుండా కిందకి దిగి వచ్చి అపార్ట్‌మెంట్ ఆవరణలో టపాసులు పేల్చాలి.

◆◆◆

టపాసులు కాల్చేటప్పుడు

- ఒకరి తర్వాత ఒకరుగా ఒక్కొక టపాసు కాల్చాలి. ఇలా చేస్తే శబ్దంతోపాటు, పొగ కూడా తక్కువగా వెలువడుతుంది.
- టపాసులు కాల్చటానికి పొడవాటి క్యాండిల్, అగర్‌బత్తీ ఉపయోగించాలి. చేతిని పూర్తిగా చాపి టపాసులను ముట్టించాలి.
- బక్కెట్లలో నీళ్లు అందుబాటులో పెట్టుకుంటే మంటలు ఆర్పటానికి వీలుగా ఉంటుంది. పొరపాటున చేతులు కాలితే వెంటనే ఆ నీళ్లలో ముంచటానికి అనువుగా ఉంటుంది.
- పసిపిల్లల చెవుల్లో దూది ఉండలు ఉంచాలి.
- పేలని టపాసులను దగ్గరికెళ్లి పరీక్షించటం మానుకోవాలి.
- టపాసులను వంట గదిలో, పూజ గదిలో ఉంచకూడదు.
- గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ఆపేయాలి. నిండుగా ఉన్న సిలిండర్‌లను బాల్కనీల్లో, టపాసులు పేల్చే ప్రదేశాలకు దగ్గర్లో ఉంచకూడదు. దూసుకొచ్చే రాకెట్ల లాంటివి సిలిండర్లకు తగిలే ప్రమాదం ఉంటుంది.
- టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులే ధరించాలి.

ఒళ్లు జర భద్రం!


దీపావళి టపాసులు పేల్చినప్పుడు శబ్దంతోపాటు దట్టమైన పొగలూ అలముకుంటాయి. టపాసుల తయారీలో వాడే అత్యధిక మెగ్నీషియం, కార్బైట్‌లే ఇంత దట్టమైన పొగలకు కారణం. టపాసుల పొగ చర్మాన్ని తాకినప్పుడు ఈ రసాయనాలు చర్మం మీద అతుక్కుని దురద, మంట, కెమికల్ బర్న్, అలర్జీలను కలగజేస్తాయి. ఇక పొగతోపాటు టపాసుల తయారీలో ఉపయోగించే రాళ్లు కూడా చర్మానికి తగిలి గాయాలు చేస్తాయి. కొన్నిసార్లు బాంబులు, రాకెట్లు చాలా దగ్గర్నుంచి పేలినప్పుడు వాటి నిప్పు రవ్వలు చర్మం మీద పడి అంటుకుపోతాయి. కొన్ని బాంబులు చేతుల్లోనే పేలతాయి. ఇలా దీపావళి టపాసుల పేలుళ్లు, పొగల వల్ల చర్మానికి జరిగే నష్టం ఎక్కువే! కాబట్టి కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలి.

- ఒళ్లంతా కప్పి ఉంచే కాటన్ దుస్తులు ధరించాలి.
- పేలే టపాసులకు దూరంగా ఉండాలి.
- మీది సున్నిత చర్మమైతే టపాసులు పేల్చే సమయంలో ముఖానికి, చేతులకు కాటన్ స్కార్ఫ్ చుట్టుకోవాలి.
- టపాసులు పేల్చడానికి ముందు, మాయిశ్చరైజర్ చర్మానికి పూసుకుంటే రక్షణ పొరగా పని చేస్తుంది.
- టపాసులు కాల్చిన తర్వాత సబ్బు నీటితో చేతులు, ముఖం కడుక్కోవటం మర్చిపోకూడదు.
- శుభ్రంగా కడిగిన తర్వాత తప్పనిసరిగా మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

చర్మం కాలితే?

టపాసుల పేలుడు వల్ల చర్మం మీద గాయాలైనా, కాలినా ఈ క్రింది తక్షణ చికిత్స చేసుకోవాలి

- ధారగా కారే నీళ్ల కింద ఉంచి, గాయాన్ని కడగాలి
- ఐస్ క్యూబ్స్ రుద్దడం, నూనె పూయడం, టించర్, డెటాల్, టూత్‌పేస్ట్ పూసుకోవడం లాంటివి చేయకూడదు
- గాయాన్ని శుభ్రంగా కడిగి యాంటీబయాటిక్ క్రీమ్ పూసుకుంటే సరిపోతుంది
- గాయం తీవ్రంగా ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి
- ఆస్పత్రికి చేరేవరకూ గాయాలను శుభ్రమైన బట్టతో కప్పి ఉంచాలి.
- బొబ్బ ఇబ్బంది పెడుతుంటే, స్టెరైల్ చేసిన సూదితో గుచ్చి, లోపలి నీళ్లను బయటకు రప్పించాలి. కానీ పైన ఏర్పడిన రక్షణ పొరను పీకకూడదు
- లోతైన కాలిన గాయాలకు తప్పనిసరిగా డ్రెస్సింగ్ అవసరమవుతుంది. మాయిస్ట్ డ్రెస్సింగ్ కోసం, యాంటీబయాటిక్ క్రీమ్ అప్లై చేసి, మాయిశ్చరైజర్, యాంటీబయాటిక్ కాంబినేషన్ మెటీరియల్‌తో డ్రెస్సింగ్ చేయాలి.
- లోతైన గాయాల మీద దూదితో కట్టు కడితే అది గాయానికి అతుక్కుపోయి, దాన్ని తొలగించిన ప్రతిసారీ కొత్తగా మానిపోతున్న గాయం మళ్లీ తిరగబెడుతూ ఉంటుంది. కాబట్టి దూది జోలికి వెళ్లకూడదు
- టపాసులను తాకిన, కాల్చిన చేతులను నేరుగా ముఖం మీద, కళ్లలో పెట్టుకోకూడదు.
- టపాసులు కాల్చిన తర్వాత దురదలు మొదలైతే వెంటనే వైద్యుల్ని కలవాలి
- కాలిన ప్రదేశంలో ఏవైనా నగలు, చేతి గడియారాలు ఉంటే వాటిని తొలగించాలి.






డాక్టర్ స్వప్నప్రియ
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్

ఢామ్... ఢామ్ శబ్దాలతో జాగ్రత్త!

టపాసుల శబ్దాల వల్ల కలిగే నష్టం నుంచి మనల్ని మనమే కాపాడుకోవటం అవసరం. టపాసుల శబ్దాల వల్ల కలిగే నష్టం రెండు అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ శబ్దాలకు మనం ఎంత దూరంలో ఉన్నాం? శబ్దం ఎంత తీవ్రంగా ఉంది? అనే రెండు అంశాల మీదే మనకు కలిగే వినికిడి నష్టం ఆధారపడి ఉంటుంది. టపాసులు చేసే పెద్ద శబ్దాల వల్ల హైపర్‌టెన్షన్, ఒత్తిడి, వినికిడిలోపం మొదలైన సమస్యలు తలెత్తుతాయి. విపరీతమైన శబ్దాల వల్ల కొన్నిసార్లు వినికిడి శక్తి పూర్తిగా కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు. అత్యధిక శబ్దాల కారణంగా...



- **టిన్నిటస్:** చెవుల్లో శబ్దం (గంట మోగినట్టు, సముద్రపు హోరు) మొదలవుతుంది. ఇది వినికిడి లోపానికి దారి తీయొచ్చు.
- **టెంపరరీ థ్రెషోల్డ్ షిఫ్ట్:** వినికిడి శక్తిలో స్వల్ప తగ్గుదల. ఇది సాధారణంగా ఒక రోజంతా ఉంటుంది.
- పర్మనెంట్ హియరింగ్ లాస్: కర్ణభేరి దెబ్బతినటం వల్ల శాశ్వత వినికిడి లోపం ఏర్పడవచ్చు.

వినికిడి నిక్షేపంగా!

టపాసుల శబ్దం కారణంగా వినికిడి శక్తి దెబ్బతినకుండా ఉండాలంటే సాధ్యమైనంత తక్కువ శబ్దం వచ్చే టపాసులనే పేల్చాలి. ఈ ముందు జాగ్రత్తలతోపాటు...

- చెవులకు ఇయర్ ప్లగ్స్ పెట్టుకోవటం వల్ల శబ్దం నేరుగా కర్ణభేరికి చేరకుండా ఉంటుంది.
- ఫోమ్ ప్లగ్స్ లేదా హెడ్ ఫోన్స్ వాడినా ఫలితం ఉంటుంది.
- ఏ మాత్రం శబ్దం తాకిడికీ గురవకూడదనుకుంటే ఇయర్ ప్లగ్స్‌తోపాటు, హెడ్ ఫోన్స్ కూడా వాడాలి.
- టపాసుల పేలుడు వల్ల వినికిడిలో మార్పు అనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. వినికిడికి సంబంధించిన సమస్యలకు కారణాన్నీ, దెబ్బ తిన్న చెవి భాగాన్నీ గుర్తించి ఎంత త్వరగా గుర్తించి అంత త్వరగా చికిత్స అందిస్తే మేలు. అప్పుడు అంత త్వరగా వినికిడి తిరిగొస్తుంది.
- శబ్దాలకు ఎంత దూరంలో ఉంటే నష్టం అంత తక్కువగా ఉంటుంది. కాబట్టి పెద్ద శబ్దంతో పేలే టపాసులకు సాధ్యమైనంత ఎక్కువ దూరం పాటించాలి.
- పెద్దలైతే 20 మీటర్లు, పిల్లలైతే 50 మీటర్ల దూరం పాటించాలి.



డాక్టర్ సుధీర్ రెడ్డి
ఇఎన్‌టి సర్జన్, త్రీ సెన్సెస్, హబ్సిగూడ, హైదరాబాద్.

కేన్సర్ కేర్

కేన్సర్ ఎవరికి?

పూర్వంతో పోల్చుకుంటే కేన్సర్ వచ్చే అవకాశాలు పెరిగాయి. ఆహారం, జీవనశైలిలో కాలక్రమేణా ఎన్నో మార్పులొచ్చాయి. వాతావరణంలో కాలుష్యం పెరిగింది. పుట్టి, పెరిగే ప్రదేశాలు మారిపోతున్నాయి. ఈ అంశాలన్నీ శరీరం మీద ప్రభావం చూపిస్తాయి. వీటికి పైన చెప్పిన కారణాలు కూడా తోడైతే కేన్సర్ వచ్చే అవకాశాలు మరింత పెరుగుతాయి. కేన్సర్‌కు కారణాలు ప్రధానంగా నాలుగు. అవేంటంటే...

1. జన్యుపరమైన కారణాలు *(వంశపారంపర్యంగా సంక్రమించేవి)*
2. కాలుష్యం, పర్యావరణం
3. జీవనశైలి
4. ఆహారపుటలవాట్లు

ఎంతటి ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపుటలవాట్లతో పెరిగినా జన్యువుల్లో కేన్సర్ కారకం ఉంటే వంశపారంపర్యంగా కేన్సర్ సంక్రమించవచ్చు. అయితే ఈ రకమైన క్యాన్సర్లు 30 నుంచి 35 ఏళ్ల లోపే బయల్పడతాయి. అయితే కేన్సర్ కారకాల్లో వంశపారంపర్యంగా సంక్రమించే అవకాశాలను, పర్యావరణ మార్పుల వల్ల కేన్సర్ సంక్రమించే అవకాశాలను నియంత్రించలేకపోయినా, ఆహారపుటలవాట్లు, జీవనశైలిని ఆరోగ్యకరంగా మార్చుకునే వీలు మన చేతుల్లోనే ఉంది.



ఆహారపుటలవాట్లు, నియమాలు, శైలి

ఎప్పటికప్పుడు వేడిగా వండుకుని తినే అలవాటు కాలక్రమేణా అంతరించింది. 30, 40 ఏళ్ల క్రితం మధ్యాహ్నం వండుకున్న కూరలు మధ్యాహ్నానికే తినేసేవాళ్లం. రాత్రికి తిరిగి వేడిగా వండుకునేవాళ్లం. అలాగే మాంసాహారమైనా! కానీ ఇప్పుడు నాన్ వెజ్ తినాలనిపిస్తే ఖరీదైన రెస్టారెంట్లకు పరిగెడుతూ ఉంటాం. అక్కడ వడ్డించే పదార్థాల్లో వాడిన కోడి మాంసం ఎప్పటిదో వండేవాళ్లకే తెలియదు. ఇలా హోటళ్లలో, రెస్టారెంట్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తయారయ్యే ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల కేన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి ప్రాసెస్ చేసిన మాంసం, పదార్థాలు, చక్కెరలు ఎక్కువగా, తాజా కూరగాయలు, పళ్లు తక్కువగా తినటం లాంటి అలవాట్లన్నీ కేన్సర్ కారకాలే! ఈ అలవాట్లకు తోడు శారీరక వ్యాయామం లోపించటం వల్ల శరీర బరువు పెరిగి కేన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయి.

నివారణ మన చేతుల్లోనే!

అధిక బరువుతో సంబంధం ఉండే కేన్సర్లకు గురి కాకుండా ఉండాలంటే తీసుకునే ఆహారం పట్ల అప్రమత్తంగా ఉండాలి. దురలవాట్లను వదిలేసి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలి. ఇందుకోసం...

- ఏడాదికి ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకుంటూ కేన్సర్‌ను ముందుగానే కనిపెడుతూ ఉండాలి.
- తాజా కూరగాయలు, పళ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెరలు తగ్గించాలి.
- శీతల పానీయాలు మానేయాలి.
- ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- వంశపారంపర్యంగా కేన్సర్ సంక్రమించే అవకాశాలున్నవాళ్లు మరింత అప్రమత్తంగా ఉండాలి.
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.
- ఏ అనారోగ్య లక్షణమైనా మూడు వారాలకు మించి తగ్గకపోతే కేన్సర్ అయి ఉండొచ్చు. కాబట్టి ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.
- ఎంత త్వరగా కేన్సర్‌ను గుర్తిస్తే, చికిత్స అంత సులభతరం అవుతుంది. చికిత్సకయ్యే ఖర్చు కూడా తక్కువగా ఉంటుంది. అలాగే నివారణ అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి.

వింటర్ కేర్

చలి పులికి దూరంగా...

ఒకసారి సోకే ఇన్‌ఫెక్షన్ వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం 10% తరుగుతూ ఉంటుంది. పదే పదే ఇన్‌ఫెక్షన్లు సోకుతూ ఉంటే ఊపిరితిత్తుల సామర్థ్యం క్రమేపీ తగ్గిపోయి, తిరిగి సరిదిద్దలేని పరిస్థితి వస్తుంది. కాబట్టి లంగ్స్‌కు ఇన్‌ఫెక్షన్ సోకితే 'మందులతో నయం చేసుకోవచ్చు' అనే ధీమా వదులుకోవాలి. సమస్య వచ్చిన తర్వాత చికిత్స తీసుకునే బదులు, ఆ సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు పాటించడం అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం....

- ముక్కు, నోరు, చెవులకు చల్లగాలి సోకకుండా స్కార్ఫ్ కట్టుకోవాలి.
- విపరీతమైన చల్లదనం ఉండే వేళల్లో బయటకు వెళ్లకూడదు. మరీ ఉదయాన్నే లేదా రాత్రి వేళ ఇంటిపట్టునే ఉండాలి.
- రెండు రోజుల్లో జలుబు తగ్గకపోయినా, జ్వరం మొదలైనా వైద్యుల్ని కలవాలి.
- ఆయాసం ఎక్కువైనా, కఫం రంగు మారినా వైద్యులను కలవటం తప్పనిసరి.
- నీళ్లు ఎక్కువగా తాగటం వల్ల కఫం తేలికగా కరిగి బయటకొస్తుంది. కాబట్టి నీళ్లు ఎక్కువ తాగాలి.
- డీప్ బ్రీదింగ్ ఎక్సర్‌సైజ్‌ల వల్ల కూడా కఫం బయటకు వచ్చేస్తుంది.



- మూసి ఉండే గదుల్లో కాకుండా గాలి, వెలుతురు ధారాళంగా ఉండే ప్రదేశాల్లో ఉండాలి.
- ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవాళ్లు చలి కాలంలో ఏసి గదులకు దూరంగా ఉండాలి. సినిమా హాళ్లు, ఆడిటోరియంలు లాంటి జన సమ్మర్థం ఉన్న ప్రాంతాలకు వెళ్లకపోవటమే మంచిది.
- అగర్‌బత్తీలు, ఇతర పొగల వల్ల ఊపిరితిత్తులు అలసటకు లోనవుతాయి. కాబట్టి పొగలకు దూరంగా ఉండాలి.
- కాలుష్యం కలగలసిన పొగమంచు...'స్మాగ్' ఊపిరితిత్తులకు చేటు చేస్తుంది. స్మాగ్ ఎక్కువగా ఉండే ఉదయం వేళల్లో బయటకు వెళ్లకపోవమే మంచిది.

హెల్తీ రెసిపి

రాగి మొలకల జావ



రక్తహీనత తొలగాలంటే ఐరన్ ఎక్కువగా తీసుకోవాలి. రాగులను ఎండబెట్టి, పిండి కొట్టించి వాడుకోడానికి బదులుగా, వాటిని మొలకెత్తించి జావ కాచుకుంటే, సమృద్ధిగా ఐరన్ సమకూరి, రక్తహీనత తొలగిపోతుంది.

- రాగులను శుభ్రం చేసుకుని, రాత్రంతా నీళ్లలో నానబెట్టాలి.
- మరుసటి రోజు శుభ్రమైన పలుచని కాటన్ టవల్‌లో రాగులను మూటగట్టి పైన బరువుంచాలి.
- తర్వాతి రోజుకి రాగులు మొలకెత్తుతాయి.
- ఇలా మొలకెత్తిన రాగులను ఒక రోజంతా నీడలో ఎండబెట్టి, పిండి కొట్టుకోవాలి.
- ఈ పిండితో జావ లేదా సంకటి తయారు చేసుకుంటే రెట్టింపు పోషకాలు, ఐరన్ అందుతాయి.

రెమెడీ

అలసిన కాళ్లకు స్వాంతన



మన శరీరంలో ఎక్కువ శ్రమకు లోనయ్యేవి కాళ్లే! శరీర బరువును మోస్తూ రోజంతా నడుస్తూ ఉండే కాళ్లు సాయంత్రానికి విపరీతంగా అలసిపోతాయి. దాంతో కాళ్ల నొప్పులు మొదలవుతాయి. ఇలాంటప్పుడు నొప్పులు తగ్గి, శక్తి పుంజుకునేలా ఈ చిట్కా పాటించండి.


- అర బక్కెట్‌లో వేడి నీళ్లు నింపి, 4 చుక్కల యూకలిప్టస్ ఆయిల్, చెరో రెండు చుక్కల పెప్పర్‌మింట్ ఆయిల్, క్లోవ్ ఆయిల్(లవంగ నూనె) వేసి, కలిపి పాదాలు మునిగేలా ఉంచాలి. 10 నుంచి 15 నిమిషాల తర్వాత కాళ్లను చల్లటి నీళ్లతో కడుక్కోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయాలి.

ఫిట్‌నెస్

చేతులు బలంగా!

చేతులు అందంగా ఉండాలంటే, కొన్ని వ్యాయామాలు చేయక తప్పదు. మరీ ముఖ్యంగా నడుము పై భాగం, చేతులు, మోచేతి పైన ఉండే మూడు కండరాల సముదాయం 'ట్రైసెప్స్' చక్కని ఆకృతి సంతరించుకోవాలంటే 'ఛెయిర్ డిప్స్' వ్యాయామం చేయాలి. ఇందుకోసం...

- బలంగా ఉండే కుర్చీని ఎంచుకోవాలి.
- కుర్చీని ఆనుకుని నేల మీద కూర్చుని, కాళ్లను పొడవుగా చాపి, రెండు చేతులను కుర్చీ మీద ఉంచి, చేతుల సహాయంతో శరీరాన్ని పైకి లేపాలి.



- పైకి లేచి, కిందకి కుంగేటప్పుడు కాళ్లు రెండు మోకాళ్ల దగ్గర వంచాలి.
- ఇలా చేస్తున్నప్పుడు పూర్తి శరీర బరువు చేతుల మీద పడుతుంది.
- ఇలా 20 సార్లు, వరుసగా 3 సెట్లు చేయాలి.
- ఈ వ్యాయామం వల్ల భుజాలు, వెన్ను, చేతుల్లోని కండరాలు బలపడతాయి.

రచ్చ గెలిచి ఇప్పుడు ఇంట గెలిచా

చిరంజీవి



'ఏఎన్నార్ నేషనల్ అవార్డును' సోమవారం బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా చిరంజీవి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఏయన్నార్ అవార్డు దక్కడం నా పూర్వజన్మ సుకృతం. అమితాబచ్చన్ చేతుల మీదుగా ఈ అవార్డుని తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. మై గురు, మై మెంటర్ మై ఇన్స్పిరేషన్ అమితాబ్ బచ్చన్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. పద్మభూషణ్ అవార్డు వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అమితాబ్ బచ్చన్ 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్' సినిమా అని చెప్పడం నేను ఎప్పటికీ మర్చిపోలేను. నిజానికి ఆ మాట విని షేక్ అయ్యాను. ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఆ రోజు నేను ఆయనకి థాంక్స్ చెప్పానో లేదో కూడా తెలీదు. ఇండియన్ సినిమా లెజెండ్ అమితాబ్ బచ్చన్ నుంచి ఆ మాటలు రావడం ఎంతో స్ఫూర్తినిచ్చాయి. ఆయనతో గడిపిన ప్రతి క్షణం నాకు ఎంతో విలువైనది. నేను హిందీలో చేసిన 'ప్రతిబంధ్' సినిమా అమితాబ్‌కు చూపించా. ఆయన.. 'అద్భుతమైన సినిమా' అని ప్రశంసించారు. మా ఇంట్లో జరిగే ప్రతి శుభకార్యానికి ఆయన ఆశీర్వాదాలు తప్పకుండా ఉంటాయి. అమితాబ్ బచ్చన్ 'సైరా' సినిమాలో ఒక కామియో రోల్ చేశారు. ఆయనని ఎలా అడగాలో తెలియక మెసేజ్ పెట్టాను. అది చూసిన వెంటనే ఆ క్యారెక్టర్ చేస్తానని మాటిచ్చారు. సినిమా అంతా పూర్తయిన తర్వాత ఫార్మాలిటీస్ గురించి అడిగాను. 'నీపై ఉన్న ప్రేమతో చేశాను. యు ఆర్ మై ఫ్రెండ్. ఫార్మాలిటీస్ గురించి మాట్లాడొద్దు' అని చెప్పారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆయనకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవుడ్ని కోరుకుంటున్నాను. లాంగ్ లీవ్ అమితాబ్. తెలుగులో ఇంట గెలిచి రచ్చ గెలవాలి అని ఓ నానుడి ఉంది. నా విషయంలో రచ్చ గెలిచి ఇప్పుడు ఇంట గెలిచానేమో అనిపిస్తోంది.



నాన్న మెచ్చుకొనేవారు కాదు

నటుడిగా నేను ఎదుగుతున్న సమయంలో బయట ప్రేక్షకులు, సన్నిహితుల నుంచి ప్రశంసలు వచ్చేవి. అయితే ఇంటికి వెళ్లినప్పుడు మా నాన్న సినిమాలు చూసి పొగుడుతారేమో అని అనుకునేవాణ్ని. మా నాన్నకు నటన అంటే చాలా ఇష్టం. అలాంటి మా నాన్న నన్ను ఎందుకు మెచ్చుకోరు అనిపించేది. ఓ రోజు ఇంటికి వెళ్లినప్పుడు నా కవర్ పేజీలతో నిండి ఉన్న కొన్ని పుస్తకాలను చూస్తున్నారు. నేను వెళ్లేసరికి తీసి పక్కన పడేశారు. ఫొటోలు బాగున్నాయిరా అని ఓ మాట అంటారేమో అని అనుకున్నాను. కానీ ఆయన అలా అనలేదు. లోపలకు అమ్మ దగ్గరకు వెళ్లి.. 'ఏంటమ్మా నాన్న ఎప్పుడూ నా గురించి ఓ మాట అనరు, బాగుందని కూడా చెప్పరు' అని అడిగాను. బయట రచ్చ ఎంత గెలిచినా సరే.. ఇంట గెలవడం లేదు అని బాధ కలుగుతోంది అని అన్నాను. దానికి అమ్మ 'లేదురా నాన్న చాలా పొగుడుతారు. ఏం చేశాడు నా కొడుకు, అదరగొట్టేశాడు' అని అంటుంటారు అని చెప్పింది. మరి నా దగ్గర ఆ మాటలు అనొచ్చు కదా అని అమ్మను అంటే 'బిడ్డల్ని తల్లిదండ్రుల్ని పొగడకూడదు. అది వారికి ఆయుక్షీణం" అని అమ్మ చెప్పింది.

ఆ అవార్డు క్యాప్సుల్ బాక్స్‌లో పడేశా


సినిమా పరిశ్రమలో నేను తొలుత రచ్చ గెలిచాను. నా ఇల్లు అనుకునే పరిశ్రమలో నాకు ఆ అవకాశం టాలీవుడ్ వజ్రోత్సవాల సమయంలో వచ్చింది. లెజెండరీ పురస్కారం ప్రదానం చేశారు. ఆ సమయంలో చాలా ఆనందమేసి ధన్యుణ్ని అనుకున్నా. కానీ ఆ రోజు నేను ఆ అవార్డును అందుకోవడం కొందరికి నచ్చలేదు. అందుకే ఆ అవార్డుని ఓ క్యాప్సుల్ బాక్స్‌లో పడేసి నాకు సరైన అర్హత ఎప్పుడు వస్తుందో అప్పుడు తీసుకుంటాను అని చెప్పాను. ఈ రోజు 'ఏఎన్నార్ అవార్డు'ను అమితాబ్ బచ్చన్ చేతులు మీదుగా అందుకున్నప్పుడు.. 'నేను ఇంట గెలిచాను.. రచ్చ గెలిచాను' అని అనిపిస్తోంది. అందుకే ఈ పురస్కారం గురించి చెప్పడానికి నాగార్జున, వెంకట్ ఇంటికి వచ్చినప్పుడు నేను చాలా భావోద్వేగానికి లోనయ్యాను. నా వాళ్లు నన్ను గుర్తించి నాకు అవార్డు ఇస్తుండటం గొప్ప విషయం. అందుకే ఇది నాకు అన్ని పురస్కారాలకు విలువైనది. ఈ వేడుకలో అమ్మని ముందు సీటులో కూర్చోబెట్టడానికి ప్రధాన కారణం.. అమ్మ నాగేశ్వరరావుకి సీనియర్ మోస్ట్ ఫ్యాన్. దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబచ్చన్.. ఇలా ఎంతో గొప్ప వ్యక్తులకి వచ్చిన ఈ అవార్డు నాకు దక్కడం నా అదృష్టం. ఈ అవార్డు రావడంతో నా సినీ జీవితానికి ఒక పరిపూర్ణత ఏర్పడిందని భావిస్తున్నాను అని అన్నారు. "ఇండియన్ సినిమాకి నాగేశ్వరరావు చేసిన సేవలు అనితర సాధ్యం. నాగేశ్వరరావు వారసత్వాన్ని కొనసాగిస్తున్న నాగార్జునకి నా అభినందనలు" అని అమితాబ్‌బచ్చన్ అన్నారు. "ఏయన్నార్ అనే ఈ మూడక్షరాలే నాకు ప్రపంచం. నాకే కాదు మా కుటుంబం,స్నేహితులు, అభిమానులు అందరికీ. మా నాన్న మానవత్వాన్ని.. మనుషుల్ని.. సినిమాలను ఎక్కువగా నమ్మారు. భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండే అలాంటి గొప్ప వ్యక్తులని గౌరవించడం ఏయన్నార్ అవార్డు ముఖ్య ఉద్దేశం" అని నాగార్జున తెలిపారు.

కామన్ మ్యాన్ కథ



దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నాగవంశీ నిర్మించారు. ఈనెల 31న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో మీడియాతో ముచ్చటించారు నటి మీనాక్షి చౌదరి. '1980 -90 నేపథ్యంలో సాగే కథ. ఈ మూవీలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇందులో నేను మధ్య తరగతి గృహిణిగా నటించా. సవాల్ విసిరిన పాత్ర ఇది. డబ్బు కారణంగా మధ్యతరగతి మనిషి జీవితంలో, అతని కుటుంబంలో ఎలాంటి మార్పులు వచ్చాయనే దాని చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నేను మొదటిసారి తల్లి పాత్ర పోషించాను. ఇది నాకు కొంచెం ఛాలెంజింగ్‌గా అనిపించింది. నా చిన్నప్పుడు మా అమ్మ ఎలా ఉండేదో తెలుసుకొని, అందుకు తగ్గట్టుగా పాత్రలో ఒదిగిపోయాను. ఇందులో నేను పోషించిన సుమతి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండి పోతుంది. ఫలానా పాత్రే చేయాలి...నా వయసుకు తగ్గ పాత్రలే చేయాలనే రూల్ పెట్టుకోలేదు. మంచి సినిమాలో భాగం కావాలి. దక్కిన పాత్రకు న్యాయం చేయాలి. ఇదే మొదటి నుంచి నేను ఫాలో అయ్యేది. మొదటి నుంచి నా ఆలోచన ఏంటంటే మంచి కథలు చేయాలి, మంచి టీమ్‌తో పనిచేయాలి. వయసుకు తగ్గ పాత్రలే చేయాలనే పరిమితిని నటులు పెట్టుకోకూడదు. ఒకే తరహా పాత్రలు చేస్తే నటులకే కాదు, ప్రేక్షకులకు కూడా బోర్ కొడుతుంది. అందుకే నటిగా పాత్రల ఎంపికలో వైవిధ్యం చూపించాలని అనుకుంటున్నాను. అందుకు తగ్గట్టుగానే సినిమాలను ఎంచుకుంటున్నా. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. భాస్కర్ దగ్గర ఏమీ లేనప్పుడు తనని తనుగా ఇష్టపడుతుంది సుమతి. ప్రేమను పంచే కుటుంబం, బతకడానికి అవసరమైన డబ్బు ఉంటే చాలు అనుకునే స్వభావం తనది. అయితే దురాశ, డబ్బు కారణంగా భాస్కర్-సుమతి మధ్య ఏం జరిగిందనేది సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది. చిత్రంలో ఎమోషన్స్ బాగుంటాయి, ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉంటాయి. చూసిన ప్రతి ఒక్కరికీ సినిమా కనెక్ట్ అవుతుంది. ఇదొక కామన్ మ్యాన్ కథ. ఈ సినిమాతో నాకు నటిగా మంచి గుర్తింపు వస్తుందని, మరిన్ని మంచి కథలు వస్తాయని భావిస్తున్నా' అని చెప్పారు మీనాక్షి చౌదరి.

సంక్రాంతికి సిద్ధం



విక్టరీ వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో దిల్ రాజు సమర్పణలో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం షూటింగ్ పార్ట్ దాదాపు పూర్తయింది. తాజాగా డబ్బింగ్ కూడా ప్రారంభించారు. ఈ ట్రయాంగిల్ క్రైమ్ డ్రామాలో వెంకటేశ్ భార్యగా ఐశ్వర్య రాజేశ్, మాజీ గర్ల్ ఫ్రెండ్‌గా మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతుందని నిర్మాత శిరీష్ చెప్పారు.

కావాలంటే నన్ను గిచ్చి చూడండి



హీరోయిన్లకు నెటిజన్ల నుంచి ప్లాస్టిక్ సర్జరీ కామెంట్ల రూపంలో ఎదురవుతున్న కొత్త తలనొప్పి రోజురోజుకీ ఎక్కువవుతోంది. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పైన నెటిజన్లు విమర్శలు చేశారు. అలాగే కెరీర్ ఆరంభంలో నయనతార కూడా ప్లాస్టిక్ సర్జరీ చేసుకుందని నెటిజన్లు చేసిన విమర్శలపై నయనతార స్పందించారు. "నా కనుబొమలు అంటే నాకు చాలా ఇష్టం. ప్రతీ రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు నా కనుబొమల షేప్‌ను తప్పనిసరిగా మారుస్తుంటాను. కనుబొమల లుక్ మారినప్పుడల్లా ముఖం కొత్తగా కనిపిస్తుంటుంది. అందుకే చాలా మంది నా ముఖం మారినట్లు.. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు భావిస్తారు. అయితే అది నిజం కాదు. ఒక్కోసారి డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావొచ్చు. ఒకసారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తాయి. మరోసారి అవి లోపలికి పోయినట్లు అనిపిస్తాయి. కావాలంటే మీరు నన్ను గిచ్చి చూడొచ్చు. నా బాడీలో అణువంత కూడా ప్లాస్టిక్ ఉండదు" అని నయనతార చెప్పారు.

క్షమాపణ చెబుతా



పొట్టేల్ చిత్రం సక్సెస్ మీట్‌లో సినిమా రివ్యూల మీద, రివ్యూ రైటర్స్ మీద చౌకబారు వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ సోమవారం స్పందిస్తూ ఒక వీడియో విడుదల చేశారు. సినిమా ఎలా తీయాలో తెలియని వారంతా రివ్యూలు రాస్తున్నారని, సినిమా సమీక్షలు ఆపేయాలని అంటూ ఆ వేదికపై మాట్లాడి బాధ కలిగించినందుకు శ్రీకాంత్ అయ్యంగార్ ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే అందరికీ బేషరతుగా క్షమాపణలు చెబుతానని ఆని ఆయన ఆ వీడియోలో పేర్కొన్నారు.

నాదీ గ్యారంటీ



హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. ఈ నెల 31న రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ మీడియాతో మాట్లాడారు. 'క సినిమా టైటిల్ జస్టిఫికేషన్ నా పేరు కాదు, టైటిల్ అలా కుదిరింది. దర్శకులు సందీప్, సుజీత్ కథ చెప్పినప్పుడు నెక్స్ట్ ఏం జరుగుతుందనేది ఊహించలేకపోయాను. నేను ఇలా జరుగుతుందేమో అనుకుంటే మరో ట్విస్ట్ వచ్చింది. ఇలాంటి పాయింట్‌తో 70వ దశకం నేపథ్యంలో కొత్తగా మూవీ ప్లాన్ చేసుకోవచ్చు అనే ఫీలింగ్ కలిగింది. దర్శకులు చెప్పిన షాట్ మేకింగ్ కూడా కొత్తగా అనిపించింది. ప్రేక్షకులు ఈ కథను తప్పకుండా బాగా రిసీవ్ చేసుకుంటారని నమ్మాం. క్లైమాక్స్‌ను కొత్తగా చెప్పడానికి ప్రయత్నించాం. ఇలాంటి క్లైమాక్స్‌తో ఇంతవరకు ఏ మూవీ రాలేదు. క్లైమాక్స్‌ని కొత్తగా చెప్పడానికి ప్రయత్నించాం. అది జెన్యూన్‌గా ప్రేక్షకులకు రీచ్ అవుతుందని నమ్ముతున్నాం. అందుకు నాదీ గ్యారంటీ' అని చెప్పారు కిరణ్ అబ్బవరం.

గొప్ప సినిమాను ఇవ్వాలని చేసిన ప్రయత్నం



తమిళ నటుడు సూర్య హీరోగా శివ దర్శకత్వంలో తెరకెక్కిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'కంగువ'. బాబీ డియోల్, దిశాపటానీ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని కే.ఈ.జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్, నిర్మించారు. వచ్చే నెల 14న విడుదలవుతోందీ సినిమా. ఈ సందర్భంగా వైజాగ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో హీరో సూర్య మాటాడుతూ "కంగువ' డబ్బు కోసం చేసింది కాదు. మీ అందరికీ ఒక గొప్ప సినిమాను ఇవ్వాలని చేసిన ప్రయత్నం. థియేటర్లలో అద్భుతమైన అనుభూతిని పంచే చిత్రమిది" అని చెప్పారు. "ప్రతీ దర్శకుడికి జీవితాంతం గుర్తుండిపోయేలా ఒక సినిమా తీయాలని ఉంటుంది. నాకు 'కంగువ' అలాంటిదే" అని దర్శకుడు శివ అన్నారు. "ఇలాంటి భారీ చిత్రాన్ని తీయడానికి ఒక కారణం మీరు చూపించే అభిమానమైతే.. మరో కారణం దర్శకుడు రాజమౌళి అందించిన స్ఫూర్తి. సినిమా అందరికీ తప్పకుండా నచ్చుతుంది" అని నిర్మాత కే.ఈ.జ్ఞానవేల్ రాజా తెలిపారు.

టీ-శాట్‌లో ఉన్నత విద్య ప్రసారాలు

- అదే వెబ్‌సైట్లో పరీక్షల ఫలితాలు
- ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు బాల కృష్ణారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య ప్రసారాలను టీ-శాట్ ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య వి.బాల కృష్ణారెడ్డి తెలిపారు. తెలంగాణలోని ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యను టీ-శాట్ ద్వారా అందించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. అంబేడ్కర్ వర్సిటీ ప్రాంగణంలోని టీ-శాట్ కార్యాలయాన్ని ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఈ.పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌తో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. టీ-శాట్ పనితీరు.. ప్రాథమిక, ఇంటర్ విద్య, పోటీ పరీక్షలు, ఇతర విభాగాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో బాల కృష్ణారెడ్డి బృందానికి టీ-శాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి వివరించారు. భవిష్యత్తులో నాణ్యమైన డిజిటల్ కంటెంట్‌ను ఉన్నత విద్యనభ్యసించే వారికి అందించే విధంగా ఉమ్మడి ప్రణాళికను సిద్ధం చేసుకుందామని, ప్రవేశ పరీక్షల ఫలితాలను టీ-శాట్ వెబ్‌సైట్ ద్వారా విడుదల చేయాలని వేణుగోపాల్ రెడ్డి కోరగా.. బాల కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉన్నత విద్యకు సంబంధించి 52 మాడ్యూల్స్ కంటెంట్ అందుబాటులోకి తెచ్చే విధంగా ఏరాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా బాల కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

గృహ విద్యుత్ చార్జీలు పెరగలే!

(మొదటిపేజీ తరువాయి)

జరిపింది. దాంతోపాటు మొత్తం 8 పిటిషన్లపై సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. ఆ ఉత్తర్వుల ప్రకారం..

- ఎల్‌టీ-2 (నాన్ డొమెస్టిక్/కమర్షియల్)లో 50 యూనిట్ల దాకా వినియోగించే వారి నుంచి రూ.60 స్థిరచార్జీగా వసూలు చేస్తుండగా దాన్ని రూ.30కి కుదించారు.
- ఎల్‌టీ-3 (ఇండస్ట్రీ)లో పుట్టగొడుగులు, కుందేలు పెంపకం ఫామ్‌ల కనెక్టెడ్ లోడ్ సామర్థ్యాన్ని 10 హెచ్‌పీ నుంచి 25 హెచ్‌పీకి పెంచారు. గొర్రెల పెంపకం యూనిట్లకు 15 హెచ్‌పీ నుంచి 25 హెచ్‌పీకి పెంచారు.
- ఎల్‌టీ-5 (అగ్రికల్చర్) కేటగిరిలో నర్సరీలకు లోడ్‌ను కూడా 15 హెచ్‌పీ నుంచి 20 హెచ్‌పీకి పెంచారు.
- ఈవీ చార్జింగ్ కేంద్రాలకు కిలోవాట్‌కు రూ.50 చొప్పున వసూలు చేస్తున్న స్థిరచార్జీని తొలగించాలన్న డిస్కమ్‌ల ప్రతిపాదనను ఈఆర్‌సీ ఆమోదించింది.
- డిమాండ్ లేని సమయంలో రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల దాకా విద్యుత్‌ను వినియోగించే వర్గాలకు.. ప్రధానంగా హెచ్‌టీ(హైటెన్షన్) వర్గాలకు యూనిట్‌కు రూ.1 చొప్పున ఇస్తున్న రాయితీని రూపాయిన్నరకు పెంచారు.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో కరెంట్ కొనుగోళ్లకు రూ.36,934.46 కోట్లు ఖర్చవగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.42,702.21 కోట్లు అవుతాయని డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. కానీ, ఈఆర్‌సీ రూ.40,714.23 కోట్లకు ఆమోదించింది.
- 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఆదాయ అవసరాలు రూ.57,728.90 కోట్లుగా డిస్కమ్‌లు క్లెయిమ్ చేయగా.. రూ.54,183.28 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది.
- రెవెన్యూలోటును రూ.13,022 కోట్లుగా చూపించగా.. రూ.11,156.40 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదించింది.
- డిస్కమ్‌లకు రూ.11,499.52 కోట్లను సబ్సిడీగా ఇవ్వడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో ఉత్తర డిస్కమ్(వరంగల్)కు రూ.7,141.35 కోట్లు, దక్షిణ డిస్కమ్(హైదరాబాద్)కు రూ.4015.06 కోట్లు, సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ(సెస్)కు రూ.343.11 కోట్లు విడుదల కానున్నాయి. కాగా.. రూ.11,499 కోట్ల రాయితీలో వ్యవసాయ రంగం వాటా రూ.9800.07 కోట్లు ఉండగా... డొమెస్టిక్ వాటా రూ.1699.45 కోట్లుగా ఉంది.

హెచ్‌టీ వర్గాలకు ఊరట

హెచ్‌టీ వర్గాలకు ఈఆర్‌సీ భారీగా ఊరట కల్పించింది. హెచ్‌టీలోని అన్ని కేటగిరీలకూ చార్జీలను హేతుబద్ధీకరించాలన్న ప్రతిపాదనను తిరస్కరించింది. హెచ్‌టీ 11 కేవీ యూనిట్‌కు రూ.7.65 వసూలు చేస్తున్నట్టే. 33 కేవీ, 132 కేవీలో కూడా రూ.7.65 వసూలు చేయాలన్న ప్రతిపాదనను తోసిపుచ్చింది. ఈ చార్జీలను ఆమోదిస్తే పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతాయని పారిశ్రామిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దాంతో పాత చార్జీలను యథాతథంగా 33 కేవీకి రూ.7.15, 132 పై కేవీకి రూ.6.65 కొనసాగిస్తూ ఈఆర్‌సీ నిర్ణయం తీసుకుంది. ఈ వర్గాలకు స్థిర చార్జీలను కిలోవాట్‌కు రూ.475 నుంచి రూ.500కు పెంచుతూ నిర్ణయం వెలువరించింది.

సకాలంలో పిటిషన్లు వేయండి..

డిస్కమ్‌లకు ఈఆర్‌సీ పలు సూచనలు చేసింది. సకాలంలో పిటిషన్లు వేయాలని కోరింది. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి బకాయిలను రాబట్టుకోవాలని సూచించింది. సకాలంలో పిటిషన్లు వేయని కారణంగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రిటర్న్ ఆన్ ఈక్విటీ(పెట్టిన పెట్టుబడిపై రాబడి)పై కోత విధించింది. తెలంగాణ జెన్‌కోకు రూ.390 కోట్ల మేర, ట్రాన్స్‌కో, స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎస్‌ఎల్‌డీసీ)కి రూ.119 కోట్లు, డిస్కమ్‌ల వీలింగ్ బిజినెస్‌కు రూ.62 కోట్ల, రిటైల్ బిజినెస్‌కు రూ.7 కోట్లు కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జున్

- సర్కారు ఉత్తర్వులు జారీ.. నేడు బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) చైర్మన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దేవరాజు నాగార్జున్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో జస్టిస్ నాగార్జున్ మూడేళ్ల పాటు ఉండనున్నారు. ప్రస్తుతం ఈఆర్సీ ఛైర్మన్‌గా ఉన్న టి.శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్య పదవీకాలం మంగళవారం సాయంత్రంతో ముగియనుంది. ఆ సాయంత్రమే జస్టిస్ దేవరాజు నాగార్జున్ కొత్త చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. చైర్మన్‌గా ఆయన చేరిన తర్వాత ఇద్దరు సభ్యుల నియామకంపై ఈఆర్సీ కసరత్తు జరపనుంది. జస్టిస్ నాగార్జున్‌ను చైర్మన్‌గా నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి 2 వారాల కిందటే నిర్ణయించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తికి చెందిన జస్టిస్ నాగార్జున్.. 2022 అక్టోబరు 18న హైకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. తర్వాత 2023 ఏప్రిల్ 6న మద్రాసు హైకోర్టుకు బదిలీ అయిన ఆయన.. అక్కడే పదవీ విరమణ చేశారు. గత పదేళ్లుగా ఏపీలో హైకోర్టు మాజీ జడ్జిలే ఈఆర్సీ చైర్మన్లుగా పనిచేయగా.. తెలంగాణలో తొలిదఫాలో విద్యుత్తు రంగ నిపుణుడు, రెండో దఫాలో తెలంగాణ ఉద్యమకారుడు, న్యాయవాది శ్రీరంగారావుకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. తాజా నిర్ణయంతో ఏపీతో పాటు తెలంగాణలో హైకోర్టు మాజీ జడ్జిలే చైర్మన్లుగా ఉండనున్నారు.

ఎంసీఏ అభ్యర్థులూ ఎంటెక్ చేయొచ్చు.!

- పార్ట్‌టైమ్ అడ్మిషన్లలో అర్హత కల్పించిన జేఎన్‌టీయూ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) చేసిన అభ్యర్థులు కూడా ఎంటెక్‌లో కంప్యూటర్ సైన్స్ చదివేందుకు జేఎన్‌టీయూ వీలు కల్పించింది. సోమవారం విడుదల చేసిన పార్ట్‌టైమ్ ఎంటెక్, ఎంబీఏ ప్రవేశాల నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఇటీవల జేఎన్‌టీయూ అధికారులు స్పాన్సర్డ్ కేటగిరీలో ఎంటెక్ ప్రవేశాలకు ఎంసీఏ అభ్యర్థులు అనర్హులనడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంటెక్ చదివేందుకు తమకు అవకాశం కల్పించాలంటూ ఐఐటీల్లో, ఎన్ఐటీల్లో అవలంభిస్తున్న విధానాలను కొందరు ఎంసీఏ అభ్యర్థులు వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఉన్నతాధికారులు పార్ట్‌టైమ్ ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ ప్రవేశాలకు ఎంసీఏ అభ్యర్థులకు అర్హత కల్పించారు. మొత్తం 9 పీజీ కోర్సుల్లో ఒక్కో దాంట్లో 30 సీట్ల చొప్పున మొత్తం 270 సీట్ల భర్తీకి సోమవారం నోటిఫికేషన్ ఇచ్చారు. ఆసక్తి ఉన్న వారు వచ్చేనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని వర్సిటీ అధికారులు సూచించారు.

దాతృత్వ కార్యకలాపాల కోసం
రూ.20,000 కోట్లు



మాక్రోటెక్ డెవలపర్స్ ఎండీ అభిషేక్ లోధా
లోధా ఫిలాంత్రఫీ ఫౌండేషన్‌కు షేర్ల బదలాయింపు
టాటాలే ఆదర్శమని వెల్లడి

న్యూఢిల్లీ: స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపార దిగ్గజం అభిషేక్ లోధా, ఆయన కుటుంబం కీలక నిర్ణయం తీసుకుంది. తమ నిర్వహణలోని రియల్టీ కంపెనీ మాక్రోటెక్ డెవలపర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) ఈక్విటీలో తమకు ఉన్న 72.11 శాతం వాటాలో 18 నుంచి 19 శాతం వాటాను కుటుంబ నిర్వహణలోని స్వచ్ఛంద సేవా సంస్థ 'లోధా ఫిలాంత్రఫీ ఫౌండేషన్' (ఎల్‌పీఎఫ్)కు బదలాయించాలని నిర్ణయించింది. సోమవారం నాటి బీఎస్ఈ క్లోజింగ్ ధర ప్రకారం చూస్తే ఈ షేర్ల విలువ రూ.20,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఏటా ఈ షేర్లపై వచ్చే డివిడెండ్, ఇతర ఆదాయాన్ని ఎల్‌పీఎఫ్ విద్య, మహిళా సాధికారిత, స్థిరమైన పట్టణాభివృద్ధి వంటి కార్యకలాపాల కోసం ఖర్చు చేస్తుంది.

కాగా ఈ విషయంలో తమకు టాటాలే ఆదర్శమని ఎండీఎల్ ఎండీ అండ్ సీఈఓ అభిషేక్ లోధా చెప్పారు. 'టాటా కుటుంబం వందేళ్ల క్రితం తమ నిర్వహణలోని కంపెనీల్లో తమకు ఉన్న వాటా నుంచి పెద్ద మొత్తాన్ని టాటా ట్రస్టులకు బదిలీ చేసింది. ఈ కంపెనీల నుంచి వచ్చే ఆదాయాన్ని టాటా ట్రస్టులు అనేక సత్కార్యాలకు వినియోగిస్తూ దేశాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ విషయంలో టాటాలే నాకు ఆదర్శం, ప్రేరణ' అన్నారు. వచ్చే ఏడాది జనవరి కల్లా ఎల్‌పీఎఫ్‌కు ఒక సలహా బోర్డును ఏర్పాటు చేసి వివిధ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు.

ఇదీ ప్రస్థానం

2013లో ఏర్పాటైన ఎల్‌పీఎఫ్ ఇప్పటికే అనేక సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 'లోధా ఉన్నతి' అనే కార్యక్రమం ద్వారా కంపెనీల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తోంది. ఇనిస్టిట్యూట్ అప్లయిడ్ మ్యాథమ్యాటిక్స్ (ఐఏఎం) అనే సంస్థ ద్వారా దేశ, విదేశాల్లోని ప్రముఖ గణిత శాస్త్రవేత్తలను ఒక చోటికి చేర్చి ఆ రంగంలో పరిశోధనలకు తోడ్పడుతోంది. లోధా జీనియస్ ప్రోగ్రామ్ పథకం ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తోంది. తాజాగా మాక్రోటెక్ డెవలపర్స్ ఈక్విటీలో రూ.20,000 కోట్ల విలువైన వాటా బదిలీతో వచ్చే ఆదాయంతో మరిన్ని సామాజిక అభివృద్ధి కార్యకలాపాలు ప్రారంభించాలని యోచిస్తోంది.

ఎస్ఎస్ఈల ద్వారా రూ.22 కోట్లు
సెబీ ఈడీ ఎస్‌వీఎండీ రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లాభాపేక్ష లేని సంస్థలు (ఎన్‌పీఓ) చేపట్టే సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణ కోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) అమలు చేస్తున్న సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎస్ఎస్ఈ) పథకం బాగా ఉపకరిస్తోంది. ఇప్పటి వరకు 10 ఎన్‌పీఓలు ఈ పథకం ద్వారా రూ.22 కోట్లు సమీకరించాయి. 'యాక్సిలరేటింగ్ సోషల్ ఇంపాక్ట్ విత్ సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీ' పేరుతో హైదరాబాద్‌లో ఎన్ఎస్ఈ నిర్వహించిన సదస్సులో సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎండీ రావు ఈ విషయం తెలిపారు. విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, గిరిజన అభివృద్ధి వంటి కార్యక్రమాల కోసం నిధులు సమీకరించే ఎన్‌పీఓలకు ఎస్ఎస్ఈ చక్కటి మార్గమన్నారు. ఈ మార్గంలో నిధులు సమీకరించేందుకు ఇప్పటికే 80 ఎన్‌పీఓలు ఎస్ఎస్ఈలో నమోదయ్యాయి. మరో వంద ఎన్‌పీఓలు ఇందుకోసం దరఖాస్తు చేసుకున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,800 ▼	73,150 ▼	1,07,000 ▼
ముంబై	78,245 ▲	71,672 ▲	96,086 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	550
వరంగల్	527	గోదావరి	545
చిత్తూరు	578	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	123	విజయవాడ	120
వరంగల్	123	గుంటూరు	123
కరీంనగర్	123	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	123	చిత్తూరు	126
కర్నూలు	123	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	120		

బీఏఎస్ఎఫ్‌తో ఏఎం గ్రీన్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీకి చెందిన పారిశ్రామిక దిగ్గజం బీఏఎస్ఎఫ్.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఏఎం గ్రీన్ కంపెనీ మధ్య ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఎంఓయూ ద్వారా భారత్‌లో పునరుత్పాదక ఇంధన వనరుల సాయంతో తక్కువ కార్బన్ ఉండే రసాయనాల ఉత్పత్తి, వాటికి సంబంధించిన టెక్నాలజీల అభివృద్ధికి ఉన్న అవకాశాలను రెండు సంస్థలు అన్వేషిస్తాయి. అలాగే ఏఎం గ్రీన్ నుంచి ఏటా లక్ష టన్నుల గ్రీన్ అమ్మోనియాను దిగుమతి చేసుకునే విషయాన్ని బీఏఎస్ఎఫ్ పరిశీలిస్తుంది. ఈ అమ్మోనియా యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రామాణికాలకు అనుగుణంగా ఉంటుందని ఒప్పందంలో పేర్కొన్నారు.

భెల్ లాభం రూ.106 కోట్లు

ప్రభుత్వ రంగంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బెల్) సెప్టెంబరు త్రైమాసికంలో రూ.106.15 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.63.01 కోట్ల నష్టం ప్రకటించింది. త్రైమాసికాదాయం రూ.5,305.38 కోట్ల నుంచి రూ.6,695.37 కోట్లకు పెరిగింది.

7.2 శాతం వృద్ధి కష్టమే

నోమురా

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ "వృద్ధిలో కాలానుగుణమైన మందగమన" స్థితిలోకి ప్రవేశించిందని, ఈ కారణంగా ఆర్‌బీఐ అంచనా వేసిన మేరకు 7.2 శాతం వృద్ధిని నమోదు చేయడం కష్టమేనని జపాన్‌కు చెందిన బ్రోకరేజీ సంస్థ నోమురా అంటోంది. వృద్ధిపై ఆర్‌బీఐ అంచనా "మితి మీరిన ఆశావహ" వైఖరిగా పేర్కొంది. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో ఈ ఏడాది భారత జీడీపీ 6.7 శాతం ఉండవచ్చని, వచ్చే ఏడాది అది 6.8 శాతంగా నమోదు కావచ్చని అంచనా వేసింది. పట్టణ ప్రాంతాల్లో వినియోగం ఇటీవల కాలంలో క్షీణించడం, వాహన అమ్మకాల్లో క్షీణత, విమాన ప్రయాణికుల సంఖ్య తగ్గడం ఇందుకు కారణాలని పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ నుంచి కొత్త ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ 'బిక్సిబ్యాట్' పేరుతో కొత్త ఔషధాన్ని దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీర్ఘకాలిక మలబద్ధకాన్ని నివారించడంలో ఈ ఔషధం బాగా పని చేస్తుందని తెలిపింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) ఆమోదంతో కంపెనీ ఈ ఔషధాన్ని విడుదల చేసింది. దీర్ఘకాలిక మలబద్ధక నివారణకు ఒక ఫార్మా కంపెనీ దేశీయ మార్కెట్లోకి ఈ తరహా ఔషధాన్ని విడుదల చేయడం ఇదే మొదటిసారి.

'అజిముత్ ఏఐ'లో సైయెంట్‌కు వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సైయెంట్ తన సెమీకండక్టర్ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా అప్లికేషన్ స్పెసిఫిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (ఏఎస్ఐసీ) అభివృద్ధిలో మంచి పట్టున్న 'అజిముత్ ఏఐ' కంపెనీ ఈక్విటీలో 27.3 శాతం వాటా తీసుకుంది. ఈ సర్క్యూట్స్‌ను పవర్, ఎనర్జీ ఎఫిషియెంట్ సొల్యూషన్స్‌లో విరివిగా ఉపయోగిస్తారు. ఇది తమ వ్యూహాత్మక సెమీకండక్టర్ వ్యాపార విస్తరణకు తోడ్పడుతుందని సైయెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, ఎండీ బీ కృష్ణ తెలిపారు. అయితే ఈ వాటా కోసం ఎంత మొత్తం చెల్లించిందీ రెండు కంపెనీలు వెల్లడించలేదు.

రూ.4.21 లక్షల కోట్ల లాభం
సెన్సెక్స్ 602 పాయింట్ల వృద్ధి.. 5 రోజుల తర్వాత లాభాల్లోకి సూచీలు



ముంబై: గత వారంలో వరుసగా ఐదు రోజులు నష్టాల్లో పయనించిన స్టాక్ మార్కెట్.. ఎట్టకేలకు లాభాల బాటపట్టింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల (డీఐఐ) కొనుగోళ్లతో పాటు రిటైల్ ఇన్వెస్టర్ల విలువ ఆధారిత కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 1,137.52 పాయింట్ల వరకు పెరిగి 80,539.81 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 602.75 పాయింట్ల లాభంతో 80,005.04 వద్ద ముగిసింది. నిఫ్టీ 158.35 పాయింట్ల వృద్ధితో 24,339.15 వద్ద స్థిరపడింది.

కొనుగోళ్ల జోరుతో స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.21 లక్షల కోట్లు పెరిగి రూ.441.20 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) పెరిగింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 రాణించాయి.

వారీ ఎనర్జీస్ లిస్టింగ్ అదుర్స్

సోలార్ ప్యానెళ్ల తయారీదారు వారీ ఎనర్జీస్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్ దుమ్మురేపింది. కంపెనీ సోమవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.1,503తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 69.66 శాతం వృద్ధితో రూ.2,550 వద్ద లిస్టయింది. ఆ తర్వాత 72.98 శాతం ఎగబాకి రూ.2,600 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ నిలిచే సరికి కంపెనీ షేరు ధర 55.47 శాతం లాభంతో రూ.2,336.80 వద్ద స్థిరపడింది.

1 దీపక్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఐపీఓ ధర రూ.203తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 2.21 శాతం నష్టంతో రూ.198.50 వద్ద లిస్టయింది. ఒక దశలో 21.10 శాతం వరకు క్షీణించిన షేరు చివరికి 20.24 శాతం నష్టంతో రూ.161.90 వద్ద ముగిసింది.

స్విగ్గీ ఐపీఓ ధర రూ.371-390
వచ్చే నెల 6 నుంచి ఇష్యూ షురూ!
రూ.11,300 కోట్ల సమీకరణ లక్ష్యం



ఇంటి వద్దకే ఆహారం, కిరాణా సరుకుల డెలివరీ అందించే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే నెల 6న ప్రారంభమై 8న ముగియవచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, కంపెనీ ఐపీఓ ధరల శ్రేణిని రూ.371-390గా నిర్ణయించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.11,300 కోట్లు సమీకరించాలనుకుంటోంది. అందులో రూ.4,500 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.6,800 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది.

ఓఎఫ్ఎస్ మార్గంలో షేర్లను విక్రయించనున్న కంపెనీ ఇన్వెస్టర్ల జాబితాలో యాక్సెల్ ఇండియా, అపోలెట్టో ఏషియా లిమిటెడ్, ఆల్ఫా వేవ్ వెంచర్స్ కోట్ పీఈ ఏషియా, డీఎస్‌టీ యూరోఏషియా, ఎలివేషన్ క్యాపిటల్, ఇన్‌స్పైర్డ్ ఎలైట్ ఇన్వెస్ట్‌మెంట్, ఎంఐహెచ్ ఇండియా ఫుడ్ హోల్డింగ్స్, నార్త్‌వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్, టెన్సెంట్ క్లౌడ్ యూరప్ ఉన్నాయి. కాగా, జపాన్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ మాత్రం తన వాటాను అలాగే కొనసాగించనుంది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓకు సెబీ ఆమోదం

ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీకి చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీతో పాటు విద్యారుణాలందించే ఎన్‌బీఎఫ్‌సీ అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించనుంది. అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సేకరణ లక్ష్యం రూ.3,500 కోట్లు. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ పూర్తిగా తాజా ఈక్విటీ జారీ కాగా.. అవాన్స్ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత షేర్‌హోల్డర్లకు చెందిన రూ.2,500 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనుంది.

పీఎన్‌బీ లాభం రెండింతలు

సెప్టెంబరు త్రైమాసికంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రెండింతలు పెరిగింది. వడ్డీల ద్వారా ఆదాయం గణనీయంగా పెరగడంతో ఈ కాలంలో రూ.4,306 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,756 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ ఆదాయం కూడా రూ.29,875 కోట్ల నుంచి రూ.34,447 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.26,355 కోట్ల నుంచి రూ.29,875 కోట్లకు చేరిందని పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయెల్ తెలిపారు. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.10,517 కోట్లుగా ఉండగా ఈ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం రూ.4,000 కోట్ల మొండి బకాయిలు వసూలు చేసింది. స్థూల ఎన్‌పీఏలు 6.96 శాతం నుంచి 4.48 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.47 శాతం నుంచి 0.46 శాతానికి తగ్గాయి.

ఐఓసీ లాభంలో భారీ క్షీణత

రిఫైనరీ, మార్కెటింగ్ మార్జిన్లు గణనీయంగా పడిపోవడంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కన్సాలిడేటెడ్ లాభం 98.6 శాతం మేరకు పడిపోయింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన స్టాండ్‌ఎలోన్ లాభం రూ.12,967.32 కోట్లు కాగా ఈ ఏడాది కేవలం రూ.180.01 కోట్లు ఆర్జించగలిగింది. ప్రభుత్వ నియంత్రిత ధరలకు వంట గ్యాస్ విక్రయించడం కూడా మార్జిన్లు తగ్గడానికి కారణమని కంపెనీ తెలిపింది. సెప్టెంబరు త్రైమాసికాదాయం రూ.1.95 లక్షల కోట్లుంది.

ఎయిర్‌టెల్ లాభంలో 168 శాతం వృద్ధి

భారతి ఎయిర్‌టెల్ సెప్టెంబరు త్రైమాసికంలో 168% వృద్ధితో రూ.3,593 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.1,341 కోట్లు. ఆదాయం 12% వృద్ధితో రూ.41,473 కోట్లకు చేరింది. ఇటీవల టారిఫ్‌ల సవరణతో ఒక్కో వినియోగదారునిపై ఆదాయం రూ.233కి పెరిగింది.

స్పోర్ట్స్



టీ20 జట్టు కోచ్‌గా లక్ష్మణ్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాలో పర్యటించే భారత టీ20 జట్టుకు ప్రధాన కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరించనున్నాడు. వచ్చే నెల 8,10,13,15 తేదీల్లో ఇరు జట్ల మధ్య నాలుగు టీ20ల సిరీస్ జరుగుతుంది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో యువ ఆటగాళ్లు ఈ సిరీస్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. మరోవైపు రోహిత్ శర్మ కెప్టెన్సీలో సీనియర్ జట్టు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఆడేందుకు నవంబరు 10 లేదా 11న ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉంది. అదే నెల 22 నుంచి ఈ ఐదు టెస్టుల సిరీస్ జరుగుతుంది. దీంతో ప్రధాన కోచ్ గంభీర్‌కు ఇరు జట్లతో ఉండడం వీలు కాదు కాబట్టి లక్ష్మణ్‌కు యువ జట్టు బాధ్యతలు అప్పగించారు. ద్రవిడ్ హయాంలోనూ లక్ష్మణ్ పలుమార్లు కోచ్‌గా వ్యవహరించాడు. ఇక సహాయక సిబ్బందిగా సాయిరాజ్ బహుతులె, హృషికేశ్ కనిట్కర్, సుభాదీప్ ఘోష్ సఫారీ టూర్‌కు వెళ్లనున్నారు.

అనికేత్‌కు 5 వికెట్లు

ఫాలోఆన్‌లో పుదుచ్చేరి ● హైదరాబాద్‌తో రంజీ

హైదరాబాద్: అనికేత్ (5/40) చెలరేగడంతో.. హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్‌లో పుదుచ్చేరి ఫాలో ఆన్‌లో పడింది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 24/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పుదుచ్చేరి 153 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 536/8 డిక్లేర్డ్‌కు 386 వెనుకంజలో నిలిచి ఫాలో ఆన్‌లో పడింది. అజయ్ రోహేర (27) టాప్ స్కోరర్. భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పుదుచ్చేరి 171/2 స్కోరు చేసింది. సోమవారం ఆట ముగిసేసరికి శ్రీధర్ రాజు (61), అరుణ్ కార్తీక్ (14) క్రీజులో ఉన్నారు. అజయ్ (69) అర్థ శతకం సాధించాడు. తనయ్ త్యాగరాజన్ 2 వికెట్లు పడగొట్టాడు.

హిమాచల్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

కెప్టెన్ రిషి ధవన్ (195) త్రుటిలో డబుల్ సెంచరీ చేజార్చుకొన్నా.. ఆంధ్రప్రదేశ్‌తో రంజీలో హిమాచల్‌ప్రదేశ్ 134 పరుగుల ఆధిక్యం సాధించింది. ఆటకు మూడోరోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 198/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హిమాచల్‌ఆట ముగిసేసరికి 478/9 స్కోరు చేసింది. ఆకాష్ వశిష్ట్ (85), రిషి ఐదో వికెట్‌కు 141 రన్స్ జోడించారు. శశికాంత్ 4, సత్యనారాయణ 3 వికెట్లు తీశారు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 344 రన్స్ చేసింది.

కోచ్‌ల కథ
అంతులేని వ్యథ!

25 ఏళ్లుగా పెండింగ్‌లోనే రెగ్యులరైజేషన్ ఫైల్

- సర్వీసును క్రమబద్ధీకరించాలని 2008లోనే హైకోర్టు తీర్పు
- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నది 133 మంది కోచ్‌లే
- నిర్వీర్యమైన కోచింగ్ వ్యవస్థతో నష్టపోతున్న క్రీడాకారులు



ప్రపంచానికి చాంపియన్లను అందించే కోచ్‌లను గౌరవించాల్సిందిపోయి వారిని అవమానించే పరిస్థితులు దాపురించాయి. కోచ్‌ల రెగ్యులరైజేషన్ మొదలుకొని కొత్త కోచ్‌ల నియామకం వరకు ఏ పనీ చేయకుండా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుచేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆ అవసరాలకు తగ్గట్టు కోచ్‌లను ఎప్పుడు తీసుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తొమ్మిదేళ్లపాటు ఊదరగొట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైపోయింది. స్వతహాగా ఫుట్‌బాల్ ఆటగాడైన రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్ర క్రీడారంగంలో కొత్త జోష్ వచ్చింది. అయితే 25 ఏళ్లకు పైగా స్పోర్ట్స్ అథారిటీలో పెండింగ్‌లో ఉన్న కోచ్‌ల సమస్యను ప్రభుత్వం మారాక కూడా పట్టించుకోవడం లేదు.

సమైక్యాంధ్ర నుంచి నేటి వరకు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1989 వరకు నోటిఫికేషన్ ద్వారా తీసుకున్న కోచ్‌లను మూడేళ్ల సర్వీస్ అనంతరం వారి పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరించేవారు. ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న కోచ్‌లు ఆ విధంగానే సర్వీసులోకి వచ్చారు. 1989 తర్వాత 1993, 1999, 2009 సంవత్సరాలలో నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో తీసుకున్న 28 మంది కోచ్‌ల సర్వీసును మాత్రం రెగ్యులరైజ్ చేయలేదు. దీనిపై 1993, 1999 బ్యాచ్‌లకు చెందిన కోచ్‌లు 2002లో హైకోర్టును ఆశ్రయించగా 2008లో వీరి వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సీవీ రాములు ఖాళీగా ఉన్న శాంక్షన్ కోచ్‌ల పోస్టులను అప్పటికే విధుల్లో ఉన్న అర్హులైన కాంట్రాక్టు కోచ్‌లతో ఆరు వారాల లోపు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. అయితే అప్పటి ఉద్యోగుల సర్వీస్ నిబంధనల్లోని యాక్ట్-2ను సాకుగా చూపించి రెగ్యులరైజ్ చేయకుండా కొందరు కోర్టు తీర్పును పక్కదోవ పట్టించారు.

కోచ్‌లను నియమిస్తేనే..

ప్రస్తుతం రాష్ట్రం మొత్తం మీద 133 మంది కోచ్‌లే ఉన్నారు. ఇందులో 28 మంది కాంట్రాక్టు కోచ్‌లు కాగా, మిగిలిన వారు అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. వీరిలో సగానికి పైగా హైదరాబాద్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన చూస్తే కనీసం నియోజకవర్గానికి ఒక్క నిష్ణాతుడైన కోచ్ కూడా లేరు. కోచ్‌ల రిక్రూట్‌మెంట్ దీర్ఘకాలికంగా నిలిచిపోవడంతో శాట్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. తొమ్మిది జిల్లాల్లో తప్ప మిగిలిన అన్ని చోట్ల వేరే శాఖల అధికారులే డీవైఎస్ఓలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ల పోస్టుల్లో అయితే ఒక్కరు కూడా లేరు. ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీ, కొత్త క్రీడా స్కూళ్లను ప్రారంభిస్తామని ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో కనీసం 500 మంది కోచ్‌లను నియమిస్తే తప్ప రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధి సాధ్యం కాదనేది క్రీడా పండితుల అభిప్రాయం.

యాక్ట్-2 పేరిట కొర్రీలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనలకు సంబంధించిన యాక్ట్-2... 1994లో వచ్చింది. దీని ముఖ్య ఉద్దేశం నోటిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, సంబంధిత శాఖల విధివిధానాలకు విరుద్ధంగా దొడ్డిదారిన విధుల్లో చేరిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును రెగ్యులరైజేషన్ చేయడాన్ని నిరోధించడమే. ఇందులోనే సెక్షన్ 4లో ఎవరైతే నోటిఫికేషన్ ద్వారా, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా, సంబంధిత శాఖల రిక్రూట్‌మెంట్ నిబంధనలకు లోబడి తీసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించవచ్చునని స్పష్టంగా ఉంది. దీనిని పట్టించుకోకుండా శాట్ ఉన్నతాధికారులు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలకమండలికి ఊసేదీ..?

గతంలో ఉద్యోగుల నియామకాలు, రెగ్యులరైజేషన్ తదితర ముఖ్యమైన నిర్ణయాలన్నీ పాలకమండలిలో చర్చించి తీసుకునేవారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి శాట్ పాలకమండలి ఊసే లేకపోవడంతో క్రీడాభివృద్ధి కుంటుపడింది. పాలకమండలి లేక ఈ నిర్ణయాలు తీసుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా క్రీడా నిపుణులతో పాలకమండలిని ఏర్పాటు చేసి శాట్‌ను బలోపేతం చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

హాకీ కెప్టెన్ సలీమా
చాంపియన్స్ ట్రోఫీకి జట్టు ఎంపిక



న్యూఢిల్లీ : ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే మహిళల హాకీ జట్టును సోమవారం ప్రకటించారు. 18 మంది సభ్యుల జట్టుకు సలీమా టేటెను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. టోర్నమెంట్ వచ్చే నెల 11 నుంచి 20 వరకు బిహార్‌లోని నలంద జిల్లా రాజ్‌గిర్‌లో జరగనుంది. నవ్‌నీత్ కౌర్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనుంది. రాంచీలో గత సంవత్సరం జరిగిన ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్..ఈసారీ భారీ అంచనాలతో బరిలో దిగుతోంది. ఒలింపిక్స్ రజత పతక విజేత చైనా, జపాన్, కొరియా, మలేసియా, థాయ్‌లాండ్ టోర్నమెంట్‌లో తలపడుతున్న ఇతర జట్లు. 11న జరిగే తొలి మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొననుంది. సీనియర్ సవితతోపాటు యువ ప్లేయర్ బిచుదేవి ఖరిబమ్ గోల్‌కీపర్ బాధ్యతలను పంచుకుంటారు.

భారత జట్టు: గోల్‌కీపర్లు- సవిత, బిచుదేవి; **డిఫెండర్లు-** ఉదిత, జ్యోతి, వైష్ణవి విఠల్, సుశీలా చాను, ఇషికా చౌధరి; **మిడ్‌ఫీల్డర్లు-** నేహ, సలీమా టేటె, షర్మిలా దేవి, మనీషా చౌహాన్, సునేలితా టోపో, లాల్‌రెమ్‌సియామి; **ఫార్వర్డ్‌లు-** నవ్‌నీత్ కౌర్, ప్రీతీ దూబే, సంగీతా కుమారి, దీపిక, బ్యూటీ డుంగ్‌డుంగ్.

సిరీస్ ఎవరిదో?

- ఒత్తిడిలో భారత్.. జోష్‌లో కివీస్
- మూడో వన్డే నేడు

మ.1.30 నుంచి స్పోర్ట్స్ 18లో


హర్మన్ సోఫీ

అహ్మదాబాద్: బ్యాటర్ల వైఫల్యంతో రెండో వన్డేలో చిత్తుగా ఓడిన భారత మహిళల జట్టు బలంగా పుంజుకోవాలనుకొంటోంది. న్యూజిలాండ్‌తో మంగళవారం జరిగే మూడో వన్డేలో గెలిచి.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను సొంతం చేసుకోవాలనుకొంటోంది. తొలి వన్డేలో బ్యాటింగ్ విభాగం అంతగా రాణించక పోయినా.. బౌలర్లు విజృంభించడంతో భారత్ 59 పరుగుల తేడాతో గెలిచింది. అయితే, రెండో మ్యాచ్‌లో కివీస్ నిర్దేశించిన 260 పరుగుల లక్ష్య ఛేదనలో 183 రన్స్‌కే ఆలౌటైంది. లక్ష్యం భారీదే అయినా.. భారత బ్యాటర్లు పోరాడకుండానే చేతులెత్తేయడం విమర్శలకు దారితీసింది. రాధా యాదవ్, సైమా తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించకుండా ఉంటే.. పరాజయం మరింత ఘోరంగా ఉండేది. రెండు మ్యాచ్‌ల్లో చూసుకొంటే ఒక్క భారత బ్యాటర్ కూడా అర్ధ శతకం సాధించలేక పోవడం శోచనీయం. టాపార్డర్ బ్యాటర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ వైఫల్యం జట్టును దారుణంగా దెబ్బతీస్తోంది. ఈ ముగ్గురూ చెలరేగితే మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, తేజల్ దూకుడైన ఆటతో భారీ స్కోరును అందించే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో 4 వికెట్లు పడగొట్టిన రాధ నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. మరోవైపు అదిరే విజయంతో సిరీస్‌ను సమం చేసిన న్యూజిలాండ్ ఆత్మవిశ్వాసంతో ఉంది. కెప్టెన్ సోఫీ డివైన్, ఓపెనర్ సుజీ బేట్స్, ప్లిమ్మర్ చక్కని ఫామ్‌లో ఉండడంతో టీమ్ బలంగా కనిపిస్తోంది.

పాక్ కోచ్ కిర్‌స్టెన్ రాజీనామా



కరాచీ: పాకిస్థాన్ వన్డే, టీ20 జట్ల ప్రధాన కోచ్ పదవికి గ్యారీ కిర్‌స్టెన్ రాజీనామా చేశాడు. అతడి స్థానంలో ప్రస్తుత టెస్టు కోచ్ జేసన్ గిలెస్పీకే అదనపు బాధ్యతలప్పగించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కిర్‌స్టెన్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. అయితే ఆటగాళ్లతో అభిప్రాయభేదాలు రావడంతో పాటు, సెలెక్షన్ ప్యానెల్ నుంచి కూడా పీసీబీ తొలగించడంతో గ్యారీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. కిర్‌స్టెన్ హయాంలో పాక్ జట్టు ఇంగ్లండ్‌తో సిరీస్ కోల్పోవడంతో పాటు టీ20 ప్రపంచకప్‌లో యూఎస్ఏపైనా ఓటమిపాలైంది. ఇక నవంబరులో పాక్ జట్టు ఆసీస్, జింబాబ్వే పర్యటనల్లో ఆరేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. దీంట్లో ఆసీస్ టూర్‌కు మాత్రమే కోచ్‌గా ఉంటానని గిలెస్పీ పాక్ బోర్డుకు స్పష్టం చేశాడు.

కాగితం పులులు!
రోహిత్ సేనను గేలి చేసిన షెహజాద్

న్యూఢిల్లీ: స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్ట్ సిరీస్ ఓడిన రోహిత్ సేనను 'కాగితం పులులు' అంటూ పాకిస్థాన్ క్రికెటర్ అహ్మద్ షెహజాద్ గేలి చేశాడు. భారత్ ఆడిన గత రెండు టెస్టుల్లోనూ ఆటగాళ్లలో నిర్లక్ష్య ధోరణి కనిపించిందన్నాడు. 'స్కూల్ పిల్లలతో ఆడినట్టు.. సొంతగడ్డపై భారత్‌ను న్యూజిలాండ్ ఆడేసుకొంది. 'పేపర్ పులులు.. వారి పిచ్‌లపైనే కుప్పకూలారు'. మొత్తంగా భారత్ ఆటలో పోరాట స్ఫూర్తి కొరవడిందని షెహజాద్ విమర్శించాడు.



ఉత్కంఠ పోరులో టైటాన్స్ విజయం

హైదరాబాద్: ప్రొ. కబడ్డీ లీగ్ సీజన్ సోమవారంనాటి రెండో మ్యాచ్ అభిమానులకు మజా పంచింది. తెలుగు టైటాన్స్-పట్నా పైరేట్స్ మధ్య జరిగిన పోరులో చివరి నిమిషం వరకూ ఇరుజట్ల మధ్య విజయం దోబూచులాడింది. చివరకు తెలుగు టైటాన్స్ 28-26తో గెలిచి ఊపిరి పీల్చుకుంది. మూడు వరుస పరాజయాల తర్వాత తెలుగు జట్టుకిది తొలి గెలుపు కావడం గమనార్హం. టైటాన్స్‌లో ఆశిష్ నర్వాల్ (9), కెప్టెన్ పవన్ సెహ్రావత్ (5) రాణించారు. పట్నాలో దేవాంక్ (7), అయాన్ (6) పోరాడారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-34తో దబాంగ్ ఢిల్లీని చిత్తు చేసింది.

ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన

» పండుగ వేళ హైదరాబాద్‌లో 144 సెక్షనా? : హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): "రేవంత్‌రెడ్డి 11 నెలల పరిపాలన.. ప్రజాపాలన కాదు ప్రజాపీడన" అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పండుగ, పెళ్లిళ్ల సీజన్‌లో హైదరాబాద్‌లో 144 సెక్షన్ విధించడం ఏంటని, ప్రజలు దీపావళి జరుపుకోవద్దా అని ప్రశ్నించారు. రేవంత్ పాలన రజాకార్ రాజ్యాన్ని తలపిస్తోందన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల కుటుంబ సభ్యులతో ఫంక్షన్ చేసుకుంటే రేవ్‌పార్టీ జరిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీని వెనుక రేవంత్ ప్రభుత్వం కుట్ర ఉందని ఆరోపించారు. రేవంత్‌కు మెదడు నిండా విషం తప్ప.. విజన్ లేదని ఎద్దేవా చేశారు. సెలవులు కావాలన్నందుకు పోలీసులను సర్వీసు నుండి తొలగిస్తారా అని నిలదీశారు. "రాష్ట్రంలో రక్షకభటులకే రక్షణ లేని రాక్షసపాలన నడుస్తోంది. నేరస్తుడు పాలకుడైతే రేవంత్ పాలన లాగా ఉంటుంది" అని ఎద్దేవా చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన స్థాయిని తగ్గించుకొని వ్యవహరిస్తున్నారని, ఆయన కేంద్ర సహాయ మంత్రిగా కాకుండా.. ఈ రాష్ట్ర సీఎంకు సహాయ మంత్రిగా పనిచేస్తున్నారని ఎద్దేవాచేశారు. "తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందా.. ఆర్ఎస్(రేవంత్, సంజయ్) బ్రదర్స్ ప్రభుత్వం నడుస్తోందా"అని ప్రశ్నించారు.

డ్రగ్స్ అనగానే కేటీఆర్ పేరే వినిపిస్తోంది: షబ్బీర్ అలీ

డ్రగ్స్ సంబంధిత అంశాల్లో తరచూ కేటీఆర్ పేరే ఎందుకు వినిపిస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశ్నించారు. సందేహాల నివృత్తి కోసం ఆయన ఒకసారి నార్కోటిక్ పరీక్ష చేయించుకుని సర్టిఫికెట్ చూపించాలని కోరారు. సీఎం రేవంత్ 2020లోనే కేటీఆర్‌కు వైట్ చాలెంజ్ విసిరారని, దాన్ని స్వీకరించకుండా ఆయన తప్పించుకున్నారని గుర్తు చేశారు. గాంధీభవన్‌లో సోమవారం షబ్బీర్ అలీ విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్, ఆయన బావమరిది రాజ్ పాకాల నార్కోటిక్ పరీక్షలు చేయించుకుంటే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. త్వరలో ప్రజల ముందు అన్ని వాస్తవాలు బయట పెడతామని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

అది బాంబ్ కాదు.. సెల్ఫ్ గోల్: యెన్నం

జన్వాడ ఫామ్‌హౌస్ వ్యవహారం బాంబ్ కాదని, అది సెల్ఫ్ గోల్ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసలు బాంబులు కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్ల స్కామ్‌లు, ఈడీ దాడులు, హవాలా లావాదేవీలని చెప్పారు. సీఎల్పీ మీడియా హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. పార్టీల్లో 6.5 లీటర్లకంటే ఎక్కువ మద్యం ఉంటే ఎక్సైజ్‌శాఖ అనుమతి తీసుకోవాలన్న నిబంధన ఉందని అన్నారు. మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు చట్టాలపైన కనీస పరిజ్ఞానం లేదని విమర్శించారు.

ప్రజావాణిలో ఒకరి ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తన స్థలంలో అక్రమ అనుమతులు తీసుకొని వేరొకరు భవనం నిర్మిస్తున్నారని, ఫిర్యాదు చేసినా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని ఓ వ్యక్తి తీవ్ర ఆవేదన చెందాడు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణికి వచ్చి.. అధికారుల సమక్షంలోనే ఆత్మహత్యాయత్నం చేశాడు. ముషీరాబాద్ రాంనగర్‌కు చెందిన అనిల్‌కుమార్ ఫిర్యాదుకు సంబంధించిన వివరాలను అధికారులకు ఇచ్చాడు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని, ఉన్నతాధికారులు చెప్పినా సర్కిల్ కార్యాలయంలో డీసీ ఖాజా మొయినుద్దీన్, ఏసీపీ దేవేందర్ పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. నిర్మాణదారుడితో వారిద్దరూ కుమ్మక్కయ్యారని తెలిపాడు. భవనం నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదని ఒంటిపై కిరోసిన్ పోసుకున్నాడు. స్పందించిన అక్కడి సిబ్బంది ఆయనను అడ్డుకొని ఒంటిపై నీళ్లు పోశారు. వెంటనే ప్రజావాణిలో ఉన్న సిటీ ప్లానర్ గంగాధర్.. సర్కిల్ అధికారులకు ఫోన్ చేసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక పంపాలని ఆదేశించారు. కాగా, తీసుకున్న పర్మిషన్‌ను ఉల్లంఘిస్తూ భవనాన్ని నిర్మిస్తున్న యజమానికి నోటీసులు ఇచ్చామని ఓ అధికారి చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో రఘోత్తమ్‌రెడ్డి

కొండపాక, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను మరోసారి బరిలోకి దిగనున్నట్లు ప్రస్తుత ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి ప్రకటించారు. గత ఎన్నికల్లో ప్రొగ్రెసివ్ రికగ్నైజ్‌డ్ టీచర్స్ యూనియన్(పీఆర్టీయూ) మద్దతుతో పోటీ చేసి విజయం సాధించిన ఆయన పదవీ కాలం 2025 మార్చి 29తో ముగియనుంది. అయితే రాబోయే ఎన్నికల్లో పీఆర్టీయూ కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపడంతో కొద్దిరోజులుగా మౌనంగా ఉన్న ఆయన.. తాను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉంటున్నట్లు సోమవారం ప్రకటించారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల మద్దతు కోరనున్నట్లు తెలిపారు.

పట్టభద్రుల బరిలో గజ్వేల్ అసిస్టెంట్ ప్రొఫెసర్

గజ్వేల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, విన్నర్స్ పబ్లికేషన్స్ సలహాదారు ప్రసన్న హరికృష్ణ ఉద్యోగానికి రాజీనామా చేశారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి బరిలో నిలువనున్నట్లు ప్రకటించారు. నిర్మాణాత్మక రాజకీయాలకు పునాది వేస్తానని, పట్టభద్రులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తానని తెలిపారు. కరీంనగర్ జిల్లాకు చెందిన ఆయన గజ్వేల్‌లోని గీతాంజలి జూనియర్ కళాశాలలో 2006లో ప్రైవేట్ లెక్చరర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. 2008లో జూనియర్ లెక్చరర్‌గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచి డిగ్రీ లెక్చరర్‌గా పదోన్నతి పొంది గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలకు బదిలీపై వచ్చారు.

బాసర పూర్వ విద్యార్థికి ధ్రువపత్రాలు

» హైకోర్టు ఆదేశాలతో అందజేసిన అధికారులు

» మిగతా 5 వేల మందిది కూడా కోర్టు బాటే..!

బాసర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థి ఫణికుమార్‌కు యూనివర్సిటీ అధికారులు సోమవారం విద్యార్హత ధ్రువపత్రాలు అందజేశారు. ఫణికుమార్ ఆరేళ్ల పాటు ఇక్కడ చదువుకొని బీటెక్ పూర్తి చేశాడు. అయితే ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాకపోవడంతో.. రూ.86 వేల బకాయిలు చెల్లిస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామని అధికారులు తెగేసి చెప్పారు. దీంతో ఫణికుమార్ హైకోర్టును ఆశ్రయించగా.. అతడికి సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందేనంటూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ నేపథ్యంలోనే రెండేళ్లుగా సర్టిఫికెట్ల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న విగతా 5 వేల మంది కూడా తమకు కూడా సర్టిఫికెట్లు ఇస్తారేమోనని అంతా భావించారు. కానీ వర్సిటీ అధికారులు మిగతా వారికి ధ్రువపత్రాలిచ్చేందుకు సుముఖంగా లేకపోవడంతో.. వారు హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

(మొదటి పేజీ తరువాయి)

కొకైన్ చుట్టూనే..

విల్లాల్లో ఉన్న ఆయన ఇంటికి మోకిల పోలీసులు వెళ్లగా తాళం వేసి ఉండడంతో ఇంటికి నోటీసులు అంటించారు. శనివారం రాత్రి జన్వాడలోని రాజ్ పాకాల ఫాంహౌస్‌లో జరిగిన ఘటన వివరాలను తెలియజేసేందుకు సోమవారం రాత్రి 11 గంటల్లోపు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటి అడ్రస్‌తో కూడిన గుర్తింపు కార్డు తీసుకుని రావాలని సూచించారు. రాజ్ పాకాలను అరెస్టు చేసే అవకాశం ఉండడంతో హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. అదే విధంగా 48 గంటల్లో విచారణకు హాజరవుతానంటూ ఇద్దరు లాయర్లతో పోలీస్ స్టేషన్‌కు లెటర్ పంపారు. ఇదిలా ఉంటే డ్రగ్ తీసుకొని రాజ్ పాకాల ఫాంహౌస్‌లో పట్టుబడిన విజయ్ మద్దూరికి 41 సీఆర్‌పీఎస్ నోటీసులు అందజేసి ఆదివారం రాత్రి స్టేషన్ బెయిల్‌పై పోలీసులు వదిలేశారు. సోమవారం హాజరు కావాలని సూచించగా సాయంత్రం వరకు ఆయన రాలేదు. అయితే పోలీసులు రైడ్ చేసిన సమయంలో విజయ్ తన మొబైల్‌ను దాచి పక్కనే ఉన్న మహిళ మొబైల్ ఫోన్‌ను పోలీసులకు అందజేసినట్లు సమాచారం. తన మొబైల్ దొరికితే డ్రగ్స్ లింక్ బయటపడతాయనే ఇలా చేసినట్లు తెలిసింది. సీజ్ చేసిన ఫోన్‌ను ఇవ్వాలని ఆ మహిళ స్టేషన్‌కు రాగా కోర్టు నుంచి తీసుకోవాలని చెప్పి పంపారు. రాజ్ పాకాలతో పాటు విజయ్ నోరు విప్పితేనే కేసు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

7.35 ఎకరాల్లో..

రాజ్ పాకాల ఫాంహౌస్ సుమారుగా 7.35 ఎకరాల్లో ఉంది. 691 సర్వే నంబరులో దాదాపు 1500 గజాల విస్తీర్ణంలో శ్రీమాతే ప్రాపర్టీస్ పేరుతో ఇల్లు (జీ+1) నిర్మించారు. జన్వాడ గ్రామం 111 జీవో పరిధిలో ఉంది. అయితే కొన్నాళ్ల కిందటే నిర్మాణాన్ని పూర్తి చేసి, ఇంటి నంబరు కూడా తీసుకున్నట్లు సమాచారం. తన బావమరిది రాజ్ పాకాల జన్వాడలో కొత్తగా ఇల్లు కట్టుకొని, దావత్ చేశాడని, దానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారని కేటీఆర్ చెబుతున్నప్పటికీ అక్కడ నిర్మించింది ఫాంహౌసేనని స్పష్టమవుతోంది. శంకర్‌పల్లి-గండిపేట ప్రధాన రహదారికి 200 మీటర్ల దూరంలో ఈ ఫాంహౌస్ ఉంటుంది. అక్కడ మరికొందరి ఫాంహౌస్‌లు కూడా ఉన్నాయి.

పార్టీలో పాల్గొన్న వారికి త్వరలో నోటీసులు..!

ఫాంహౌస్ పార్టీలో జరిగిన సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియజేయాలని పార్టీలో పాల్గొన్న వారందరికీ పోలీసులు త్వరలో నోటీసులు ఇవ్వనున్నారు. అయితే ఆదివారం ముగ్గురు వ్యక్తులకు నోటీసులివ్వగా వారితో పాటు మరో ముగ్గురు స్వచ్ఛందంగా వచ్చారు. వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని పంపించారు. ఒకట్రెండు రోజుల్లో పార్టీలో పాల్గొన్న మిగతా వారందరికీ నోటీసులిచ్చి, స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

2 రోజుల సమయం ఇవ్వండి!

ఆలోపు రాజ్ పాకాల పోలీసుల ఎదుట హాజరు కావాలి.. విచారణకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకోవద్దు

» సహకరించకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చు

» జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ పాకాలకు హైకోర్టులో కాస్త ఊరట లభించింది. ఈ కేసులో పోలీసుల ఎదుట హాజరయ్యేందుకు రాజ్ పాకాల అలియాస్ పాకాల రాజేంద్రప్రసాద్‌కు న్యాయస్థానం రెండు రోజుల సమయం ఇచ్చింది. రెండు రోజుల తర్వాత పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. పోలీసుల ఎదుట హాజరై కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు అందజేసి దర్యాప్తునకు సహకరించాలని తెలిపింది. ఫాంహౌస్ పార్టీ కేసులో పోలీసులు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, తన వ్యక్తిగత స్వేచ్ఛలో జోక్యం చేసుకోకుండా అడ్డుకోవాలని, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 ప్రకారం ముందస్తు నోటీసు ఇచ్చేలా ఆదేశించాలని, కేసు దర్యాప్తుపై స్టే విధించాలని కోరుతూ రాజ్ పాకాల హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. "కేటీఆర్ కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకున్నారు. పిటిషనర్ కేటీఆర్ బావమరిది కాబట్టి రాజకీయ కక్ష సాధింపు, దురుద్దేశంతో తప్పుడు కేసులో ఇరికించి వేధించాలని చూస్తున్నారు. ఇంట్లో జరిగే వేడుకలపై దాడులు చేస్తారా? అక్కడ ఉండే ఉద్యోగికి పాజిటివ్ వస్తే పిటిషనర్‌ను ఎలా నిందితుడిగా చేరుస్తారు? నూతన గృహప్రవేశం సందర్భంగా వేడుకలు చేసుకోరా? ఉదయం 9.30 గంటలకు నోటీసు ఇచ్చి 11 గంటలకు హాజరు కావాలంటే ఎలా? ఇటీవల ఒక మంత్రి కేటీఆర్‌పై తీవ్ర పదజాలంతో పరువునష్టం కలిగేలా వ్యాఖ్యలు చేశారు. మరో మంత్రి దీపావళిలోపు రాజకీయ బాంబులు పేలతాయని వ్యాఖ్యానించారు. రాజకీయ కక్షలో భాగంగానే గృహప్రవేశ వేడుకలపై దాడులు చేశారు. రాత్రి సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా ఎక్సైజ్ అధికారులు, ఎస్‌వోటీ పోలీసులు ఇంట్లోకి చొరబడ్డారు. బంధువులతో వేడుకల్లో ఉండగా నార్కోటిక్ పరీక్షల కోసం పిటిషనర్‌ను నిర్బంధించడంతోపాటు మహిళలని చూడకుండా శాంపిల్స్ కోసం ఇబ్బందులకు గురిచేశారు. ఎలాంటి డ్రగ్స్ దొరక్కపోయినా తప్పుడు కేసులు నమోదు చేశారు. ఈ అక్రమ కేసు దర్యాప్తుపై స్టే ఇవ్వడంతోపాటు అరెస్ట్‌ను అడ్డుకోవాలి" అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. "రాజకీయ దురుద్దేశం అనేది కేవలం ఆరోపణ మాత్రమే. పోలీసులు చట్టప్రకారం వ్యవహరిస్తున్నారు. విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చాం. హాజరవకపోతే అరెస్ట్ చేస్తామని సాధారణంగా నోటీసులో ఉంటుంది. పిటిషనర్‌ను లక్ష్యంగా చేసుకుని అరెస్ట్ చేసే ఉద్దేశం పోలీసులకు లేదు. అది కేవలం పిటిషనర్ ఆందోళన మాత్రమే. పిటిషనర్‌కు సన్నిహితుడైన మద్దూరి విజయ్‌కి కొకైన్ పాజిటివ్ వచ్చింది. అనుమతిలేని మద్యం సీసాలు లభించాయి. దర్యాప్తు ప్రారంభ దశలో ఉండగానే కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు ఇవ్వరాదు. దర్యాప్తులో ఆధారాలు లభిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. విదేశీ మద్యం, డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు సమాచారం వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం తనిఖీలు చేపట్టాం. కొకైన్ పాజిటివ్ వచ్చిన వ్యక్తి పిటిషనర్‌కు అత్యంత సన్నిహితుడు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశాం" అని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. "పిటిషనర్ ఇటీవలే జన్వాడకు మారినందున గృహప్రవేశ వేడుకలు నిర్వహించినట్లు చెబుతున్నారు. అతిథులకు మద్యం ఇచ్చామే తప్ప డ్రగ్స్ ఇవ్వలేదంటున్నారు. మద్దూరి విజయ్‌కి కొకైన్ పాజిటివ్ వచ్చింది కాబట్టి డ్రగ్స్ వినియోగం నేపథ్యంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయి దర్యాప్తు చేయాల్సి ఉందని ఏఏజీ చెబుతున్నారు. ఈ కేసులో పోలీసులు బీఎన్ఎస్ఎస్ 35 నోటీసును 28న (సోమవారం) పిటిషనర్‌కు అందజేశారు. ఎలాంటి సమయం ఇవ్వలేదు కాబట్టి దర్యాప్తు పారదర్శకతపై అనుమానం వ్యక్తంచేస్తున్నారు. నోటీసుకు స్పందిస్తూ దర్యాప్తుకు సహకరిస్తున్నంత వరకు పిటిషనర్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దు. పోలీసుల నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్‌కు రెండురోజుల సమయం ఇవ్వాలి. న్యాయవాదితో కలిసి పిటిషనర్ పోలీసుల ఎదుట హాజరుకావచ్చు. పోలీసులు చట్టప్రకారం వ్యవహరించవచ్చు" అని పేర్కొంది. ఒకవేళ డ్రగ్స్ వినియోగించినట్లు తేలినా ఆరు నెలలే జైలుశిక్ష పడుతుంది కాబట్టి.. అలాంటి సందర్భాల్లోనూ ముందుగా నోటీసు ఇవ్వాలి కదా? అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.





రాజ్ పాకాల

శ్రవణ్‌రావు బెయిల్‌పై వివరణ కోరిన హైకోర్టు

ఫోన్‌ట్యాపింగ్ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని పేర్కొంటూ ఈ కేసులో ఏ-6గా ఉన్న శ్రవణ్‌కుమార్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని.. పోలీసులు పెట్టిన సెక్షన్లు తనకు వర్తించవని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరాలని తాను ఇతర పార్టీల నాయకులను కోరినట్లు తప్పుడు ఆరోపణలు చేశారని.. అయితే, ఇతర నిందితులతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం.. బెయిల్ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ పోలీసులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నవంబరు 7కు వాయిదా వేసింది.

పబ్బుల వల్ల రోడ్డు ప్రమాదాలు

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో పబ్బుల వల్ల భారీగా ప్రమాదాలు జరుగుతున్నాయని.. వీటిని అరికట్టాలని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్‌కు ధర్మాసనం సూచించింది. బడాబాబుల పిల్లలు పబ్బుల్లో హంగామా చేస్తూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, పబ్బులను నియంత్రించేలా నిబంధనలు రూపొందించాలని పేర్కొంది. జూబ్లీహిల్స్ ప్రాంతంలో దాదాపు 60 వరకు పబ్బులు ఉన్నాయని.. అక్కడ స్పెషల్ డ్రైవ్‌లు పెట్టాలని పేర్కొంది. అక్కడ రోజూ కనీసం ఒక్క ప్రమాదం అయినా జరుగుతోందని వ్యాఖ్యానించింది.

2019లోనే బుంగలు

కాంక్రీటు బ్లాకులు, ఆప్రాన్లూ దెబ్బతిన్నాయి.. మూడేళ్లపాటు మరమ్మతులు చేపట్టలేదు

» అందుకే బ్యారేజీలో ఏడో బ్లాకు కుంగింది

» ప్రభుత్వం నుంచి డబ్బులు తీసుకుని కూడా కాఫర్ డ్యామ్‌ను తొలగించలేదు

» నిర్మాణ సంస్థ, మాజీ ఈఎన్సీ సహా 15 మంది వరకూ అధికారులు ఇందుకు బాధ్యులు

» వారిపై చర్యలు తీసుకోండి

» నీటి పారుదల శాఖకు విజిలెన్స్ తుది నివేదిక



మేడిగడ్డ బ్యారేజీ (ఫైల్)

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీలో 2019లో నీటిని నింపినప్పుడే బుంగలు ఏర్పడ్డాయని, ఏడో బ్లాకు కింద ఇసుక కొట్టుకుపోవడమే దీనికి కారణమని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చి చెప్పింది. బ్యారేజీని 2019 జూన్‌లో ప్రారంభించారని, అదే ఏడాది నవంబరులో వరదల తర్వాత బ్యారేజీ దెబ్బతిందని, బ్యారేజీ గేట్లు మూసివేసిన తర్వాత దిగువ భాగంలో కాంక్రీట్ బ్లాకులు, ఆప్రాన్లు దెబ్బతిన్నాయని, అయినా.. మూడేళ్లపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ చేపట్టకపోవడంతో 2023 అక్టోబరులో బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిందని స్పష్టం చేసింది. మూడు బ్యారేజీల వైఫల్యాలకు 15 మంది వరకూ అధికారులు బాధ్యులని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. నిర్దేశిత పద్ధతిలో బ్యారేజీ నిర్మాణ పనులు జరగలేదని, మేడిగడ్డలో కుంగిన బ్లాక్-7కి సంబంధించిన పియర్ల కింద ఉన్న పునాది (ర్యాఫ్ట్), ర్యాఫ్ట్ దిగువన భూగర్భంలో ఉండే సీకెంట్ పైల్స్‌ను కూడా క్రమ పద్ధతిలో నిర్మించలేదని తేల్చింది. పనులు పూర్తి కాకపోయినా పూర్తయినట్లు సర్టిఫికెట్లు జారీ చేశారని గుర్తు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై తుది నివేదికను శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను కలిసి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ (డీజీ) కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. బ్యారేజీల నిర్మాణ పనులు పూర్తి కాకపోయినా 2019 సెప్టెంబరు 10న దాదాపు పూర్తైనట్టు (సబ్‌స్టాన్షియల్ కంప్లీషన్ సర్టిఫికెట్) జారీ చేశారని, పనులు పూర్తికాకున్నా పూర్తైనట్టు ధ్రువీకరిస్తూ 2021 మార్చి 15న మళ్లీ పనుల పూర్తి ధ్రువీకరణ పత్రం జారీ చేశారని, బ్యాంకు గ్యారంటీల విడుదలలోనూ నిబంధనలు పాటించలేదని నివేదికలో పేర్కొన్నారు. ఇండియన్ స్టాండర్డ్ కోడ్ ప్రకారం ప్రతి వర్షాకాలం ముగిసిన తర్వాత డ్యామ్ ఆప్రాన్ ఏరియాలో సౌండింగ్ అండ్ ప్రొబింగ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, డ్యామ్ యజమాని (ఈఎన్‌సీ రామగుండం) చేపట్టలేదని, బ్యారేజీ నిర్మాణ సమయంలో షీట్ పైల్స్‌తో ఏర్పాటు చేసిన కాఫర్ డ్యామ్‌ను నిర్మాణం పూర్తైన తర్వాత కూడా తొలగించలేదని, ఆ అవశేషాల కారణంగా వరద ప్రవాహం సజావుగా జరగలేదని వివరించారు. కాఫర్ డ్యామ్ తొలగించడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకుని కూడా దానిని తొలగించలేదని, నిర్మాణ సంస్థతోపాటు రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, సంబంధిత ఎస్ఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లే ఇందుకు కారణమంటూ తప్పుబట్టింది.

ఇంటికే వెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు

» మహారాష్ట్రతో పాటు కామారెడ్డి జిల్లాలో ముఠా ఆగడాలు

» వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీరియస్

కామారెడ్డి, కామారెడ్డి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లాలో కొందరు ముఠాగా ఏర్పడి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని జిల్లా ఎస్పీ సింధూ శర్మ తెలిపారు. కామారెడ్డిలోని తన కార్యాలయంలో ఎస్పీ సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఐదు నెలల క్రితం కామారెడ్డిలోని సమన్విత ఆస్పత్రిలో ఓ గర్భిణికి నెలలు నిండకుండానే ఆపరేషన్ చేసి ఆడపిల్లను ఇతరులకు విక్రయించిన విషయమై దర్యాప్తు చేయగా.. సదరు ఆసుపత్రి నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తేలిందన్నారు. ఈ కేసులో పలువురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అప్పటి నుంచి జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలపై పోలీసు శాఖ నిఘా పెట్టిందన్నారు. 15 రోజుల క్రితం రాజంపేటలో ఓ వ్యక్తి ఇంట్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ యంత్రంతో గర్భిణులకు పరీక్షలు చేస్తుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని యంత్రాన్ని సీజ్ చేశారన్నారు. సదరు వ్యక్తితో పాటు మరో 16 మంది ఆర్ఎంపీలను గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. రెండు రోజుల క్రితం కౌసల్య ఆసుపత్రికి చెందిన ఇట్టెం సిద్దిరాములు ఓ స్కానింగ్ యంత్రాన్ని కారులో తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఇట్టెం సిద్దిరాములుతో పాటు మరికొందరు ముఠాగా ఏర్పడి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఈ ముఠా నెట్‌వర్క్‌ను మహారాష్ట్రతో పాటు కామారెడ్డి చుట్టుపక్కల జిల్లాల్లోనూ విస్తరించినట్లు తెలిపారు. వీరు స్కానింగ్ యంత్రాలను వాహనాల్లో గర్భిణుల ఇంటికి తీసుకువెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని ఎస్పీ వివరించారు. కాగా, లింగ నిర్ధారణ పరీక్షలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ జిల్లా వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఫోన్‌లో కామారెడ్డి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌తో మాట్లాడారు. తీసుకోవాల్సిన చర్యలపై వెంటనే దృష్టి సారించాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

» బాణసంచా దుకాణదారులకు అగ్నిమాపక డీజీ హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి టపాసులు విక్రయించే సమయంలో నిబంధనలు పాటించని దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని అగ్నిమాపక శాఖ డీజీ వై. నాగిరెడ్డి హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లో బాణసంచా దుకాణంలో అగ్నిప్రమాదం జరిగిన పరాస్ బాణసంచా దుకాణంకు ఇచ్చిన అనుమతుల్ని రద్దు చేశామని తెలిపారు. టపాసులు విక్రయించే దుకాణాల్లో ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే ఫైర్ సర్వీసెస్ యాక్ట్ 1999 ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సంవత్సరం దీపావళి సందర్భంగా టపాసుల విక్రయానికి అనుమతి కోరుతూ 6953 దరఖాస్తులు వచ్చాయని, అన్ని అంశాలను పరిశీలించి 6104 దుకాణాలకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు.

గాడిదలు కొనిపించి.. కోట్లు గుంజేశాడు

» భారీ ఆదాయం వస్తుందని ఆశపెట్టి తమిళనాడు వ్యక్తి కుచ్చుటోపీ

» ఏపీ, తెలంగాణలో కోట్లు వసూలు

» రెండు రాష్ట్రాల్లో 350 మంది బాధితులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



గాడిదల పెంపకంతో భారీ లాభాలుంటాయని, వాటి పాలను తానే కొనుగోలు చేస్తానంటూ తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి తెలుగు రాష్ట్రాల్లో కోట్లాది రూపాయలకు మోసం చేశాడు. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి తిరునల్వేలి జిల్లా ముక్కుడల్‌లో డాంకీ ఫారమ్ పెట్టాడు. యూట్యూబ్‌లో వీడియోలు చేస్తూ, లీటరు గాడిద పాలను రూ.1600 నుంచి రూ.1800కు కొంటానంటూ ఎర వేశాడు. తన యూట్యూబ్ చానల్ వీక్షకులకు ఫోన్లు చేసి మేలుజాతి గాడిదలు కొనుగోలు చేస్తే మంచి లాభాలు వస్తాయని గేలం వేశాడు. 2022, 2023లో విల్లుపురంలో డాంకీ సెమినార్లు పెట్టాడు. జాతి ఆధారంగా ఒక్కో గాడిదకు కనీస ధర 90 వేలు, మేలు రకమైతే లక్షన్నర వరకూ తీసుకుని విక్రయించాడు. గాడిద పాలు గంటకు మించి నిల్వ ఉండవని, సేకరించేందుకు 24 గంటలకు పైగా పడుతుందని చెప్పి హై కెపాసిటీ ఫ్రీజర్లు కొనాలంటూ 75 వేల నుంచి లక్షన్నర వరకూ వసూలు చేశాడు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పదుల సంఖ్యలో తమిళనాడు వ్యక్తి వలలో పడ్డారు. మొదట్లో లీటరుకు 1600 నుంచి 1800 చెల్లించాడు. ఏపీతో పాటు తెలంగాణకూ ఈ వ్యాపారం పాకింది. దీంతో ఫ్రాంచైజీలు ఇస్తానంటూ ఒక్కొక్కరి నుంచి ఐదు లక్షల చొప్పున తీసుకున్నాడు. ఇలా రెండు రాష్ట్రాల్లో సుమారు 350 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ధనికుల పిల్లలు ఫ్రాంచైజీలు తీసుకుని, గాడిదలు కొని పాల విక్రయాలు ప్రారంభించారు. ఆ తర్వాతే అసలు కథ ప్రారంభమైంది. పాలను సేకరించిన తమిళనాడు వ్యక్తి తనకు పైనుంచి బిల్లులు రాలేదంటూ వారికి పెండింగ్ పెట్టాడు. పాల నిల్వలు పెరిగి పోవడంతో ఫ్రాంచైజీలు తీసుకున్నవారు ఫోన్లు చేస్తున్నా ఎత్తకుండా ముఖం చాటేశాడు. కొత్త నంబర్‌తో ఫోను చేస్తే 'నేనూ నష్టపోయా.. నాతో అగ్రిమెంటు చేసుకున్న ఫార్మా పరిశ్రమ పాలు కొనట్లేదు' అంటూ బాంబు పేల్చాడు. మోసపోయామని గుర్తించినవారు గాడిదలను మేపలేక, పనోళ్లకు జీతాలు ఇవ్వలేక వాటిని రోడ్డుపైకి వదిలేయడంతో ఎటో వెళ్లిపోయాయి. హై కెపాసిటీ ఫ్రీజర్లకు కరెంటు బిల్లులు ఎలా చెల్లించాలో దిక్కు తెలియక కొందరు వందల లీటర్ల పాలు పారబోశారు. ఏపీలో ఇప్పటి వరకూ 46 మంది బాధితులకు సుమారు 9 కోట్లు రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

కొడుకు బట్టల దుకాణం దగ్ధం... మనస్తాపంతో తండ్రి మృతి


» జనగామ కాంప్లెక్స్ ప్రమాదంలో షాపు బుగ్గి

» 70 లక్షల మేర నష్టం... తీవ్ర మనోవేదనతో గుండెపోటు



లక్ష్మీనారాయణ

జనగామ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో తన కొడుకు బట్టల దుకాణం పూర్తిగా దగ్ధం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తండ్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన జనగామ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున జనగామ పట్టణంలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పలు బట్టల దుకాణాలు దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఎస్ఆర్ బ్రదర్స్ అనే బట్టల దుకాణం పూర్తిగా దగ్ధమైంది. దుకాణ యజమాని అయిన స్వర్గం శ్రీనివాస్‌కు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో కొడుకు పరిస్థితిని చూసి శ్రీనివాస్ తండ్రి లక్ష్మీనారాయణ(77) తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఛాతిలో నొప్పిగా ఉందటూ ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.



ఖమ్మం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి బస్తాలు

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన పత్తి

» ఈ సీజన్‌లో తొలిసారి 40 వేల బస్తాల రాక

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భారీ ఎత్తున పోటెత్తిన తెల్ల బంగారం (పత్తి)తో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కళకళలాడింది. సోమవారం మార్కెట్‌కు సుమారు 40 వేల పత్తి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త పత్తి సీజన్‌లో మార్కెట్‌కు ఇంత భారీగా పంట రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు శని, ఆదివారాలు వరుసగా రెండు రోజులు సెలవులు కావడంతో సోమవారం రైతులు భారీగా తమ పంటను మార్కెట్‌కు తెచ్చారు. మార్కెట్‌కు గత కొద్ది రోజులుగా రోజుకు 8 నుంచి 10 వేల బస్తాల పత్తి వస్తుండగా సోమవారం ఒక్కసారిగా 40 వేల బస్తాలకు పైగా అమ్మకానికి రావడం విశేషం. కాగా, మార్కెట్‌లో క్వింటాలు పత్తిని నాణ్యతను బట్టి గరిష్ఠంగా రూ.6,800లకు, కనిష్ఠంగా రూ.5,900లు కొనుగోలు చేస్తున్నారు. నమూనా రకాలను రూ.6,600 ఆన్‌లైన్ బిడ్డింగ్ దరకు వ్యాపారులు కొనుగోలు చేశారు.



తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

» ఆర్థిక పరిస్థితి, నిధుల సమీకరణపై చర్చ

హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై చర్చించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క.. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రెండు సార్లు భేటీ అయ్యారు. ఉదయం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసిన భట్టి విక్రమార్క.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నిధుల సమీకరణపై చర్చించారు. ప్రస్తుత పరిమిత ఆర్థిక వనరులతో.. సమీప భవిష్యత్తులో చేపట్టనున్న ప్రాజెక్టులు, పథకాల అమలుపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఇదే అంశంపై సాయంత్రం కూడా భట్టి విక్రమార్క.. సీఎంను మరోమారు ఆయన ఇంట్లో కలిసి చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు. కాగా, సోమవారం తన జన్మదినం సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డిని ఉదయం ఆయన నివాసంలో కలిశారు. పొంగులేటికి రేవంత్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

కమ్మరి, వడ్రంగుల్ని విశ్వకర్మలుగా గుర్తించండి

» మంత్రి పొన్నంకు కులసంఘం ప్రతినిధుల వినతి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జరిపబోయే బీసీ కులగణనలో విశ్వకర్మ జాతికి చెందిన ఆయా వృత్తుల వారందరినీ కలిపి విశ్వకర్మలుగా గుర్తించాలని కోరుతూ బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నంప్రభాకర్‌ను ఆ కులసంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు విశ్వకర్మ కార్పొరేషన్ పాలకమండలి సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాతోజు రామాచారి సోమవారం మంత్రికి వినతిపత్రం సమర్పించారు. కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకార కులాల పేరుతో ఉన్న జాబితాను తొలగించి.. వారందరినీ విశ్వకర్మ కులంపేరిట బీసీ జనాభా లెక్కల్లోనే నమోదుచేయాలని విజ్ఞప్తి చేశారు.

సియోల్ సందర్శనకు స్పీకర్, మండలి చైర్మన్

» సీపీసీలో భాగంగా మరో 2 దేశాల పర్యటన కూడా

హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో స్పీకర్ ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు సియోల్ నగర సందర్శనకు వెళ్లనున్నారు. అక్కడి చంగ్ ఏ చంగ్ నది పునరుద్ధరణ, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో హంగ్ నదిని ఆధునీకరించిన తీరును వారు ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. ఆస్ట్రేలియాలో నవంబరు 2 నుంచి ప్రారంభం కానున్న కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్సు(సీపీసీ)లో భాగంగా వారు సియోల్‌లో పర్యటించనున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల స్పీకర్‌లు, డిప్యూటీ స్పీకర్‌లు, మండలి చైర్మన్‌లు, డిప్యూటీ చైర్మన్‌లు, కార్యదర్శులు హాజరు కానున్నారు.

పట్టణ పరిధిలోకి 82,262 చ.కి.మీ

» 27 యూడీఏల ఏర్పాటుతో మారనున్న రాష్ట్ర స్వరూపం

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు చేసిన పట్టణాభివృద్ధి సంస్థ(యూడీఏ)ల వల్ల పట్టణ పరిధి మరింత పెరిగింది. ఇదివరకు ఉన్న 9 యూడీఏలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన 18 యూడీఏల పరిధిలోకి వచ్చిన గ్రామాలు సహా భూభాగంపై పురపాలకశాఖ అధికారులు లెక్కలు కట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,12,077 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉండగా, ఇందులో 27 యూడీఏల పరిధిలోనే 82,262 చదరపు కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. ఇందులో 81 అర్బన్ లోకల్ బాడీ(యూఎల్‌బీ)లతోపాటు 6,872 గ్రామాలను చేర్చారు. కొత్తగా ఏర్పాటు చేసిన యూడీఏల పరిధిలో 73,200 చ.కి.మీ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో 1,805 చ.కి.మీ, హెచ్ఎండీఏ పరిధిలో 7,252 చ.కి.మీ ఉంది. దీంతో రాష్ట్రంలో ఉన్న మొత్తం భూ భాగంలో సుమారు 80 శాతం యూడీఏల పరిధిలోకి వచ్చినట్లేనని పురపాలకశాఖ అధికారులు చెప్తున్నారు. యూడీఏల ఏర్పాటుతో గ్రామాల్లో మౌలిక వసతులకు నిధులు సమకూరతాయని, రహదారులు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని, పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఏకరూప బృహత్తర ప్రణాళికను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో యూడీఏల పరిధిలో ఉన్న గ్రామాల రూపురేఖలు కూడా మారిపోతాయని అధికారులు భావిస్తున్నారు. కాగా, లండన్‌లోని థేమ్స్ నది, సియోల్‌లోని చంగ్ ఏ చంగ్, హంగ్ నదుల కంటే గొప్పగా మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం చేపడుతుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంతో పోటీ పడే విధంగా ప్రభుత్వం తయారు చేయనుందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు.. డ్రైవింగ్ ఎడ్యుకేషన్!

» లైసెన్స్ పొందేవారికి అవగాహన కార్యక్రమం

» డాక్టర్ గురువారెడ్డి సర్వేజనా ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధుల సహకారంతో నిర్వహణ: పొన్నం

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సరికొత్త ప్రణాళికను అమలు చేయాలని రవాణా శాఖ నిర్ణయించింది. 80 శాతం రోడ్డు ప్రమాదాలు డ్రైవర్ల తప్పిదాల వల్లే జరుగుతుండడంతో.. దీనిని అరికట్టేందుకు కంపల్సరీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ (సీడీఈ) పేరుతో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టనుంది. డాక్టర్ గురువారెడ్డి సీఎస్ఆర్ నిధుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం రవాణా శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో సచివాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023లో దేశంలో 1.73 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని ఇందులో 45 శాతం మంది 35 ఏళ్లలోపు వయసున్న యువత ఉన్నారని తెలిపారు. వీరిలోనూ 44 శాతం మంది ద్విచక్ర వాహన ప్రమాదాల్లో మరణించారని వెల్లడించారు. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకే సీడీఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మొదటి దశలో ప్రయోగాత్మకంగా 9 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో, హైదరాబాద్‌లో ఆరు రవాణా శాఖ కేంద్రాల్లో దీనిని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లైసెన్స్ పొందాలనుకునే వారు.. లెర్నింగ్ లైసెన్స్, శాశ్వత లైసెన్స్‌కి మధ్య వీడియో అవగాహన కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా కొత్తగా రోడ్డు మీదకి వస్తున్న వాహనదారులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. దీంతోపాటు విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకుగాను రాష్ట్రంలో ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. యునిసెఫ్ రవాణా విభాగం ద్వారా దీనిని నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో రోడ్ సేఫ్టీ కార్యక్రమంలోపు రాష్ట్రవ్యాప్తంగా 300 మంది రవాణా శాఖ అధికారులు 300 స్కూళ్లలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని మంత్రి పొన్నం ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, డిప్యూటీ సెక్రటరీ శోభారాణి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు రమేశ్, మమత, గురువారెడ్డి సర్వేజనా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కిల్స్ వర్సిటీ భవనాల డిజైన్లు ఖరారు

» నవంబరు 6 నుంచి నిర్మాణ పనులు

» 10 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం

» భవనాల నిర్మాణం బాధ్యత మేఘాకే

హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణాల డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో వర్సిటీ నిర్మాణం చేపట్టనున్నారు. నవంబర్ 6వ తేదీన పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పది నెలల్లోగా ఈ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. యునివర్సిటీ క్యాంపస్‌లో అన్ని భవనాల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి బాధ్యతలను మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) తీసుకుంది. గత శనివారం ఈ మేరకు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందం కూడా చేసుకుంది. భవన నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లను ఎంఈఐఎల్ అందించగా.. వాటినే ప్రభుత్వం ఖరారు చేసింది. ఐదంతస్తుల్లో పరిపాలన భవనం చేపట్టనున్నారు. హాస్టళ్లు, స్టాఫ్ క్వార్టర్లు, ఆడిటోరియం, లైబ్రరీ, సువిశాల మైదానం, పార్కింగ్ ఏరియా ఉండేలా ఈ డిజైన్లు రూపొందించారు. సువిశాల ప్రాంగణంలో ఎక్కువ ఖాళీ స్థలం ఉండేలా భవన నమూనాలు తయారు చేయించారు. ఆరు వేల మంది విద్యార్థుల నైపుణ్య శిక్షణ, వసతి సదుపాయాలు ఉండేలా క్యాంపస్‌లో నిర్మాణాలను చేపడతారు. అన్ని భవనాలపై సౌర విద్యుత్తు ప్యానెళ్లను అమర్చనున్నారు. ఏసీల వాడకం లేకుండా కొన్ని భవనాల్లో సహజమైన గాలి వెలుతురు ఉండేలా అధునాతన డిజైన్లలో భవనాలు నిర్మించనున్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలుండేలా వర్సిటీ క్యాంపస్‌ను నిర్మించాలని నిర్మాణ బాధ్యతలు చేపట్టిన మేఘా కంపెనీ ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్కిల్స్ వర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించగా.. అదానీ గ్రూప్ రూ.100 కోట్లు విరాళంగా అందించింది. భవనాల నిర్మాణానికి కావాల్సిన రూ. 200 కోట్లను మేఘా కంపెనీ అందించనుంది.



స్కిల్స్ యూనివర్సిటీ మొదటి దశ నిర్మాణం ఏరియల్ వ్యూ

నిరసనలపై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లపై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఆదేశాలు నవంబరు 28వ తేదీ వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా అల్లరి మూకలు, అరాచక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఇతర గ్రూపులకు చెందిన వ్యక్తులు నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఫ్లకార్డులు, జెండాలు పట్టుకొని నినాదాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సభలు, సమావేశాలు నిర్వహించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా హోంగార్డులతో సహా.. విధుల్లోనే ఉంటారని తెలిపారు. సైనికోద్యోగులు, విద్యాశాఖకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్స్ సైతం విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. నెల రోజులపాటు.. చీమ చిటుక్కుమన్నా తెలిసేలా నగరంలో పటిష్టమైన నిఘాతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని ప్రాంతాల్లో అడుగడుగునా పోలీస్ నిఘా ఉంటుందని ప్రకటించారు. అయితే ఈ ఆదేశాలు అమల్లో ఉండగానే.. పలువురు టీజీఎస్పీ కానిస్టేబుళ్లు ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో నిరసన తెలిపేందుకు వచ్చారు. వారిని దోమలగూడ పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా టీజీఎస్పీ కానిస్టేబుళ్లు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

21 మంది కానిస్టేబుళ్లపై కేసు..

ధర్నా చౌక్‌లో నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన 21 మంది టీజీఎస్పీ కానిస్టేబుళ్లపై కేసు నమోదైంది. క్రిమినల్ కేసులతోపాటు 21 మంది సిబ్బందికి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 311(2)(బి) ప్రకారం షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు అదనపు డీజీపీ (బెటాలియన్) సంజయ్ జైన్ తెలిపారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు సానుకూలంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు. మరోవైపు సచివాలయంలో భద్రతా విధులు నిర్వర్తించే సెక్యూరిటీ సిబ్బందికి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) నుంచి గట్టి హెచ్చరికలు జారీ అయ్యాయి. సచివాలయంలో టీజీఎస్పీ అధికారులు, సిబ్బందే భద్రతాపరమైన విధులు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో సీఎస్‌వో ఈ హెచ్చరికలు చేశారు. "సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మనపై చాలా మంది నిఘా ఉంటుంది. ఇక్కడ విధులు నిర్వహించేవారు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళుతున్నారు, ఎవరిని కలుస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఏ పోస్టులు పెడుతున్నారు.. వంటి విషయాలను పరిశీలిస్తారు. టీజీఎస్పీ అధికారులు, సిబ్బంది ఎవరైనా.. ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్లో కలుగజేసుకోవద్దు. సచివాలయంలో ఏ చిన్న తప్పిదం జరిగినా.. దాని ప్రభావం టీజీఎస్పీ వ్యవస్థపై పడుతుంది. సచివాలయం నుంచి అందరం వెళ్లిపోవాల్సి వస్తుంది" అని సీఎస్‌వో హెచ్చరించారు. సోమవారం నుంచి సచివాలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధి మేర 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు. ఐదుగురి కంటే ఎక్కువగా గుమిగూడవద్దని, ధర్నాలు, రాస్తారోకోలు, సచివాలయ ముట్టడిలాంటి వాటిలో పాల్గొన్నవారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టొద్దని, ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు వంటి వాటిలో అనుమతి లేకుండా పాల్గొనవద్దు. పొరపాటున దొరికితే తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. కాగా, బెటాలియన్ కానిస్టేబుళ్లు సోమవారం సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

డిచ్‌పల్లిలో నిరసన ర్యాలీ

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో ప్రత్యేక పోలీస్ కానిస్టేబుళ్లు సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరసన తెలిపిన బెటాలియన్‌ల కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం దారుణమన్నారు. వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.



డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

సీఎం నివాసం వద్ద భద్రతా ఏర్పాట్లలో మార్పు

టీజీఎస్పీ కానిస్టేబుళ్ల ఆందోళనల నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం వద్ద భద్రతా ఏర్పాట్లలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటివరకు సీఎం ఇంటివద్ద బందోబస్తు విధులు నిర్వహించిన బెటాలియన్ పోలీస్ సిబ్బందిని ఆ బాధ్యతల నుంచి సీఎం సెక్యూరిటీ వింగ్ తప్పించింది. వారి స్థానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందితో భద్రత కల్పించింది. సీఎం ఇంటికి మూడు వైపులా ఉన్న 22 మంది టీజీఎస్పీ సిబ్బందిని మార్చి ఏఆర్ సిబ్బందిని నియమించారు.

ఆయిల్ పామ్ టన్నుకు రూ.20వేలు!

» కేంద్రం చెల్లించేలా కృషి చేస్తా

» రాష్ట్రంలో సాగుకు ఢోకా లేదు: తుమ్మల



దమ్మపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ టన్ను గెలలకు కేంద్రప్రభుత్వం రూ.20వేలు చెల్లించేలా కృషి చేస్తానని, ఒకవేళ అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ పామ్ రేటు పడిపోయినా ఆ లోటును ప్రభుత్వమే భర్తీ చేసి రైతులకు రూ.20వేలు చెల్లించేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రాన్ని కోరుతానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఇందుకు పామాయిల్ సాగు చేస్తున్న రాష్ట్రాలతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఆయిల్ పామ్ సాగుపై ఇటీవలి మలేసియా పర్యటన వివరాలను ఆయన భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తన నివాసంలో వివరించారు. అల్యూమినియం గెడలతో గెలలు కోసే సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి మలేసియాలో ఫైబర్ గెడలను వినియోగిస్తున్నారని, వాటిని తెప్పించి రైతులకు సబ్సిడీపై అందిస్తామని తుమ్మల తెలిపారు. పామాయిల్ సాగులో అంతర పంటల ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చునని, అంతర పంటలకు సబ్సిడీలు కూడా ఇస్తామని చెప్పారు. తెలంగాణలో పామాయిల్ సాగుకు ఢోకా లేదన్నారు. 31 జిల్లాల్లో పామాయిల్ సాగును పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తామని తెలిపారు. అందులో భాగంగానే మలేసియాలో మూడురోజులు పాటు ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని పరిశీలించినట్లు తెలిపారు. రాష్ట్రం లో వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేసేందుకు బియ్యం, పౌల్ట్రీ, మామిడి ఎగుమతులపై అక్కడి ఆహార భద్రత మంత్రి మహ్మద్ బిన్‌సాబుతో చర్చించానని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరానని తెలిపారు.

ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్స్ కమిషనర్‌గా శశాంక

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో 15 జిల్లాల అదనపు కలెక్టర్లు, నాలుగు జిల్లాల డీఆర్వోలు, 47 మంది డిప్యూటీ కలెక్టర్లున్నారు. ఇదే క్యాడర్‌కు చెందిన ఎల్. రమేష్, ఎన్. ఆనంద్‌కుమార్, వి.హనుమనాయక్‌ను రెవెన్యూ సర్వీసెస్-1లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. బదిలీలకు ముందు ప్రభుత్వం ప్రతి అధికారి పనితీరు మీదా విజిలెన్స్ నివేదికను తెప్పించింది. బదిలీలు కోరుకున్న డిప్యూటీ కలెక్టర్లకు లేఖలు ఇచ్చేందుకు వారి నుంచి కొంత మంది ఎమ్మెల్యేలు డబ్బులు వసూలు చేసినట్లు కూడా విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు. బదిలీల్లో భాగంగా.. పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠిని నల్లగొండ కలెక్టర్‌గా.. సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంతరావును యాదాద్రి జిల్లా కలెక్టర్‌గా నియమించింది. అక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న జెండగే హనుమంత్ కొండిబాను పర్యాటక శాఖ డైరెక్టర్‌గా నియమించి, దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ టీకే శ్రీదేవిని పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్(సీడీఎంఏ)గా నియమించింది. ఇప్పటివరకూ ఈ పోస్టు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వీపీ గౌతమ్‌ను రిలీవ్ చేసింది. నిజామాబాద్ మునిసిపల్ కమిషనర్ మంద మకరందును.. భూపరిపాలన కమిషనరేట్(సీసీఎల్ఏ)లో ప్రాజెక్టు డైరెక్టర్(సీఎంఆర్‌వో)గా నియమించింది. రెవెన్యూ శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్.హరీశ్‌ను.. సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్, ఎక్స్ అఫిషియో ప్రత్యేక కార్యదర్శిగా నియమించింది. రెవెన్యూ శాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి టి.వినయ్‌కృష్ణారెడ్డిని.. సాగునీటి పారుదల శాఖలోని ఆర్ అండ్ ఆర్ (రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్) విభాగం కమిషనర్‌గా నియమించింది. వెయిటింగ్‌లో ఉన్న అయేషా మస్రత్ ఖానమ్‌కు వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తికి.. వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర క్రీడల శాఖ డైరెక్టర్ కొర్రా లక్ష్మిని.. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండీగా నియమించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ, ఐఎఫ్ఎస్ అధికారి సోనీ బాలాదేవికి క్రీడల శాఖ డైరెక్టర్‌గా.. 'హాకా' ఎండీ కె.చంద్రశేఖర్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీగా.. అదనపు బాధ్యతలు అప్పగించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీఈవో ఎస్.దిలీప్‌కుమార్‌ను బదిలీ చేసి నిజామాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా నియమించింది. మరో ముగ్గురు ఐఎఫ్ఎస్ అధికారులను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. అటవీ శాఖ జోగుళాంబ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ క్షితిజను.. షెడ్యూల్డు కులాల అభివృద్ధి సంస్థ ఎండీగా నియమించింది. అటవీ శాఖ డిప్యూటీ కన్జర్వేటర్‌గా పని చేస్తున్న వీవీఎల్ సుభద్రాదేవిని.. జీహెచ్ఎంసీలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం అదనపు కమిషనర్‌గా నియమించింది. రాజన్న సర్కిల్ అటవీ సహాయక కన్జర్వేటర్ జ్ఞానేశ్వర్‌ను వికారాబాద్ డీఎఫ్‌వోగా నియమించింది.

6 నుంచి కులగణన

7 పేజీలు.. 75 ప్రశ్నలు.. వ్యక్తిగత, కుటుంబ వివరాల సేకరణ


» ఆధార్ వివరాలు తప్పనిసరి కాదు

» రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల లబ్ధి, రాజకీయ నేపథ్యం వివరాల సేకరణ

హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కులగణనకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న ఈ కార్యక్రమం నవంబరు-6 నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన ప్రశ్నావళిని ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 56 ప్రధాన ప్రశ్నలతోపాటు 19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలు ఖరారు చేశారు. పార్ట్-1లో యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించి 58 ప్రశ్నలుండగా.. పార్ట్-2లో కుటుంబ వివరాలకు సంబంధించి 17 ప్రశ్నలున్నాయి. మొత్తం 7 పేజీల్లో వీటిని పూరించాల్సి ఉంటుంది. కుటుంబ యజమానితోపాటు కుటుంబంలోని సభ్యులందరి వ్యక్తిగత వివరాలు సేకరించనున్నారు. పార్ట్-1లో వ్యక్తిగత వివరాలలో.. మతం, సామాజిక వర్గం, కులం, ఉప కులంతోపాటు మాతృభాష, వైవాహిక స్థితి, పాఠశాల రకం, విద్యార్హత, ఉద్యోగం, ఉపాధి, కుల వృత్తి, వార్షిక ఆదాయం, ఐటీ రిటర్న్, స్థిరాస్తులు, ధరణి పాస్‌బుక్ నెంబర్, రిజర్వేషన్‌తో పొందిన ప్రయోజనాలు, గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన సంక్షేమ పథకాల పేర్లు, రాజకీయ నేపథ్యం, వలస వివరాలు సేకరిస్తారు. కుటుంబ వివరాలను పార్ట్-2లో నమోదు చేస్తారు. ఇందులో గత ఐదేళ్లలో తీసుకున్న రుణాల వివరాలు, పశుసంపద, స్థిరాస్తి, చరాస్తి వివరాలు, రేషన్ కార్డు నెంబరు, నివాస గృహం రకం, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్ వివరాలు తెలపాల్సి ఉంటుంది. ఆధార్ వివరాలు తప్పనిసరి కాదని ఇందులో స్పష్టం చేశారు.

సమగ్ర కుటుంబ సర్వే లాంటి ప్రశ్నలే

2014 ఆగస్టు-19న నాటి కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ద్వారా రాష్ట్రంలోని కోటి గృహాలు, 3.68 కోట్ల జనాభాకు సంబంధించి ఆర్థిక సామాజిక వివరాలన్నీ సేకరించింది. పదేళ్ల క్రితం నిర్వహించిన నాటి సర్వేలో 8 అంశాలకు సంబంధించి 94 ప్రశ్నలకు సమాధానాలు సేకరించారు. అప్పటితో పోలిస్తే కులగణన సర్వేలో దాదాపు 90శాతం ప్రశ్నలు మళ్లీ పునరావృతం అయ్యాయి. కుటుంబసభ్యుల అనారోగ్య వివరాలు అందులో ఉండగా.. ఇప్పుడు కులాలకు సంబంధించిన ప్రశ్నలు అదనంగా ఉన్నాయి. గతంలో ఆధార్ వివరాల నమోదు తప్పనిసరి చేయగా.. ఇప్పుడు ఐచ్ఛికంగా ఉంచారు. కాగా, రాష్ట్రంలో కులగణనపైన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం గాంధీభవన్‌లో సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొననున్నారు.



కులగణన దరఖాస్తు మొదటి పేజీ

కులగణనలో తెలంగాణ దేశానికే మోడల్

» సామాజికవేత్తలతో సమావేశంలో భట్టి

» కులగణనపై నేడు కలెక్టర్లతో కాన్ఫరెన్స్



హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో చేపట్టనున్న కులగణన దేశానికే మోడల్‌గా నిలుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సామాజికవేత్తలు, మేధావులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. కులగణనలో చేయాల్సిన మార్పులు, చేర్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాలోచనలు జరిపారు. రాష్ట్రంలో వచ్చే నెల 6 నుంచి చేపట్టనున్న కులగణనకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, దిశా నిర్దేశం చేయడానికి మంగళవారం కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 300 మంది సామాజికవేత్తలు, మేధావులు, అభ్యుదయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను, సందేశాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. వీరితో పాటు కుల సంఘాలు, యువజన సంఘాలను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. వీరితో పాటు బీసీ కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ అభిప్రాయాలను సేకరిస్తామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే నాలుగు జిల్లాల్లో 56 ఇండ్లు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని కులగణన సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. న్యాయపర చిక్కులు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొఫెసర్ మురళి మనోహర్ సూచించారు. రోజుకు ఒక ఎన్యుమరేటర్ 15 ఇండ్లు సర్వే చేయడం భారమని, ఆ సంఖ్య ను పదికి కుదించాలని ఆకునూరి మురళి సూచించారు.

కాళేశ్వరం నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లోనే కట్టాలని ఆదేశాలు ఇచ్చింది ఎవరు? అని కమిషన్ గత విచారణలో ప్రశ్నించగా.. మాజీ సీఎం కేసీఆరేనని చెప్పిన ఆయన.. ఇప్పుడు అందుకు సంబంధించిన పత్రాలను అందించారు. అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాలతోనే హై పవర్ కమిటీ (హెచ్‌పీసీ) ఏర్పాటైందని, ఆ కమిటీ సమావేశంలోనే ఫలానా ప్రాంతాల్లో బ్యారేజీలు కట్టాలంటూ నిర్ణయం తీసుకున్నారని చెబుతూ.. హెచ్‌పీసీ సమావేశం తాలూకు మినిట్స్‌ను అందించారు. అలాగే, బ్యారేజీల వ్యయ అంచనాలకు, సవరణ అంచనాలకు ఎవరు ఆమోదం తెలిపారని కమిషన్ అడగ్గా.. కేసీఆరేనంటూ పత్రాలు సమర్పించారు. బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలని, ఆ నీటి నిల్వలను కొనసాగించాలని ఎవరు ఆదేశించారని ప్రశ్నించగా.. ప్రభుత్వాధినేత అంటూ కేసీఆర్ పేరు ఎత్తకుండా జవాబు ఇచ్చారు. బ్యారేజీల్లో సీకెంట్ పైల్స్ వినియోగించాలని చెప్పిందెవరని కమిషన్ ప్రశ్నించగా.. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) సిఫారసు చేసిందంటూ ఆధారాలను అందించారు. మూడు బ్యారేజీల జియో టెక్నికల్ పరీక్షలకు సంబంధించి 14 వాల్యూమ్‌ల నివేదికలను సమర్పించారు. బ్యారేజీల వద్ద టెయిల్ వాటర్ లేకపోవడం కూడా మేడిగడ్డలో బ్లాక్-7 కుంగుబాటుకు కారణమని, పిల్లర్లు 18, 19, 20 దెబ్బతినడానికి ప్రధాన కారణమని గుర్తు చేశారు. బ్యారేజీల్లో 2డీ, 3డీ అధ్యయనాలు మళ్లీమళ్లీ చేయాల్సి వచ్చిందా? అని కమిషన్ ప్రశ్నించగా.. అవునని బదులిస్తూ సంబంధిత పత్రాలనూ అందించారు. 3 బ్యారేజీల్లో ఐఎస్ కోడ్ 7349:2012లోని క్లాజులన్నీ పాటించారా అని కమిషన్ ప్రశ్నించగా.. అమలు చేశామని చెప్పారు. బ్యారేజీలు దెబ్బతిన్న తర్వాత వాటిని పరిశీలించి, మరమ్మతులు చేయాలని ఆదేశాలు ఇచ్చారా అని ఆరా తీయగా.. ఇచ్చానని వెంకటేశ్వర్లు తెలిపారు.

డిజైన్ల లోపం, ఓ అండ్ ఎం వైఫల్యమే కారణం

మేడిగడ్డలోని బ్లాక్-7 కుంగుబాటు, పలు పిల్లర్లు దెబ్బతినడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలకు డిజైన్ల ప్రకారం నిర్మాణం చేయకపోవడం, 2019 వరదల తర్వాత బ్యారేజీల దిగువ, ఎగువ భాగాల్లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేయకపోవడమే కారణమని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం కమిషన్‌కు నివేదిక అందించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు సహాయంగా నిపుణుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రికార్డులను, బ్యారేజీలను పరిశీలించి ఆ కమిటీ సోమవారం తన నివేదికను కమిషన్‌కు సమర్పించింది. వరద ప్రవాహానికి అనుగుణంగా డిజైన్ జరగలేదని, డిజైన్ ఒక విధంగా ఇస్తే.. నిర్మాణం మరో విధంగా జరిగిందని, నీటిని మళ్లించడానికే బ్యారేజీలను నిర్మించారని, కానీ, నీటిని మళ్లించకుండా దీర్ఘకాలం నిల్వ చేయడంతో ఇసుక మైనింగ్ జరిగి బ్లాకు కుంగిందని వివరించింది. సీకెంట్ పైల్స్ సక్రమంగా వేయకపోవడం కూడా బ్యారేజీల వైఫల్యానికి కారణమని నివేదించినట్లు సమాచారం. ఇక ఈ దఫా క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. మంగళవారం కమిషన్ కార్యాలయానికి వచ్చిన అనంతరం సాయంత్రం జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్నారు. తదుపరి విచారణ నవంబరులో ప్రారంభం కానుంది.

‘భూదాన్’పై నజర్!

(మొదటిపేజీ తరువాయి)

ప్రచురితమైన కథనం కలకలం రేపింది. ఈ కథనంపై స్పందించిన సీఎంవో తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం చర్యలకు దిగింది. ఈ కుంభకోణం వెనక ఎవరు ఉన్నా వదిలిపెట్టొద్దని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దారు కె.గోపాల్, సీఐ సీతారామ్, రెవెన్యూ సర్వే అధికారులు సోమవారం ఉదయం ఈ భూములను పరిశీలించారు. గ్రామంలోని భూదాన భూములన్నింటినీ సర్వే చేయడం ప్రారంభించారు. సర్వే సమయంలో స్థానిక పోలీసుల సహకారం తీసుకున్నారు. తిమ్మాపూర్ భూముల పరిశీలన అనంతరం రెవెన్యూ, పోలీసు అధికారులు ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. గ్రామంలో మొత్తం భూదాన భూముల్లో ధరణికి ముందు ఎంత భూమి చేతులు మారింది? తర్వాత ఎంత మారింది? అనేదానిపై వివరాలు సేకరిస్తున్నారు. ఈ భూముల రికార్డులను ఎలా మార్చారనేదానిపైనా విచారణ చేపట్టారు. ఈ 40 ఎకరాలు కాకుండా మిగతా భూములకు సంబంధించిన రికార్డు కూడా మార్చే ప్రయత్నం ఏమైనా చేశారా? అని పరిశీలిస్తున్నారు. మరోవైపు తిమ్మాపూర్‌లోని భూదాన భూముల వివరాల పంపించాలంటూ రెవెన్యూ అధికారులు భూదాన బోర్డుకు లేఖ రాశారు.

ఇళ్ల స్థలాలకు కేటాయింపు?

అన్యాక్రాంతమైన ఈ 40 ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఇందులో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. సాధారణంగా అసైన్డ్, భూదాన భూములు అన్యాక్రాంతమైతే ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకే ఇవ్వాలని చట్టం చెబుతోంది. అయితే లబ్ధిదారులు ఉద్దేశపూర్వకంగా దీన్ని ఇతరులకు విక్రయిస్తే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని.. వాటిని ఇతర పేదలకు పంపిణీ చేసే అవకాశం ఉంది. దీంతో తిమ్మాపూర్ భూముల్లో పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం.

అన్ని కోణాల్లో విచారించి కేసులు పెడతాం

తిమ్మాపూర్ భూదాన భూముల అన్యాక్రాంతంపై విచారణ చేపట్టాం. సర్వే నంబరు 6, 129, 130,147, 167, 197, 444, 453, 454, 455, 573, 574, 575ల్లోని భూదాన భూములన్నింటిపై సమగ్ర విచారణ జరుపుతున్నాం. దీనిపై పూర్తి నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. అన్ని కోణాల్లో దీనిపై విచారణ జరిపి భూదాన భూముల అక్రమాలకు కారకులపై కేసు పెడతాం. - కె.గోపాల్, తహసీల్దారు, కందుకూరు

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టులకు 7 నుంచి ధ్రువపత్రాల పరిశీలన!

- జూనియర్ లెక్చరర్ల పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టుల భర్తీలో భాగంగా వచ్చేనెల 7, 8 తేదీల్లో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఆ పరిశీలన ప్రక్రియ చేపడతారు. మరోవైపు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోని కెమిస్ట్రీ, హిస్టరీ, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన జూనియర్ లెక్చరర్ల పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపికైన వారి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

మొదటి దశ బీ-ఫార్మసీ సీట్ల కేటాయింపు!

రాష్ట్రంలో 10,436 మంది అభ్యర్థులకు బీ- ఫార్మసీ సీట్లను కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,854 బీఫార్మసీ సీట్లు ఉండగా, వీటి కోసం 16,145 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. మొదటి దశలో భాగంగా వారిలో 10,436 మందికి సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన వారు ఈనెల 30వ తేదీలోపు ఫీజు చెల్లించి కళాశాలలో రిపోర్ట్ చేయాలి. కాగా, రెండవ దశ కౌన్సెలింగ్ నవంబరు 11 నుంచి నిర్వహించనున్నారు.

నాడు జగన్మాయలు ఎన్నెన్నో..

హే రఘురాం!



తండ్రి సీఎంగా ఉన్నప్పుడు 2006లో జగన్ చేతికి రఘురాం సిమెంట్స్

- కడప జిల్లాలో అడ్డగోలుగా 2 వేల ఎకరాల సున్నపురాయి గనులు లీజుకు
- నాడు జగన్ పెట్టుబడి 45 కోట్లే
- 2008 నాటికి ఆ విలువ 6500 కోట్లు
- భారతి సిమెంట్స్‌గా పేరు మార్పు
- ప్రస్తుత వాటా 20 వేలకు కోట్లకు పైనే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

నాడు తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని జగన్ సంపాదించిన అక్రమాస్తుల్లో రఘురాం సిమెంట్స్ ముఖ్యమైనది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కడప జిల్లాలో ఈ కంపెనీకి దాదాపు 2 వేల ఎకరాల గను లు కేటాయించారు. కడప జిల్లాలో అప్పటికే ప్రాస్పెక్టింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసిన గుజరాత్ అంబూజా సిమెంట్స్ లిమిటెడ్‌ను బలవంతంగా పక్కకు తప్పించి మరీ కట్టబెట్టారు. ఎవరో స్థాపించిన కంపెనీకి జగన్ యజమాని అయ్యారు. నాడు తనయుడి కోసం వైఎస్ అడ్డదారులు తొక్కగా, జగన్ క్విడ్ ప్రోకోకు పాల్పడి పెట్టుబడులు పెట్టించుకున్నారు. కడప జిల్లాలోనే దాల్మియా సిమెంట్స్‌కు వెయ్యి ఎకరాల సున్నపురాయి గనులు లీజుకు ఇచ్చి ప్రతిఫలం పొందారు. భారతి సిమెంట్స్‌లో దాల్మియా 50 కోట్ల పెట్టుబడి పెట్టింది. ఇలా స్వల్ప వ్యవధిలోనే జగన్ వేల కోట్లు సంపాదించారు. ఇదేదో జగన్‌కు గిట్టనివారు, ప్రత్యర్థి పార్టీలు చెబుతున్న మాట కాదు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నాడు జగన్ అక్రమాస్తుల కేసులో దాఖలు చేసిన చార్జిషీటులో పేర్కొన్న అంశాలివీ. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడే 2008లో రఘురాం సిమెంట్స్ పేరును భారతి సిమెంట్స్‌గా మార్చేశారు.

45 కోట్ల నుంచి 6,500 కోట్లకు

వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు జగన్ అక్రమాస్తులను భారీగా సంపాదించారు. జగన్ కంపెనీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు క్యూ కట్టారు. ఆయన పెట్టుబడిగా పూచిక పుల్ల పెట్టినా.. బంగారం అయ్యేది. అంతా క్విడ్ ప్రోకో వ్యవహారం అన్నమాట. వైఎస్ ప్రభుత్వంలో ‘మేళ్లు’ పొందినవారు జగన్‌కు లబ్ధి చేకూర్చడానికి ఆయన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేవారు. రఘురాం సిమెంట్స్ వ్యవహారం కూడా ఇలాంటిదే. రఘురాం సిమెంట్స్‌ను 1999లో స్థాపించారు. వైఎస్ సీఎం అయ్యాక 2006లో ఈ కంపెనీ జగన్ చేతికి వచ్చింది. ఈ కంపెనీలో జగన్ అండ్ కో పెట్టిన పెట్టుబడి కేవలం రూ.45 కోట్లే. అయితే రెండేళ్లలోనే కంపెనీలో వాటాల విలువ ఏకంగారూ.6,500 కోట్లకు చేరింది. కంపెనీలో ఒక్కొక్కటి రూ.10 ముఖ విలువ కలిగిన ఐదున్నర కోట్ల షేర్లు ఉండగా... ఇందులో 82 శాతం వాటాకు జగన్ అండ్ కో కేవలం రూ.45 కోట్లు సమకూర్చగా... మిగిలిన 18 శాతం వాటాకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు పెట్టిన పెట్టుబడి మొత్తం రూ.129 కోట్లు. దాల్మియా సిమెంట్స్, మ్యాట్రిక్స్ నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన జీ2 కార్పొరేట్ సర్వీసెస్ దాదాపు రూ.112 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. నిమ్మగడ్డ ప్రసాద్ వ్యక్తిగత హోదా లో మరో రూ.8 కోట్లు పెట్టారు. దాల్మియా సిమెంట్స్ 2007 మార్చి 29వ తేదీన 16.66 లక్షల షేర్లను ఒక్కోదాన్ని రూ.110 ముఖ విలువకు కొనుగోలు చేసింది. ఆ తర్వాత మరోసారి 2008 ఫిబ్రవరి 26న దాల్మియా 1,37,931 షేర్లను ఒక్కోదాన్ని రూ.1440 చొప్పున కొనుగోలు చేసింది. ఏడాదిలోనే షేర్ విలువ ఏకంగా 13 రెట్లు పెరిగింది. ఇటు రఘురాం సిమెంట్స్‌లో అధిక ధరలకు షేర్లు కొంటూనే... అదే సమయంలో జగన్ కంపెనీకి సమీపంలో దాల్మియా కూడా సిమెంట్ కంపెనీని స్థాపించింది. ఇదే గమ్మత్తైన విషయం. దీని వెనుక క్విడ్ ప్రోకో జరిగిందన్నది ఆరోపణ. 2007 ఏప్రిల్ 9వ తేదీన జీ2 కార్పొరేట్ సంస్థకు రూ.94 చొప్పున 64.42 లక్షల షేర్లను జగన్ కేటాయించారు. 2007 సెప్టెంబరులో ఇండియా సిమెంట్స్ రూ.110 చొప్పున 12.5 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. మరో 2 నెలలకు నిమ్మగడ్డ రూ.175 చొప్పున 4.59 లక్షల షేర్లను కొన్నారు. ఇలా భారీ ధరలకు షేర్లు కొనుగోలు చేయడంతో కంపెనీ విలువ, జగన్ వాటా అమాంతం పెరిగిపోయాయి. రఘురాం/భారతి సిమెంట్స్ ప్రధాన ప్రమోటర్ జగన్, ఆయన స్నేహితులు, బంధువుల వాటా విలువ 2008 నాటికి ఏకంగా రూ.6,500 కోట్లకు చేరింది. ఇటు నాడు రఘురాం సిమెంట్స్‌కు గనుల శాఖ రెడ్‌కార్పెట్ పరచిమరీ కడప జిల్లాలో 2000 ఎకరాల సున్నపురాయి నిక్షేపాలను కట్టబెట్టింది.

ఏ1 జగన్.. ఏ2 విజయసాయి

రఘురాం/భారతి సిమెంట్స్ కేసులో సీబీఐ ఏ1గా జగన్‌ను, ఏ2గా విజయసాయిరెడ్డిని చేర్చింది. ఇదే కేసులో నాటి గనుల శాఖ డైరెక్టర్ రాజగోపాల్, జగన్ సన్నిహితుడు జేజే రెడ్డి, పరిశ్రమల శాఖ మాజీ కార్యదర్శి కృపానందం నిందితులని సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొంది.

దాల్మియాతో క్విడ్ ప్రోకో


భారతి సిమెంట్స్‌కు చెందిన షేర్లను దాల్మియా సిమెంట్స్ కొనుగోలు చేయడం వెనుక క్విడ్ ప్రోకో జరిగింది. నాటి రాజశేఖర రెడ్డి ప్రభుత్వందాల్మియా సిమెంట్స్‌కు 30 ఏళ్లకు కడప జిల్లాలో 1017 ఎకరాల సున్నపు రాయి గనులను లీజుకు ఇచ్చింది. ఇందుకు ప్రతిఫలంగా భారతి సిమెంట్స్‌లో దాల్మియా రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టింది. దాల్మియాకు గనుల లీజు వ్యవహారంపై నాటి సీఎం వైఎస్ ఆదేశాలను.. అప్పటి గనుల శాఖ డైరెక్టర్ రాజగోపాల్, కార్యదర్శి వైశ్రీలక్ష్మి పక్కాగా అమలు చేశారు. ఈ అక్రమాల గురించి సీబీఐ విచారణలో నాటి గనుల శాఖ సంయుక్త కార్యదర్శి ఎ.దయాకరరెడ్డి, ఆ శాఖ సూపరింటెండెంట్ కె.వెంకట్రావు వాంగ్మూలం ఇచ్చారు. ఈ వాంగ్మూలం ‘ఆంధ్రజ్యోతి’కి చిక్కింది.

ఈశ్వర్ సిమెంట్స్ నుంచి దాల్మియాకు

కడప జిల్లా నవాబుపేట, తాలమంచిపట్నం గ్రామాల్లోని 1017 ఎకరాల సున్నపురాయి నిక్షేపాల ప్రాస్పెక్టింగ్ లీజు కోసం 1997లో జయా మినరల్స్ గనుల శాఖకు దరఖాస్తు చేసుకుంది. అయితే దీన్ని గనుల శాఖ తిరస్కరించింది. 2004లో సీఎంగా వైఎస్ బాధ్యతలు స్వీకరించాక ఈ ఫైలుకు రెక్కలు వచ్చాయి. కంపెనీ ఆర్థిక స్థోమతను వివరిస్తూ సమాచారం ఇవ్వాలంటూ జయా మినరల్స్‌కు గనుల శాఖ లేఖ రాసింది. దీంతో జయా మినరల్స్ గనుల శాఖ లేఖకు వెంటనే స్పందించింది. ఈ కంపెనీకి ప్రాస్పెక్టింగ్ లీజు మంజూరు చేయాలని కోరుతూ గనుల శాఖ డైరెక్టర్ రాజగోపాల్ ఫైలు పంపారు. ఈ సంస్థ కు ప్రాస్పెక్టింగ్ లీజు ఇవ్వాలంటే కచ్చితంగా ఈశ్వర్ సిమెంట్స్‌కు లీజు భూములు బదిలీ చేయాలంటూ రాజగోపాల్ షరతు విధించారు. జయా మినరల్స్‌కు అనుబంధ సంస్థ అయినప్పటికీ ఈశ్వర్ మినరల్స్ పేరిట లీజు మంజూరు చేయడం కుదరదని అప్పటి గనుల శాఖ సంయుక్త కార్యదర్శి పేర్కొన్నారు. అయినా ఈశ్వర్ సిమెంట్స్‌కు ప్రాస్పెక్టింగ్ లీజు ఇవ్వాలని ప్రతిపాదిస్తూ రాజగోపాల్ నోట్‌ఫైల్‌ను పంపారు. ఈ నోట్ ఫైల్‌కు గనుల శాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి ఆమోద ముద్ర వేశారు. గనుల శాఖ మంత్రి కూడా ఓకే చేశారు. 2006 జూలై 14న తొలుత జయా మినరల్స్‌కు.. తర్వాత మరో జీవో నంబరుతో ఈశ్వర్ సిమెంట్స్‌కు గనులు కేటాయిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. లీజు పొందనున్న ప్రాంత సమీపంలోనే ఈశ్వర్ సిమెంట్స్ కంపెనీ స్థాపించనున్నదని రాజగోపాల్ సర్కారుకు ప్రతిపాదనలు పంపారు. దీనికి 2008 జనవరిలో 30 ఏళ్లకు మైనింగ్ లీజు మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. అయితే ఈ ప్రతిపాదలు పంపేనాటికి ఈశ్వ ర్ సిమెంట్స్ ఏర్పాటే కాలేదు. తర్వాత గనుల శాఖ డైరెక్టర్ సర్కారుకు మరో ప్రతిపాదన పంపుతూ ఈశ్వర్ సిమెంట్స్‌కు కేటాయించిన మైనింగ్ లీజును దాల్మియా సిమెంట్‌కు బదిలీ చేయాలని సిఫారసు చేశారు. ఈశ్వర్ సిమెంట్స్ దాల్మియా సిమెంట్స్‌కు 100% అనుబంధ సంస్థగా ఉందని గనుల శాఖ ఈ లేఖలో పేర్కొంది. వీటి ఆధారంగా 2008లో జీవో నంబర్ 321 జారీ చేశారు.

ఆడపడుచుతో కన్నీరు పెట్టిస్తే ఇంటికి అరిష్టం

- విజయలక్ష్మే ఈ సమస్యను పరిష్కరించాలి
- వైఎస్ మరణంలో బాబు పాత్ర ఉందనడం సిగ్గుచేటు: బాలినేని



హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఆడపడుచుతో కన్నీరు పెట్టిస్తే ఇంటికి అరిష్టమని ఏపీ మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి మాజీ సీఎం జగన్ నుద్దేశించి అన్నారు. ఆస్తుల విషయంలో రాజశేఖరరెడ్డి కుటుంబం గొడవలు పెట్టుకుని వైఎస్‌ను బజారుకీడ్చడం ఎంతో బాధ కలిగిస్తోందని చెప్పారు. ఆయన సోమవారం మాదాపూర్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఆస్తుల వివాదం నాలుగేళ్ల నుంచి జరుగుతోందని.. రాజశేఖరరెడ్డి బతికున్నప్పుడు సంపాదించిన ఆస్తులనే షర్మిల అడుగుతోందని.. 2009 తర్వాత ఆ కుటుంబానికి వచ్చిన ఆస్తులేవీ అడగడం లేదు కదా అని ప్రశ్నించారు. ఆయన కుటుంబం గురించి మాట్లాడే అర్హత లేని వ్యక్తులు (వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి) ఈ విషయంలో బహిరంగంగా మాట్లాడడం చాలా బాధ కలిగిస్తోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించగలిగింది విజయలక్ష్మి మాత్రమేనని తెలిపారు. మీ సమస్యను మీరు పరిష్కరించుకోలేక చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వం తమ కుటుంబాన్ని చీలుస్తున్నారని జగన్ మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. అలాగే రాజశేఖరరెడ్డిని చంపిన కుట్రలో చంద్రబాబు పాత్ర ఉందనడం సిగ్గుచేటని స్పష్టం చేశారు. ఆయన మరణంలో కుట్ర ఉంటే గత ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉండి ఎందుకు విచారణ చేయించలేదని నిలదీశారు.

8 కి.మీ.కు ఒక ఆరోగ్య కేంద్రం

- మంత్రి దామోదర రాజనర్సింహ

రేగోడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అందరికీ వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రతి 8 కి.మీ.కు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం మెదక్ జిల్లాలో రూ.7 కోట్లతో మంజూరైన బోరంచ నల్లపోచమ్మ ఎత్తిపోతల పథకం అదనపు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే రేగోడు-మర్పల్లి, చౌదర్పల్లి- కొత్వాల్‌పల్లి చెరువులకు సింగూర్ జలాలను కాలువల ద్వారా నింపే పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని, మిగిలిన వారికి త్వరలోనే రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని చెప్పారు. అందోల్ నారాయణ ఖేడ్ మధ్యలో రేగోడు మండలంలో ఐటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.